ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 15.11.2026 | సంపుటి:13 సంచిక:115 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





ఫాసిస్టు రాజకీయాలు

2014లో జరిగిన ఎన్నికలు గతంలో ఎప్పుడూ చూడలేదు. రూ.వందల కోట్లు ఖర్చు చేశారు. 2014 ఎన్నికల్లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ కూటమి ఎక్కువ సీట్లు గెలిచింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన 3 నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. మహారాష్ట్ర ఎన్నికల్లోనూ అనేక అవకతవకలకు పాల్పడ్డారు. ఆ రాష్ట్రంలో 3 నెలల వ్యవధిలో 70 లక్షల మందిని ఓటర్లుగా నమోదు చేశారు. అదనంగా చేర్చిన ఓట్ల ద్వారానే బీజేపీ గెలిచింది. వ్యవస్థలు నాశనం అవుతున్నా మనం ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్నాం. హైదరాబాద్, బెంగళూరులో ఐటీ రంగం బాగా అభివృద్ధి చెందింది" - రాహుల్ గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత



వేదికపై సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కరచాలనం

రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటు లేదు..

- ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాలి
- అదానీకి మోదీ ప్రభుత్వ అండదండలు
- భారత్ సమిట్ ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగం

హైదరాబాద్(జనంసాక్షి): రాజకీయాల్లో ఫాసిస్టు భావజాలానికి, నియంతృత్వ ధోరణులకు చోటు లేదని రాహుల్ స్పష్టం చేశారు. భారత్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో జరిగిన ఎన్నికలు గతంలో ఎన్నడూ చూడని రీతిలో జరిగాయని, వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ప్రజలు ఎక్కువ స్థానాలు కట్టబెట్టారని, అయితే కేవలం మూడు నెలల వ్యవధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు. అదనంగా చేర్చిన ఓట్ల కారణంగానే బీజేపీ విజయం సాధించిందని విమర్శించారు.

మిగతా 2లో..

గిగ్‌వర్కర్‌బైక్‌పై రాహుల్

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

- గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా.. రూ.10 లక్షల ఆరోగ్య బీమా
- గిగ్ వర్కర్లు బానిసలనేది బీజేపీ భావజాలం
- భాగస్వాములనేది కాంగ్రెస్ భావజాలం
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, రేవంత్ రెడ్డి

2లో



శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో రాహుల్ గాంధీ ఓ యువతి బైక్‌పైన ప్రయాణించారు. నెమ్మదిగా వెళ్లమని చెప్పినట్లు ఆ యువతి పేర్కొంది. ఒకవైపు చదువుకుంటూనే.. ఖాళీ సమయాల్లో యువతి బైక్‌ను అద్దెకు నడుపుతోంది.

పెట్టుబడిదారులకు అన్ని విధాలా సహకరిస్తాం

తెలంగాణకు పాలసీ పెరాలసిస్ లేదు

- పెట్టుబడులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక విధానాలు
- విద్య, వైద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో విధానపరమైన గందరగోళం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు పాలసీ పెరాలసిస్ లేదని,

మిగతా 2లో..



పాక్‌పై ఉత్కంఠభరిత ఫైనల్లో ..

ఆఖరి బంతికి విజయం

అండర్-19 ఆసియా కప్ మనదే..



ఫైనల్లో భారత్ ఒక వికెట్ తేడాతో విజయం

అల్ అమెరత్ (ఒమన్)(జనంసాక్షి):అండర్-19 వన్డే ఆసియాకప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో భారత్ ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని భారత్ సరిగ్గా 50 ఓవర్లలో ఛేదించింది. చివరి బంతికి మూడు పరుగులు చేయాల్సిన దశలో మోహిత్ (49; 26 బంతుల్లో) ఫోర్ బాది జట్టును విజయతీరాలకు చేర్చాడు. కెప్టెన్,

మిగతా 2లో..

నీటి హక్కులకై బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం

ప్రధాని మోదీని నిలదీస్తారా?.. తలవంచి తిరిగొస్తారా?

సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లను ప్రశ్నించిన హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రధానమంత్రిని.. సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ నిలదీయగలరా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. "దిల్లీ పర్యటనలో ప్రధాని మోదీని నిలదీస్తారా? లేక తలవంచి తిరిగొస్తారా? రాష్ట్రానికి రావాల్సిన 968 టీఎంసీల హక్కుపై ప్రధాని నుంచి హామీ కావాలి. ఇచ్చంపల్లి ప్రాజెక్టు కాదని.. పోలవరం ప్రాజెక్టు ప్రారంభిస్తే సహించేది లేదు. రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం,

మిగతా 2లో..



మరోసారి తుపాను ముప్పు



ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

విశాఖపట్నం(జనంసాక్షి): ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న సుస్పష్టమైన అల్పపీడనం వాయువ్యదిశగా కదులుతూ మరి కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి వెంకన్నదొర తెలిపారు. ఈనెల 16న

మిగతా 2లో..

తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జిగా బీఎం సందీప్

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో అధిష్ఠానం ఉత్తర్వులు



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జి నియామకంపై నెలకొన్న ఉత్కంఠకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెరదించింది. ఇన్‌ఛార్జిగా బీఎం సందీప్‌ను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన నేపథ్యంలో ఆమె స్థానంలో ఈ మార్పు జరిగింది. ఆమె అందించిన సేవలను పార్టీ అధిష్ఠానం ప్రత్యేకంగా ప్రశంసించింది. కొత్త ఇన్‌ఛార్జి రేసులో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, మాణిక్‌రావు ఠాక్రే తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. చివరకు అధిష్ఠానం బీఎం సందీప్‌కు తెలంగాణ బాధ్యతలు అప్పగించింది.



ప్రముఖ నటుడు గిరిబాబు ఇకలేరు

హైదరాబాద్(జనంసాక్షి): ప్రముఖ తెలుగు సినీ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. 1946 జూన్ 8న ప్రకాశం

మిగతా 2లో..

విద్యాశాఖలోనే పాలిటెక్నిక్‌లు

జీవో 97ను సవరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్(జనంసాక్షి): పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ (శక్తి విభాగం) పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈమేరకు జీవో 97ను సవరిస్తూ జీవో 157ను విడుదల చేసింది. పాలిటెక్నిక్‌లు విద్యాశాఖలోనే కొనసాగుతాయని జీవోలో స్పష్టం చేసింది. ఐటీఐలు, ఏటీఐలు మాత్రం కార్మిక శాఖ పరిధిలోకి వెళ్లాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ విద్యాశాఖ పరిధిలో ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం జులై 3న జీవో 97ను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా అప్పటి కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ పేరును శక్తిగా మారుస్తూ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను శక్తి పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అదే సమయంలో పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై దాదాపు నెల రోజుల

మిగతా 2లో..

హసీనాను తీసుకెళ్లాలంటే..

సైనిక విమానంతో రండి

బంగ్లాకు భారత్ షరతులు



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్లనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఆమె తిరిగి వెళ్లడానికి భారత్ సుముఖంగానే ఉన్నప్పటికీ.. హసీనా భద్రత విషయంలో పొరుగు దేశం హామీ ఇవ్వాలని కోరుతూ పలు షరతులు పెట్టినట్లు సమాచారం. ఈ మేరకు బంగ్లా మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమెపై దాడులు జరగకుండా భద్రత కల్పించడం, తనకు విధించిన మరణ శిక్షపై హసీనా న్యాయస్థానంలో అప్పీలు చేసుకునే అవకాశం కల్పించడం, నిష్పక్షపాతంగా విచారణను ఎదుర్కొని న్యాయం జరిగేలా చూడడం, 2024 నాటి అణచివేత ఘటనలపై తిరిగి విచారణ జరపడం

మిగతా 2లో..



భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం

త్వరలోనే ఖరారు కావొచ్చు

కానీ మార్పులు ఎక్కువగా అమెరికా వైపే ఉన్నాయి:జైశంకర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్- అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కావొచ్చని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి చాలా వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని, మిగిలిన కొన్ని అంశాలపై చర్చలు జరుగుతున్నాయని

మిగతా 2లో..

ఏటా 1.5లక్షల మంది విదేశీ విద్యార్థులకే ఎంట్రీ

కెనడా కొత్త రూల్స్..

ఓట్టావా(జనంసాక్షి):వలసల సమస్యలతో ఇబ్బంది పడుతోన్న కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక వలసలపై కఠిన నియంత్రణ దిశగా చర్యలు చేపట్టిన అక్కడి ప్రభుత్వం.. విదేశీ విద్యార్థుల రాకపై పరిమితులు విధించింది. వచ్చే రెండేళ్ల పాటు ఏటా లక్షన్నర మంది విదేశీ విద్యార్థులను మాత్రమే తమ దేశంలోకి అనుమతించనుంది. విద్యా అవకాశాలు, శ్రామిక శక్తి అవసరాల్లో సమతుల్యత పాటించడంతో పాటు వసతి, ప్రజా సేవలపై ఒత్తిడిని తగ్గించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా వెల్లడించింది. కేవలం విద్యార్థులే కాదు.. ఇతర వలసదారుల సంఖ్యపైనా పరిమితి తీసుకొచ్చింది.

మిగతా 2లో..

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ ఐపీఎస్ హనుమంతుకు గాయాలు

తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తుండగా ఘటన

2లో

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15.11.2026

గిగ్‌వర్కర్‌బైక్‌పై రాహుల్

శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో రాహుల్ గాంధీ ఓ యువతి బైక్‌పైన ప్రయాణించారు. నెమ్మదిగా వెళ్లమని చెప్పినట్లు ఆ యువతి పేర్కొంది. ఒకవైపు చదువుకుంటూనే.. ఖాళీ సమయాల్లో యువతి బైక్‌ను అద్దెకు నడుపుతోంది.

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

హైదరాబాద్(జనంసాక్షి):గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. జయభేరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన గిగ్ వర్కర్ల సభకు వీరు హాజరయ్యారు. గిగ్ వర్కర్స్ విధివిధానాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు."గతంలో గిగ్ వర్కర్లతో భేటీలో పలు సమస్యలు పంచుకున్నారు. మీ సంక్షేమం కోసం ఇచ్చిన హామీని నేడు పూర్తి చేస్తున్నాం. ఇప్పటి వరకు గిగ్‌వర్కర్ల సమాచారానికి సంబంధించిన వివరాలు లేవు. మీ శ్రమకు సంబంధించి ఎంత ప్రతిఫలం లభిస్తుందో తెలియదు. మీ సమాచార వివరాలను ఈ చట్టం ద్వారా పొందవచ్చు. డెలివరీ, శ్రమ, ప్రతిఫలం అన్ని వివరాలు మీ ఫోన్‌లోనే వస్తాయి. గిగ్‌వర్కర్లకు వైఫైతో కూడిన విశ్రాంత భవనం అందుబాటులోకి వస్తుంది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో విశ్రాంత భవనాలు నిర్మిస్తాం""గిగ్ వర్కర్లకు ప్రభుత్వం రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందిస్తోంది. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం చర్యలు చేపట్టాం. ప్రతి డెలివరీలో ఒక శాతం నగదు గిగ్ వర్కర్ల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా మీ బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం. గిగ్ వర్కర్ల శ్రమ, ఫలితం కంపెనీలకే దక్కేలా కేంద్రం చర్యలు ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ పార్టీ గిగ్‌వర్కర్లకు పూర్తి అండగా ఉంటుంది" అని రాహుల్ తెలిపారు.

పాక్‌పై ఉత్కంఠభరిత ఫైనల్లో .. ఆఖరి బంతికి విజయం

ఓపెనర్ లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని (80; 101 బంతుల్లో), ఆర్యవీర్ సెహ్వాగ్ (58; 61 బంతుల్లో) అర్ధ శతకాలు చేశారు. మనల్ చౌహాన్ (47; 32 బంతుల్లో) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీకే వినీత్ (24), అన్వయ్ ద్రవిడ్ (19), అర్జున్ రాజ్‌పుత్ (16) పరుగులు చేశారు. రాజేశ్, ఆర్యవీర్ తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్యవీర్ ఔటైనా వినీత్‌తో కలిసి రాజేశ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తర్వాత వినీత్, అర్జున్, యశ్ (9) పెవిలియన్‌కు చేరడంతో 33 ఓవర్లకు భారత్ 187/4తో నిలిచింది. కాసేపటికే వరుస బంతుల్లో రాజేశ్, అన్వయ్ కూడా ఔట్ కావడంతో భారత్ 223/6తో కష్టాల్లో పడింది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన మనల్ చౌహాన్ మొదట్లో నెమ్మదిగా ఆడి తర్వాత జోరు పెంచాడు. నికాబ్ షఫిక్ వేసిన 40 ఓవర్‌లో మనల్ రెండు ఫోర్లు, సిక్స్ బాదడంతో భారత్ విజయసమీకరణం 60 బంతుల్లో 90 పరుగులుగా మారింది. మరోవైపు.. ఆర్యన్ సవ్వాని (9), కావ్యా పటేల్ వరుస ఓవర్లలో ఔట్ కావడంతో భారత్ 252/8తో మళ్లీ కష్టాల్లో పడింది.ఈ దశలో మనల్‌కు మోహిత్ తోడయ్యాడు. ఈ జోడీ నిలకడగా బౌండరీలు బాది లక్ష్యాన్ని కరిగించింది. 45-46 ఓవర్ల మధ్య ఈ ద్వయం 45 పరుగులు రాబట్టింది. 48 ఓవర్‌లో మనల్ ఔట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. టీమ్‌ఇండియా విజయానికి చివరి రెండు ఓవర్లలో 25 పరుగులు అవసరం కాగా.. 49 ఓవర్లో మోహిత్ వరుసగా 4, 6 బాదాడు. ఈ ఓవర్‌లో మొత్తం 17 రన్స్ రావడంతో చివరి ఓవర్‌లో 8 పరుగులు అవసరమయ్యాయి. ఆఖరి ఓవర్‌లో మొదటి ఐదు బంతుల్లో ఐదే రన్స్ రావడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. చివరి బంతిని మోహిత్ ఏ మాత్రం తడబడకుడా బౌండరీకి తరలించడంతో భారత్ జట్టు సంబరాల్లో మునిగిపోయింది.

మరోసారి తుపాను ముప్పు..

తుపానుగా, 18న ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఈనెల 18, 19 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.18న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 19న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి తీరం వెంట గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు.. గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆదివారం సాయంత్రానికి తీరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ నెల 16 నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కావొచ్చు

ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో తెలిపారు. మిగిలి ఉన్న సమస్యల్లోనూ చాలా వరకు భారత్ వైపు లేవని, అమెరికా నుంచే ఎక్కువ మార్పులు అవసరమని చెప్పారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వచ్చే నెలలో అమెరికాలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి."లాభాదాయకమైన, సమతుల్యమైన, పోటీ దేశాలతో పోలిస్తే అదనపు ప్రయోజనాన్ని చేకూర్చే వాణిజ్య ఒప్పందం భారత్‌కు అవసరం. ఇది సాధ్యపడుతుందని ఆశిస్తున్నాం. ఈ ఒప్పందాన్ని కేవలం వాణిజ్య కోణంలోనే కాకుండా.. రెండు దేశాల మధ్య ఉన్న విస్తృత దృక్పథంతో చూడాలి. భారత్‌కు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం వల్ల మనకు ప్రయోజనం చేకూరుతుంది. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడమే ఇప్పుడు అసలైన సవాల్. ఎందుకంటే ఇది ప్రజల జీవనోపాధితో ముడిపడి ఉన్న అంశం" అని జైశంకర్ పేర్కొన్నారు.

హసీనాను తీసుకెళ్లాలంటే.. సైనిక విమానంతో రండి

వంటివి అందులో ఉన్నట్లు తెలుస్తోంది.అదే సమయంలో హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు తీసుకెళ్లడానికి ఆ దేశం తమ సైనిక విమానాన్ని పంపాలని భారత్ అడిగినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. లేదంటే భారత్-బంగ్లా భూ సరిహద్దు మార్గంలో పొరుగు దేశ సైన్యం హసీనాను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని షరతు విధించినట్లు తెలిపాయి. ఈ కథనాలపై బంగ్లాదేశ్ ప్రధాని సహాయ మీడియా కార్యదర్శి నజ్ముల్ హక్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హసీనాకు ఆశ్రయం కల్పించడానికి ఏ దేశమూ సుముఖత చూపట్లేదన్నారు. ఆమెకు ఒక్కొక్కటిగా అన్ని మార్గాలు మూసుకుపోయాయని అన్నారు. దీంతో చివరి ప్రయత్నంగా ఆమె బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని కోరుకుంటున్నారంటూ విమర్శలు చేశారు. అయితే, హసీనా విషయంలో భారత్ షరతులు విధించినట్లు వస్తున్న కథనాలను బంగ్లా ప్రభుత్వం ధ్రువీకరించలేదు. మరోవైపు, వీటిపై స్పందించడానికి భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సైతం నిరాకరించడం గమనార్హం.





ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా

ఫాసిస్టు రాజకీయాలు

రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, హూంకరించడం కాదని, ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించడమే నిజమైన రాజకీయమని అన్నారు.హైదరాబాద్, బెంగళూరులో ఐటీ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 12 ఏళ్ల క్రితం ప్రపంచ సంపన్నుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న అదానీ, మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో స్థానానికి చేరుకోవడం వెనుక ప్రభుత్వ అండదండలు ఉన్నాయని ఆరోపించారు.ఏ రంగాన్ని పరిశీలించినా అదానీ పెట్టుబడులు కనిపిస్తున్నాయని, పోర్టులు, విమానాశ్రయాలు, మౌలిక సదుపాయాల రంగాలను ఆయనకు అప్పగించారని విమర్శించారు. ప్రభుత్వ విధానాల ద్వారా లబ్ధి పొందిన వ్యాపారవేత్తలు వ్యవస్థలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఈ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు అన్ని విధాలా సహకరిస్తాం

పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, అనుమతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించామని చెప్పారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడంతో పాటు హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. వైద్య రంగంలోనూ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు పీహెచ్‌ఎఫ్‌ఐ వంటి సంస్థలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించుకున్నామని, మిగతా టిమ్స్ ఆస్పత్రులను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా నిర్మిస్తున్నామని, ఆస్పత్రుల అభివృద్ధి కోసం మొత్తం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. దేశంతో పాటు మధ్యప్రాచ్య, ఆసియా దేశాలు కూడా పెట్టుబడుల కోసం హైదరాబాద్ వైపు చూస్తున్నాయని చెప్పారు. గత నాయకులు తీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాలే నేటి హైదరాబాద్ అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో అక్షరాస్యత కేవలం 12 శాతం మాత్రమే ఉండేదని, ఆహార కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఐఐటీ ఖరగ్‌పూర్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు పునాదులు వేశారని చెప్పారు. శ్రీశైలం, భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయానికి నీటి వసతి పెరిగిందని, దేశం ఆహార కొరత నుంచి మిగులు ఆహార ధాన్యాల స్థాయికి చేరుకుందని వివరించారు. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సాంకేతిక మార్పులు దేశంలో సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి బాటలు వేశాయని సీఎం అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు ప్రపంచంలోని ప్రముఖ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలోని ప్రతి గ్రామానికి విద్య చేరినా, నాణ్యమైన విద్య అందించడంపై ఇంకా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పిల్లలు... ప్రపంచంతో పోటీ పడాలి: సీఎం రేవంత్‌తెలంగాణలోని మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో పనిచేసే వారితో పోటీపడే స్థాయికి ఎదగాలని రాష్ట్ర సీఎం రేవంత్ ఆకాంక్షించారు. పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశ చూపాయని చెప్పారు. రాష్ట్రంలో గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి విధానాలను తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందన్నారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా విభేదాలు ఉండవచ్చని, కానీ అభివృద్ధికి ఉపయోగపడే విధానాలను మాత్రం కొనసాగించాలన్నదే తమ అభిప్రాయమని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు, విద్యాసంస్థల విషయంలో తమకు ఎలాంటి వివక్ష లేదన్నారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని, ఇక్కడే అంతర్జాతీయ స్థాయి విద్య అందుబాటులోకి వస్తోందని చెప్పారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు గొప్ప వరమని, దాని లోపల సుమారు కోటి 34 లక్షల మంది నివసిస్తున్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తూ ఈ ప్రాంతాన్ని సేవారంగానికి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, 160 కిలోమీటర్ల రహదారికి టెండర్లు పిలిచామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు అవతలి ప్రాంతాన్ని రేర్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని, పెట్టుబడులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆదాయంలో సుమారు 65 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాగా రంగారెడ్డి నిలిచిందని చెప్పారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, పారిశ్రామికవేత్తలు ఎలాంటి సందేహాలు లేకుండా పెట్టుబడులు పెట్టవచ్చని సీఎం భరోసా ఇచ్చారు. రాఫెల్ యుద్ధ విమానాలకు సంబంధించిన విడిభాగాలు కూడా హైదరాబాద్‌లోని జీఎంఆర్ పరిధిలో తయారవుతున్నాయని చెప్పారు. 1960వ దశకంలో నెహ్రూ, ఇందిరాగాంధీ చొరవతో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ ఏర్పాటు కావడం వల్లే రాష్ట్రంలో ఫార్మా రంగానికి పునాదులు పడ్డాయని గుర్తుచేశారు. పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల హైదరాబాద్ ఫార్మా రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. దేశంలోని బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్‌లోనే జరుగుతోందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా సంస్థ ఎలీ లిల్లీ హైదరాబాద్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తోందని చెప్పారు. అనేక అంతర్జాతీయ సంస్థలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని, పెట్టుబడిదారులకు అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. వైద్య రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రతి ఏటా సుమారు రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించి, రాష్ట్రంలో రోగుల వివరాలను సేకరించామని చెప్పారు. తెలంగాణ డేటా రిచ్ స్టేట్ అని, ఆరోగ్యశ్రీ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తే ఏ ప్రాంతంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో తెలుసుకోవచ్చని వివరించారు. ఫ్లోరైడ్ సమస్యతో పాటు మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రముఖ నటుడు గిరిబాబు ఇకలేరు

జిల్లా కొరిశపాడు రావినూతల గ్రామంలో జన్మించిన ఆయన 'జగమే మాయ' చిత్రంతో పరి శ్రమకు పరిచయమయ్యారు. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 'సింహ గర్జన', 'మెరుపుదాడి', 'ఇంద్రజిత్', తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. 'రణరంగం', 'ఇంద్రజిత్' 'నీ సుఖమే నే కోరుకున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. గిరిబాబు సతీమణి 2016లో అనారోగ్యంతో కన్నుమూశారు. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తె మాధవితో పాటు, రఘుబాబు, బోసుబాబు ఇద్దరు కుమారులు. రఘుబాబు హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. 2023లో విడులైన 'అన్నీ మంచి శకునములే' గిరిబాబు నటించిన చివరి చిత్రం.

స్వగ్రామంలో గిరిబాబు అంత్యక్రియలు..

శిఆరు నెలలుగా నాన్న అల్జీమర్స్, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని ఆయన తనయుడు రఘుబాబు అన్నారు. నాలుగు రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం కన్నుమూశారని వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం రావినూతలలో తండ్రి గిరిబాబు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


విద్యాశాఖలోనే పాలిటెక్నిక్‌లు

పాటు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. విద్యార్థుల నిరసనలపై స్పందించిన ప్రభుత్వం కె.కేశవరావు నేతృత్వంలో హైపవర్ కమిటీని నియమించింది. కమిటీ సిఫార్సుల మేరకు పాలిటెక్నిక్ కాలేజీలను విద్యాశాఖ కిందే యథావిధిగా కొనసాగిస్తామని, స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయబోమని తాజాగా జీవో జారీ చేసింది.

నీటి హక్కులకై బీఆర్‌ఎస్ మరో ప్రజా ఉద్యమం

కేంద్రం వివక్ష వల్ల తీరని అన్యాయం జరుగుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు చెప్పినట్లు చేస్తే.. రేవంత్, ఉత్తమ్ చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

వాహ్ వా.. వాయేజర్-1



18 నాటికి భూమి నుంచి లైట్ ఇయర్ దూరం చేరుకోనున్న వ్యోమనౌక

వాషింగ్టన్(జనంసాక్షి): మానవ రోదసీ చరిత్రలో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. 1977లో నాసా ప్రయోగించిన వాయేజర్-1 సరికొత్త రికార్డుకు సమీపించింది. తన అంతరిక్ష ప్రయాణంలో భాగంగా ఈ నెల 18 నాటికి ఈ ఖగోళ పరిశోధక వ్యోమనౌక భూమి నుంచి సరిగ్గా ఒక లైట్ ఇయర్ (కాంతి ఒక రోజులో ప్రయాణించే దూరం) దూరం చేరుకోనుంది. అంటే దాదాపు 2,590 కోట్ల కిలోమీటర్లు అన్నమాట. ఆ సమయానికి అది పంపే రేడియో సంకేతాలు కాంతి వేగంతో ప్రయాణించి భూమిని చేరడానికి సరిగ్గా 24 గంటలు పడుతుంది. మానవ నిర్మిత వస్తువొకటి భూమి నుంచి ఇంత దూరం ప్రయాణించడం ఇదే మొదటిసారి.బాహ్య సౌర వ్యవస్థను, సూర్యుడి హెలియోస్పియర్‌కు ఆవలి.. నక్షత్ర మండలాల మధ్య ఉండే విస్తారమైన అంతరిక్ష ప్రాంతాన్ని అధ్యయనం చేసేందుకు వాయేజర్ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా 1977 సెప్టెంబర్ 5న వాయేజర్-1ను ప్రయోగించింది. ఈ అంతరిక్ష పరిశోధక నౌక 1979లో గురుడు, 1980లో శని గ్రహాలను దాటేసింది. సౌరమండలాన్ని అధిగమించి.. 2012లో ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. మరోవైపు.. వాయేజర్-1 ప్రయోగానికి రెండు వారాల ముందే వాయేజర్-2 నింగిలోకి దూసుకెళ్లింది. గురు, శని గ్రహాలతోపాటు యురేనస్, నెప్ట్యూన్‌లను దాటుతూ ఈ వ్యోమనౌక ఎన్నో అద్భుతమైన ఫొటోలు పంపింది. ఇది 2018లో ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. వాయేజర్-2 లైట్ ఇయర్ దూరం చేరుకునేందుకు 2035 వరకు ఎదురు చూడాల్సిందేనట. రెండు వాయేజర్‌లలో 30 సెంటీమీటర్ల బంగారు పూత పూసిన ఫోనోగ్రాఫిక్ రికార్డ్ అమర్చారు. అందులో 55 భాషల్లో శుభాకాంక్షలు, రేఖాచిత్రాల వంటివి పొందుపర్చారు. ఒకవేళ గ్రహాంతర వాసులు ఈ వ్యోమనౌకలను కనుగొంటే.. "భూగ్రహం మీదున్న పిల్లల నుంచి నమస్కారం" అని ప్రముఖ అమెరికన్ శాస్త్రవేత్త కార్ల్ సాగన్ అప్పట్లో ఆరేళ్ల వయసున్న తన కుమారుడు నిక్ గొంతును కూడా చేర్చారు. ఇదిలా ఉండగా.. వాయేజర్-1 సంబరాలకు నాసా సిద్ధమైంది. మంగళవారం సూర్యాస్తమయం తర్వాత.. ప్రజలు తమ ఫోన్లలోని లైట్లను లేదా టార్చ్‌లైట్లను వెలిగించి ఆకాశం వైపు ప్రసరింపజేయాలని కోరింది.

తప్పిన పెనుప్రమాదం

- మిసిసిపి నదిలో క్రూజ్ నౌకను ఢీకొట్టిన భారీ ట్యాంకర్
- ఘటనలో ఓవైపు ఒరిగిపోయిన ప్రయాణికుల నౌక
- 32 మందికి గాయాలు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలోని మిసిసిపి నదిలో పెను ప్రమాదం తప్పింది. న్యూ ఓలెన్స్ పోర్టు వద్ద ఆగి ఉన్న ఐదు అంతస్తుల 'అమెరికన్ హెరిటేజ్' క్రూజ్ నౌకను 'అట్లాంటిక్ ఆస్ఫాల్ట్' అనే భారీ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి నౌక అద్దాలు, లోహపు భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. క్షణాల్లోనే నౌకలోకి నీరు చేరడంతో ఒకవైపు ఒరిగిపోయింది. దీంతో అందులోని ప్రయాణికులు, సిబ్బంది ప్రాణభయంతో నదిలోకి దూకారు. వెంటనే అప్రమత్తమైన ఇతర నౌకల ఆపరేటర్లు, పోర్టు సిబ్బంది, పోలీసులు సహాయకచర్యలు చేపట్టారు. డజన్ల కొద్దీ ప్రయాణికులను నదిలో నుంచి సమీప నౌకల్లోకి లాగి రక్షించారు. ప్రమాద సమయంలో నౌకలో ప్రయాణికులు, సిబ్బంది కలిపి 180 మంది ఉండగా.. సుమారు 32 మంది గాయపడ్డారు. నీళ్లలో నౌక ఒరిగిపోయిన భయానక దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



భారత్‌కు రానున్న పాక్ మంత్రి

దిల్లీ: పాకిస్థాన్ మంత్రి భారత్ పర్యటనకు రానున్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత పాకిస్థాన్ మంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. దిల్లీ వేదికగా నవంబర్ 20 నుంచి 22 వరకు షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్ నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు పాక్ పర్యావరణశాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌హాజరు కానున్నారు. ఈ మేరకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది.చివరిసారిగా 2023లో గోవాలో జరిగిన ఎస్‌సీఓ సమావేశాలకు అప్పటి విదేశాంగశాఖ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ హాజరయ్యారు. ఆ తర్వాత ఇప్పటి వరకు పాక్ మంత్రులు భారత్‌లో పర్యటించలేదు.

వరాహ నదిలో స్నానానికి దిగి ముగ్గురు గల్లంతు

ఎస్. రాయవరం: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద వరాహ నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. గ్రామానికి చెందిన కేతేటి రిషి (18), కోడి జగదీష్ (20), ముప్పిడి నాగవంశీ (22) మరో ముగ్గురు యువకులతో కలిసి పెనుగొల్లు గ్రోయిన్ వద్ద స్నానానికి దిగారు. ఆరుగురు నదిలో కొట్టుకుపోతుండగా స్థానికులు ముగ్గురిని కాపాడగా, మరో ముగ్గురూ గల్లంతయ్యారు. వెంటనే స్థానికులు నదిలోకి దిగి గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభించలేదు. సీఐ రామకృష్ణ, ఎస్సై రమేష్, ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలవరం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టనున్నారు. ముగ్గురు యువకులు గల్లంతవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



ఏటా 1.5లక్షల మంది విదేశీ విద్యార్థులకే ఎంట్రీ

తాజా నిర్ణయం ప్రకారం.. 2027 నుంచి 2029 వరకు కెనడా ఏటా 3.7లక్షల మంది చొప్పున తాత్కాలిక వలసదారులను తమ దేశంలోకి అనుమతించనుంది. ఇందులో 1.5లక్షల మంది విదేశీ విద్యార్థులు కాగా.. మిగతా 2.2లక్షల వీసాలు తాత్కాలిక విదేశీ ఉద్యోగులకు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ ఏడాది కూడా కెనడా ఈ తరహా నిబంధనలను అమలు చేసింది. అయితే, 2026కి 1.55లక్షల మంది విదేశీ విద్యార్థులను అనుమతించింది. అయితే, ఈ నిబంధనలు కెనడా రావాలనుకునే కొత్త వారికి మాత్రమే వర్తిస్తాయని ఆ దేశం వెల్లడించింది. తాజా నిర్ణయంతో కెనడాకు వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. కెనడాలో ఇటీవల తాత్కాలిక వలసదారుల జనాభా విపరీతంగా పెరుగుతోంది. దీంతో స్వదేశీయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశీయులు పెరగడం వల్ల వసతి సౌకర్యాలు అందుబాటులో ఉండట్లేదని, ప్రజా సేవలకు కూడా ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వలసలపై కెనడా చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా.. ఆ దేశం ఏటా 2.44లక్షల మందికి శాశ్వత నివాస హోదా కల్పిస్తోంది.

తెల్లాపూర్, కొల్లూరులో నిర్మాణ ప్రాజెక్టులతో

పెరుగుతున్న వాయు కాలుష్యం

- 16 నిర్మాణ ప్రాజెక్టులపై టీజీపీసీబీ టాస్క్‌ఫోర్స్ సమీక్ష..
- ఐదు నిర్మాణ ప్రాజెక్టులు, ఓ ఆర్ఎంసీ ప్లాంట్ మూసివేతకు సిఫారసు



అమీర్‌పేట్ / సనత్ నగర్ (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్, కొల్లూరు పరిసర ప్రాంతాల్లో నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వాయు కాలుష్యం పెరుగుతున్నట్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) గుర్తించింది. ఈ ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాల వల్ల కాలుష్యం పెరుగుతోందంటూ అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పర్యావరణ నిబంధనలు, కాలుష్య నియంత్రణ చర్యల అమలును పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన రోలింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పలు నిర్మాణ ప్రాజెక్టుల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో దుమ్ము, ధూళి నియంత్రణ చర్యలు సరిగా చేపట్టకపోవడంతో పాటు పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 13న హైదరాబాద్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో 16 నిర్మాణ ప్రాజెక్టుల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఉల్లంఘనల తీవ్రతను పరిశీలించి, ఐదు నిర్మాణ ప్రాజెక్టులతో పాటు వాటికి అనుబంధంగా పనిచేస్తున్న ఒక రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్‌ను మూసివేయాలని సిఫారసు చేసింది.

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

మూడు నిర్మాణ ప్రాజెక్టులు టీజీపీసీబీ నుంచి స్థాపన అనుమతి (కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) పొందకుండానే పనులు కొనసాగిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. వీటికి క్లోజర్ ఆర్డర్లు జారీ చేయాలని కమిటీ సిఫారసు చేసింది. గతంలో నిర్మాణ కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా, తిరిగి పనులు ప్రారంభించేందుకు అనుమతి పొందకుండానే మరో రెండు ప్రాజెక్టులు నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఐదు ప్రాజెక్టులపై మూసివేత చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఆర్ఎంసీ ప్లాంట్‌పైనా చర్యలు

మరో నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌కు టీజీపీసీబీ నుంచి నిర్వహణ అనుమతి (కన్సెంట్ ఫర్ ఆపరేషన్) లేదని అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తగిన కాలుష్య నియంత్రణ చర్యలు పాటించకపోవడంతో వాయు కాలుష్యానికి కారణమవుతున్నట్లు నిర్ధారించారు. దీంతో ఆ ప్లాంట్ కార్యకలాపాలను కూడా నిలిపివేయాలని కమిటీ సిఫారసు చేసింది. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన ప్రాజెక్టులపై మూసివేత ఉత్తర్వులతో పాటు బ్యాంకు గ్యారెంటీలను జప్తు చేయాలని, స్వల్ప స్థాయి ఉల్లంఘనలు గుర్తించిన ప్రాజెక్టుల బ్యాంకు గ్యారెంటీలను కూడా జప్తు చేయాలని కమిటీ సూచించింది. నిబంధనలను సరిదిద్దుకునేందుకు సంబంధిత ప్రాజెక్టులకు 10 రోజుల గడువు ఇచ్చింది. ఈ సిఫారసుల మేరకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తదుపరి చర్యలు చేపట్టనుంది.

హైకోర్టు స్టే బేఖాతరు

రాత్రికి రాత్రే కొలువుదీరిన కొత్త పాలక వర్గం!

ఎన్నిక జరిగేవరకు పాత వారే కొనసాగాలని ఆర్డర్ ఇచ్చిన హైకోర్టు

- కోర్టు తీర్పును ధిక్కరిస్తూ పాత కమిటీని రద్దు చేసిన అధికారులు
- కొత్త జీవోతో నూతన పాలక వర్గానికి దక్కిన అవకాశం
- కోర్టు సెలవు దినాలే ఆయుధంగా నాయకుల ముందడుగు
- లక్ష్మీదేవిపేట సొసైటీ పాలకవర్గ ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 14 (జనం సాక్షి) : వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) లో శుక్రవారం రాత్రి జరిగిన పరిణామం ఇప్పుడు అందరి నోటా ఒకటే చర్చగా మారింది. గతంలో ఉన్న పీఏసీఎస్ చైర్మన్ తన పదవిని కాపాడుకునేందుకు కోర్టును ఆశ్రయించి, ఎన్నికలు జరిగే వరకు తానే కొనసాగాలని పిటిషన్ దాఖలు చేసి, హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. కోర్టులో కేసు ఉండి, హైకోర్టు స్టే అమల్లో ఉండగానే ఈనెల 13న రాత్రి 9 గంటలకు హుటాహుటిన నూతన పాలకవర్గం కొలువు తీరింది.

ఒకరిద్దరి సమస్య కాదు, రాష్ట్ర వ్యాప్తంగా మూడు వేల మంది చైర్మన్ల సమస్యగా మారింది. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఎన్నికలు జరిగేంత వరకు గతంలో చైర్మన్లుగా ఉన్నవారే మళ్లీ చైర్మన్లుగా కొనసాగుతారని స్పష్టం చేసింది. ఈ తీర్పు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాత చైర్మన్లకు పెద్ద ఊరటనిచ్చింది. లక్ష్మీదేవిపేట సొసైటీ గత చైర్మన్ కూడా కోర్టుకు పోయి స్టే తెచ్చుకున్నాడు. ఎన్నికలు జరిగే వరకు పాత పాలకవర్గం కొనసాగాలని హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది. అంటే కొత్తగా నామినేట్ చేయడానికి వీల్లేదని, పాత చైర్మన్లే కొనసాగాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ ఆర్డర్ చేతిలో ఉన్నందున, గత చైర్మన్ తన పదవికి ఎలాంటి ఢోకా లేదని భావించారు. కోర్టు ఆర్డర్ ఉన్నా, దానిని పట్టించుకోకుండా కొత్త పాలకవర్గం ఏర్పాటు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

పాత పాలకవర్గాన్ని రద్దు చేస్తూ అధికారుల కొత్త జీవో..!

కోర్టు తీర్పును ధిక్కరిస్తూ సంబంధిత అధికారులు పాత పాలకవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రత్యేక జీవో తీసి, నూతన పాలకవర్గానికి అవకాశం కల్పించినట్లుగా సమాచారం. హైకోర్టు స్టే అమల్లో ఉండగానే, ఇలా జీవో ఇవ్వడం ఇప్పుడు అత్యంత వివాదాస్పదంగా మారింది. కోర్టు తీర్పు కంటే అధికారుల జీవో పెద్దదా అన్న ప్రశ్న మండలంలో వినిపిస్తోంది. ఈ జీవో ఆధారంగానే కొత్త పాలకవర్గం కొలువు తీరేందుకు మార్గం సుగమమైందని తెలుస్తోంది.

పగలు కాదు, సాయంత్రం కాదు, సరిగ్గా రాత్రి 9 గంటలకు కొలువు తీరడం వెనుక ఏదో బలమైన కారణం ఉందని, ఏదో తొందర ఉందని, ఏదో భయం ఉందని గ్రామస్తులు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. ఇది ఒక సాధారణ ప్రమాణ స్వీకారం కాదని, దీని వెనుక ఒక పక్కా వ్యూహం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం తర్వాత వచ్చేది శని, ఆదివారం. ఈ రెండు రోజులు కోర్టుకు సెలవు దినాలు. కోర్టు పని చేయదు. ఒకవేళ గత చైర్మన్ కోర్టు నుంచి ఏదైనా స్టే తెచ్చుకోవాలనుకున్నా, ఆ రెండు రోజులు ఆ అవకాశం ఉండదు. ఈ సెలవు దినాలను దృష్టిలో పెట్టుకునే కొత్త పాలకవర్గం అత్యవసరంగా కొలువు తీరిందన్నది ఇప్పుడు గ్రామంలో వినిపిస్తున్న వాదన. అప్పుడు కోర్టు జోక్యం చేసుకున్నా అప్పటికే జరిగిన కొలువును వెనక్కి తీసుకోవడం అంత సులభం కాదు. ఇదే వ్యూహంతో ఈ కొలువును రాత్రికి రాత్రే పూర్తి చేశారని గ్రామంలో చర్చ జరుగుతోంది. కొలువు తీరిన తీరు కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు గ్రామ పెద్దలు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. కానీ ఈసారి మాత్రం ఎలాంటి ఆర్భాటం లేకుండా, కేవలం సొసైటీ సీఈవోతో మాత్రమే కొలువు తీరింది. దీని వెనుక కూడా ఒక కారణం ఉందని చెబుతున్నారు. జనం ఎక్కువగా ఉంటే, ఈ విషయం గత చైర్మన్ వర్గానికి తెలిసి, వారు కోర్టులో అత్యవసర పిటిషన్ వేసే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుందని భావించి, అత్యంత గోప్యంగా ఈ తతంగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. సీఈవో సమక్షంలోనే కొలువు తీరడం అంటే, అది అధికారిక రికార్డులోకి వెళ్లడానికి సరిపోతుంది.

రైతులకు తెలియకుండానే..!

గత చైర్మన్ తననే కొనసాగించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి స్టే తెచ్చుకున్న నేపథ్యంలో ఇక ఎవరు అడ్డుకున్నా, అప్పటికే బాధ్యతలు స్వీకరించినట్లు చట్టపరంగా చెల్లుబాటు అయ్యేలా గోప్యతను పాటించారని, అందుకే రాత్రి వేళను ఎంచుకున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో ఎవరికీ తెలియకుండా, ఎలాంటి హడావుడి లేకుండా జరిగిన ఈ కొలువు ఇప్పుడు మండలంలో పెద్ద దుమారం రేపుతోంది. కొంతమంది గ్రామస్తులు మాకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని, ఇది ఏం పద్ధతని ప్రశ్నిస్తున్నారు. గ్రూజూ అనేది రైతులకు అత్యంత కీలకమైన సంస్థ, రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, పంట కొనుగోలు వంటి ఎన్నో సేవలు ఈ సంఘం ద్వారానే అందుతాయని, అలాంటి సంస్థలో పాలకవర్గం మార్పు అనేది రైతులందరికీ సంబంధించిన అంశమని అంటున్నారు. కానీ, ఇక్కడ మాత్రం రైతులకు తెలియకుండా, రాత్రిపూట కొలువు తీరడం రైతులతోపాటు పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

సోమవారం కోర్టుకెళ్లనున్న గత చైర్మన్..?

ఏదేమైనప్పటికీ గత చైర్మన్ సోమవారం మరో మారు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. హైకోర్టు స్టే ఉన్నా కొత్త పాలకవర్గం కొలువు తీరడంపై ఆయన కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసే అవకాశం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. డిసిఓ జీవో చెల్లుతుందా, హైకోర్టు స్టే చెల్లుతుందా అన్నది సోమవారం తేలనుంది. ఒకవేళ కోర్టు గత చైర్మన్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే, రాత్రి 9 గంటలకు జరిగిన ఈ కొలువు చెల్లుతుందా, చెల్లదా అన్నది మరో పెద్ద న్యాయపోరాటానికి దారితీసే అవకాశం ఉంది. దీంతో లక్ష్మీదేవిపేట గ్రూజూ వ్యవహారం ఇప్పుడు మండలంలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

మణికొండ పాఠశాలకు 2.36 ఎకరాల భూమి కేటాయింపు



రాజేంద్రనగర్, నవంబర్ 14 (జనంసాక్షి) : మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 1,500 మంది విద్యార్థులు చదువుతుండగా, తరగతి గదుల కొరతతో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విస్తరణకు భూమి కేటాయిం చాలని గ్రామస్థులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్, గండిపేట తహసీల్దార్‌కు లేఖలు రాయడంతో పుప్పాలగూడలోని సర్వే నంబర్ 454/1లో 2 ఎకరాల 36 గుంటల స్థలాన్ని పాఠశాలకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సహకరించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను గ్రామస్థులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, టి. మల్లేష్, ప్రధానోపాధ్యాయులు అరుణ, మాజీ ప్రధానోపాధ్యాయులు నిరంజన్, ఉపాధ్యా యులు, కాంగ్రెస్ నాయకులు బి. శ్రీరాములు, జి. శ్రావణ్, ఎ. కుమార్, గంగాధర్, పుల్లారావు పాల్గొన్నారు.

అడవిరంగాపురంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- కత్తులతో దాడి, ఇరువురికి గాయాలు



దుగ్గొండి, నవంబర్ 14 (జనం సాక్షి): ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు క్షణకావేశానికి లోనై మానవ సంబంధాలు మంట కలిపి బంధుత్వాలు భారమై, నడిచే రహదారి కోసం రణరంగం చేసి అలసిన దేహాలతో రక్తసిక్తంగా మారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నదమ్ముల సంఘటన దుగ్గొండి మండలం అడవి రంగాపురంలో జరిగింది. శనివారం తెల్లవారుజామున మండలంలోని అడవి రంగాపురంలో చిన్న చిన్న కారణాలతో కేవలం నడిచే రహదారి కోసం కత్తులు దూసి కక్షలు పెంచుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక ఎస్సై మహేందర్ గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడవి రంగాపురం,గ్రామానికి చెందిన బుడిమె దినేష్, బుడిమె శ్రీనివాస్ ఇద్దరూ అన్నదమ్ములు. దినేష్ ఇంటి ముందు పడిపోయిన చెట్ల ఆకులను శుభ్రం చేసే విషయంలో ఇద్దరి మధ్య వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపరచుకునే వరకు పరిస్థితి వెళ్ళింది. ఈ క్రమంలో శ్రీనివాస్ తన సోదరుడైన దినేష్‌పై కత్తితో దాడి చేయగా, దినేష్ తలకు గాయాలయ్యాయి. ఈ సమయంలో తన తండ్రిని రక్షించేందుకు మధ్యలోకి వచ్చిన దినేష్ కుమార్తె నవతపై కూడా శ్రీనివాస్ దాడి చేయడంతో ఆమె వేళ్లకు కత్తి గాయాలయ్యాయి. దినేష్ కూడా శ్రీనివాస్‌పై తన వద్ద ఉన్న కర్ర తో దాడి చేయడంతో శ్రీనివాస్ చేతుల, కాళ్లపై గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పలువురు సొంత అన్నదమ్ములై కత్తులతో దాడి చేసుకుని, కోపోద్రిక్తులై ప్రవర్తించడం చివరికి ఇరు కుటుంబాలు నష్టపోవడమే తప్ప పరిష్కారం కాదని అంటున్నారు. సమస్యలు ఉంటే పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లను చట్టాలను, నమ్ముకుని పరిష్కరించుకోవాలని కోరారు. శ్రీనివాస్, దినేష్ లతోపాటు గాయపడిన బాలికను మెరుగైన వైద్యం కోసం వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దుగ్గొండి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

- రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన డి. వికాస్, కరుణాకర్



కొడంగల్, నవంబర్ 14 (జనం సాక్షి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కొడంగల్‌కు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి అండర్-14 క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులు డి. వికాస్, కరుణాకర్ సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ బి. రామదాసు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. రామదాసు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, రేష్మ, అయోధ్య సార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు మేరీ జోన్స్, వెంకటేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలలే దేశ భవిష్యత్తుకు పునాది..

- హనుమకొండ ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.డి ఫారిహా అహ్మద్
- న్యాయ సేవాధికార సంస్థ రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి రాజ్ నిధి
- బాలుర పరిశీలన గృహంలో ప్రత్యేక కార్యక్రమం

వరంగల్ ఈస్ట్, నవంబర్ 14 (జనం సాక్షి) : బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వరంగల్‌లోని బాలుర పరిశీలన గృహంలో సూపరింటెండెంట్ శ్రీదేవి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు (జువెనైల్ జస్టిస్ బోర్డు) న్యాయమూర్తి ఎం.డి.ఫారిహా అహ్మద్ మరియు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుండి రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి రాజ్ నిధి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, “దేశ భవిష్యత్తుకు పునాది నేటి బాలలే అని తెలిపారు. ప్రతి బాలుడికి ఆరోగ్యం, రక్షణ, గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు ఉందని తెలిపారు. వివిధ కారణాల వల్ల కుటుంబాలకు దూరమై ఉన్న పిల్లలు బాలుర పరిశీలన గృహంలో ఉన్నప్పటికీ, వారిని నేరస్థులుగా కాకుండా సమాజంలో తిరిగి మంచి పౌరులుగా ఎదిగే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బాలుర పరిశీలన గృహం అనేది కేవలం పిల్లలను ఉంచే ప్రదేశం మాత్రమే కాకుండా, వారి ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడం, మానసిక ధైర్యాన్ని పెంపొందించడం, విద్యాబుద్ధులు నేర్పించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం మరియు సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా తీర్చిదిద్దే పునరావాస కేంద్రంగా పనిచేయాలని సూచించారు.

ఎయిర్‌టెల్ టవర్లలో భారీ చోరీ

- ముగ్గురు ఇంజనీర్లు సహా 9 మంది ముఠా సభ్యుల అరెస్ట్
- నల్గొండ సీసీఎస్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్‌తో గుట్టురట్టు
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 14 (జనంసాక్షి): అన్నం పెట్టిన సంస్థకే కన్నం వేశారు నమ్మకంగా పనిచేస్తూ.. తమకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానాన్నే అక్రమాలకు ఉపయోగించుకున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి, అత్యాశతో పనిచేస్తున్న సంస్థలోనే భారీ చోరీలకు పాల్పడిన ఇంజనీర్ల ముఠా గుట్టును నల్గొండ సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. ఎయిర్‌టెల్ మొబైల్ టవర్లలో అత్యంత ఖరీదైన రేడియో రిమోట్ యూనిట్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న తొమ్మిది మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు.తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 38 చోరీ కేసుల్లో ఈ ముఠా ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సుమారు రూ.1.62 కోట్ల విలువైన రేడియో రిమోట్ యూనిట్లను దొంగిలించినట్లు గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు బైక్‌లు, రూ.15 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సొంత సంస్థనే టార్గెట్‌గా చేసుకున్న ఇంజినీర్లు

ఎయిర్‌టెల్ సంస్థలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, నలుగురు రిగ్గర్లు (టెక్నీషియన్లు), ఒక డ్రైవర్‌తో పాటు గతంలో అదే సంస్థలో పనిచేసిన మరో ఉద్యోగి కలిసి ఈ దొంగతనాలకు పథకం రచించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. టవర్ల నిర్మాణం, నిర్వహణ, సాంకేతిక వివరాలపై తమకున్న అవగాహనను ఆసరాగా చేసుకుని పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడ్డారు.జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొబైల్ టవర్ల నుంచి రేడియో రిమోట్ యూనిట్లు వరుసగా మాయమవుతుండటంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి సారించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు చివరకు చోరీల వెనుక ఉన్నది బయటి వ్యక్తులు కాదని, సంస్థలోనే పనిచేస్తున్న ఉద్యోగుల ముఠా అని గుర్తించారు.

పోలీసుల వాహన తనిఖీల్లో చిక్కిన ముఠా

నవంబర్ 14న నల్గొండ రూరల్ పోలీసుల బృందం గిగిరకలబావిగూడెం శివారులో చింతచెట్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లు, ఒక బైక్‌పై అనుమానాస్పదంగా వచ్చిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కాంచనపల్లి గ్రామంలో రేడియో రిమోట్ యూనిట్ల చోరీకి వెళు న్నట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.మరోవైపు త్రిపురారం పోలీసులు బాబాసాయిపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారు, రెండు బైక్‌లపై వచ్చిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో గతంలో నేరాలకు పాల్పడిన రమావత్ సుమన్‌ను గుర్తించారు. విచారణలో గతంలో చేసిన చోరీల వివరాలు బయటపడ్డాయి.

రాత్రివేళ టవర్లపై దాడి.. హైదరాబాద్‌లో విక్రయం

విలాసవంతమైన జీవితానికి అలవాటుపడిన నిందితులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ దందాకు తెరలేపారు. తమ పరిధిలోని మొబైల్ టవర్లను గుర్తించి రాత్రివేళ అక్కడికి చేరుకునేవారు. టవర్లపై అమర్చిన ఖరీదైన రేడియో రిమోట్ యూనిట్లకు సంబంధించిన వైర్లను కత్తిరించి వాటిని అపహరించేవారు. అనంతరం దొంగిలించిన యూనిట్లను హైదరాబాద్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో కార్లు, బైక్‌లు కొనుగోలు చేయడంతో పాటు జల్సాలకు ఖర్చు చేసేవారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ భారీ చోరీల ముఠాను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, త్రిపురారం ఎస్ఐ కె. నరేష్, నల్గొండ రూరల్ ఎస్ఐ, సీసీఎస్ ఎస్ఐ సురేష్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, ఫయాజ్, నాగరాజు, కానిస్టేబుళ్లు అస్రార్, సాయి, శివరాజు, నరేష్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన వారే అక్రమాలకు పాల్పడితే ఎంతటి నేరమైనా చివరకు చట్టానికి చిక్కక తప్పదని ఈ ఘటన మరోసారి నిరూపించింది. సంస్థలో పనిచేస్తూ సంస్థకే నష్టం కలిగించిన ఈ ముఠా వ్యవహారం టెలికాం రంగంలో కలకలం రేపుతోంది.

జిల్లాల వారీగా 38 చోరీ కేసులు

నల్గొండ – 9 కేసులు
మిర్యాలగూడ – 16 కేసులు
దేవరకొండ – 2 కేసులు
సూర్యాపేట – 8 కేసులు
ఇతర జిల్లాలు – 3 కేసులు

అరెస్టయిన తొమ్మిది మంది నిందితులు

1. నకిరేకంటి స్వర్ణ కుమార్ – సైట్ ఇంజినీర్
2. భూక్యా బాలు – సైట్ ఇంజినీర్
3. శ్రీకాంత్ రెడ్డి – ఎయిర్‌టెల్ ఇంజినీర్
4. రమావత్ సుమన్ – మాజీ ఎయిర్‌టెల్ ఉద్యోగి
5. లకావత్ రాములు – మాజీ రిగ్గర్
6. జక్కుల నితీష్ కుమార్ – డ్రైవర్
7. పెంటమల్ల మహేష్ – ఎయిర్‌టెల్ రిగ్గర్
8. భీమనపల్లి రవి – సెల్ టవర్ టెక్నీషియన్

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 నవంబర్ 2026

గాలి విషం: దేశాన్ని మింగేస్తున్నా మేలుకోరా?

సంపాదకీయం

ఉత్తర భారతదేశంలో చలికాలం వచ్చిందంటే చాలు, ఊపిరి పీల్చడమే శిక్షగా మారుతోంది. ఈ దుస్థితి కేవలం ఆరోగ్య సంక్షోభం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను లోపలి నుంచి తినేస్తున్న చీడపురుగు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఈ భారం అధికంగా ఉండగా, తలసరి నష్టంలో దేశ రాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో నిలవడం పాలకులకు సిగ్గుచేటు. దేశానికి గుండెకాయ లాంటి నగరమే ఊపిరాడక కొట్టుమిట్టాడుతుంటే, మిగిలిన దేశం గురించి ఏం చెప్పగలం?

కాలుష్యం కారణంగా ఉద్యోగుల ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింటోందని నివేదికలు స్పష్టంగా చెబుతున్నాయి. అనారోగ్యంతో పనిచేసే కార్మికుడు, ఉద్యోగి ఎంత సామర్థ్యాన్ని కోల్పోతున్నారో లెక్కలు వేసే తీరిక ఎవరికీ లేదు. కాలుష్యం తీవ్రంగా ఉండే రోజుల్లో ప్రజలు బయటకు రాకపోవడంతో రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, పర్యాటక రంగాలు కుదేలవుతున్నాయి. అన్నం పెట్టే రైతు పరిస్థితి మరింత దారుణం. వరి, గోధుమ పంటల దిగుబడి పడిపోతోంది. పొలంలో పండే ధాన్యమే తగ్గిపోతుంటే రేపటి ఆహార భద్రత ఏమవుతుంది?

ఇంత జరుగుతున్నా ఏటా అదే తంతు. కాలుష్యం పెరగగానే సమావేశాలు, హడావుడి ప్రకటనలు, తాత్కాలిక నిషేధాలు. గాలి కాస్త తేలికపడగానే అన్నీ మరచిపోవడం. పొరుగు రాష్ట్రాలపై నిందలు వేసుకోవడం, పంట వ్యర్థాల దహనానికి రైతులను మాత్రమే బాధ్యులను చేయడం, వాహన, పరిశ్రమల కాలుష్యంపై కళ్లు మూసుకోవడం. ఇదేనా మన బాధ్యత? సమస్యకు మూలాలను తాకే దీర్ఘకాలిక ప్రణాళిక ఎక్కడ? చిత్తశుద్ధితో అమలయ్యే చట్టాలు ఎక్కడ?

పరిస్థితిని మరింత ఘోరంగా మార్చేది దీపావళి వేళ జరిగే విచ్చలవిడి బాణసంచా మోత. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగను, గాలిని చీకటి పొగలో ముంచే పండుగగా మార్చేశాం. ఇప్పటికే ప్రమాదకర స్థాయిలో ఉన్న గాలిలోకి టన్నుల కొద్దీ విషపు పొగను, సూక్ష్మ ధూళి కణాలను పంపిస్తున్నాం. నిషేధాలు విధించినా వాటిని పట్టించుకోని నిర్లక్ష్యం, అమలు చేయాల్సిన యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించే తీరు, పండుగ పేరుతో ఇతరుల ఊపిరితిత్తులను పణంగా పెట్టే స్వార్థం. వృద్ధులు, పిల్లలు, ఆస్తమా రోగులు ఆ రాత్రి నుంచి వారాల తరబడి ఊపిరి కోసం పోరాడుతుంటే, సంబరాల పేరుతో సాగే ఈ విధ్వంసానికి ఏ దేవుడైనా సంతోషిస్తాడా? ఆనందం పేరుతో ఆరోగ్యాన్ని కాల్చేసే సంప్రదాయం ఎవరికీ మేలు చేయదు. ప్రజల్లోనూ నిర్లక్ష్యం తక్కువేమీ కాదు. చెట్లను నరికేస్తూ, ప్రజా రవాణాను విస్మరించి సొంత వాహనాల్లో తిరుగుతూ, చెత్తను తగలబెడుతూ, కాలుష్యంపై ప్రభుత్వాన్ని మాత్రమే తిట్టుకుంటే సరిపోదు. ప్రతి పౌరుడూ ఈ పాపంలో భాగస్వామే. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా చెవికెక్కని అజ్ఞానం ఇంకెన్నాళ్లు?

ఇది ఇంతటితో ఆగదు. నేడు ఉత్తరాదిని కమ్ముకున్న పొగ రేపు దక్షిణాదికీ చేరుతుంది. ఆసుపత్రుల్లో పెరిగే రోగులు, పడిపోయే ఉత్పత్తి, తగ్గే ఆయుర్దాయం, ఇవన్నీ భావి తరాల నుదుటన రాస్తున్న శాపాలు. ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల లెక్కల్లో కలలు కంటున్న దేశం, పీల్చే గాలిని కాపాడుకోలేకపోతే ఆ కలలకు అర్థమేంటి? ఇప్పటికైనా కళ్లు తెరవాలి. పంట వ్యర్థాల నిర్వహణకు రైతులకు ఆచరణాత్మక ప్రత్యామ్నాయాలు ఇవ్వాలి, ప్రజా రవాణాను బలోపేతం చేయాలి, పరిశ్రమల కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి, దీపావళి బాణసంచాపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి, పచ్చదనాన్ని పెంచాలి. పండుగలను దీపాల వెలుగుతో, పర్యావరణహితంగా జరుపుకోవడం నేర్చుకోవాలి. రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజల ప్రాణాల కోసం పనిచేయాలి. లేదంటే చరిత్ర క్షమించదు. గాలి విషమైతే, దేశం ఊపిరి ఆగిపోయే రోజు దూరంలో లేదు.

బిర్సా కలగన్న అబువా రాజ్..

ఆదివాసీలకు ఇంకా అందని స్వరాజ్యం!

బిర్సా ముండా ఎక్కుపెట్టిన పోరాట విల్లు బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై సంధించిన బాణం మాత్రమే కాదు. అది తరతరాలుగా అణచివేతకు గురవుతున్న ఆదివాసీ సమాజం ఆత్మగౌరవ ప్రకటన. భూమి మీద హక్కు, అడవి మీద అధికారం, స్వయంపాలన, సంస్కృతిని కాపాడుకునే స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన ఉల్గులాన్ ఉద్యమం ఒక చారిత్రక తిరుగుబాటు. ఆ తిరుగుబాటుకు పునాది ఆదివాసీల జీవన హక్కులు. లక్ష్యం వారి స్వయం పాలన. అందుకే బిర్సా ఇచ్చిన 'అబువా రాజ్' (మన రాజ్యం) నినాదం ఒకానొక కాలానికి పరిమితమైనది కాదు. నేటికీ దేశంలోని ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు అది ఒక రాజకీయ దిశానిర్దేశం.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడిచాయి. పాలకులు మారారు. ప్రభుత్వాలు మారాయి. అభివృద్ధి పేరుతో ఎన్నో పథకాలు, ప్రాజెక్టులు వచ్చాయి. అయినప్పటికీ అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆది వాసీల జీవితాల్లో ఆశించిన మార్పు వచ్చిందా? వారి భూములకు భద్రత ఉందా? అడవి సంపదపై వారికి పూర్తి హక్కులు దక్కాయా? తమ నివాస ప్రాంతాల భవిష్యత్తును తామే నిర్ణయించుకునే అధికారం లభించిందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే బిర్సా ముండా పోరాటం ఇంకా ఎందుకు అవసరమో అర్థమవుతుంది. ఆదివాసీలకు అడవి అంటే కేవలం చెట్ల సమూహం కాదు. అది వారి జీవనాధారం. వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, వైద్యం, ఆహారపు అలవాట్లు, ఆర్థిక వ్యవస్థ అన్నీ అడవితో ముడిపడి ఉంటాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు వారి జీవనంలో భాగం. అడవిలోని ప్రతి మొక్కతో, ప్రతి జంతువుతో, ప్రకృతిలోని ప్రతి మార్పుతో వారికి తరతరాల అనుబంధం ఉంది. ప్రకృతిని జయించాలనే ఆలోచన కంటే ప్రకృతితో కలిసి బతకాలనే జీవన తత్వం ఆదివాసీ సమాజానిది. కానీ ఆధునిక అభివృద్ధి నమూనా ఈ జీవన సంబంధాన్ని గుర్తించకుండా అడవిని వాణిజ్య వనరుగా, భూమిని పెట్టుబడులకు అనుకూలమైన ఆస్తిగా చూస్తోంది.

ఖనిజ సంపద పేరుతో గనుల తవ్వకాలు, భారీ పరిశ్రమలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఆదివాసీ ప్రాంతాలపై ఒత్తిడి పెరుగుతోంది. అభివృద్ధి పేరుతో వారి నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల నుంచి నిర్వాసితులవుతున్నారు. పరిహారం, పునరావాసం అనే హామీలు కాగితాలకే పరిమితమవుతున్న సందర్భాలున్నాయి. తమకు తెలియని ప్రాంతాలకు తరలించబడిన కుటుంబాలు ఉపాధి కోల్పోయి, కూలీలుగా మారుతున్నాయి. ఒకప్పుడు తమ భూమిపై స్వతంత్రంగా జీవించిన కుటుంబాలు ఇతరుల వద్ద పనికి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బిర్సా ముండా పోరాట వారసత్వాన్ని కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయడం చారిత్రక అన్యాయం. ఆయన పోరాటం వెనుక ఉన్న భూమి హక్కుల ప్రశ్నను, ఆదివాసీ స్వయంపాలన ఆకాంక్షను, సామాజిక న్యాయాన్ని అర్థం చేసుకోవాలి.

ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఐదవ షెడ్యూల్, ఆరవ షెడ్యూల్, గిరిజన ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన నిబంధనలు ఈ దిశగా కీలకమైనవి. 1996లో తీసుకొచ్చిన పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం (పెసా) గ్రామసభలకు ప్రత్యేక అధికారాలను కల్పించింది. ఆదివాసీ సంప్రదాయాలు, ఆచారాలు, సామాజిక వనరులు, స్థానిక సహజ వనరుల పరిరక్షణలో గ్రామసభల పాత్రను గుర్తించింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, భూమి సేకరణ, సహజ వనరుల నిర్వహణ వంటి



అంశాల్లో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యత కల్పించింది.

అలాగే 2006లో రూపొందిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఖీశీతీవర్ =అస్త్రష్ట్రం ౕాఖ్) ఆదివాసీలకు చారిత్రకంగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే లక్ష్యంతో వచ్చింది. ఈ చట్టం వ్యక్తిగత భూమి హక్కులతోపాటు సామూహిక అటవీ హక్కులు, అటవీ వనరులపై హక్కులు, సంప్రదాయ జీవనాధారాల పరిరక్షణకు అవకాశం కల్పించింది. గ్రామసభకు అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియలో కీలక బాధ్యతను అప్పగించింది. అటవీ వనరులను సంరక్షించడం, నిర్వహించడం, సంప్రదాయ హక్కులను కాపాడుకోవడంలోనూ గ్రామసభలకు అధికారాలు కల్పించింది. అయితే చట్టాలు రావడం ఒక ఎత్తయితే వాటిని అమలు చేయడం మరో ఎత్తు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు 2025 మే 31 నాటికి సమర్పించిన వివరాల ప్రకారం, అటవీ హక్కుల చట్టం కింద గ్రామసభల స్థాయిలో మొత్తం 51,23,104 వ్యక్తిగత, సామూహిక హక్కుల దరఖాస్తులు అందాయి. వీటిలో 25,11,375 హక్కులకు మాత్రమే పట్టాలు జారీ అయ్యాయి. మరో 18,62,056 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అంటే హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో గణనీయమైన సంఖ్యలో ప్రజలు ఇంకా న్యాయమైన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ గణాంకాలు చట్టం అమలులో ఉన్న లోపాలను, ఆదివాసీ హక్కుల సాధనలో ఎదురవుతున్న అడ్డంకులను తెలియజేస్తున్నాయి.

అడవిని కాపాడే బాధ్యతను ఆదివాసీలకు అప్పగిస్తామని చెబుతూనే, వారి సంప్రదాయ హక్కులను గుర్తించడంలో నిర్లక్ష్యం చూపడం పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనం. అటవీ సంరక్షణ పేరుతో తరతరాలుగా అడవుల్లో నివసిస్తున్న ప్రజలను బయటకు పంపే ప్రయత్నాలు జరగకూడదు. అడవిని నాశనం చేస్తున్న కార్పొరేట్ ప్రయోజనాలపై ప్రశ్నించకుండా, అడవితో కలిసి జీవిస్తున్న ఆదివాసీలను అభివృద్ధికి అడ్డంకులుగా చిత్రించడం అన్యాయం. మరోవైపు ఆదివాసీ సమాజంలో విద్య, వైద్యం, ఉపాధి, పోషకాహారం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల సమస్యలు కొనసాగుతున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. పాఠశాలలు ఉన్నా ఉపాధ్యాయుల కొరత, మాతృభాషలో విద్యాబోధన లేకపోవడం, రవాణా సౌకర్యాల లేమి కారణంగా గిరిజన పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. విద్యావకాశాలు అందని కుటుంబాల్లో బాల కార్మికత్వం, వలసలు పెరుగుతున్నాయి.

ఆదివాసీ మహిళల సమస్యలు మరింత తీవ్రమైనవి. భూమి, అటవీ వనరులపై హక్కుల కోసం పోరాడుతూనే కుటుంబ పోషణ బాధ్యతను కూడా వారు మోస్తున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, వ్యవసాయ పనులు, పశుపోషణ, ఇంటి పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ నిర్ణయాధికారంలో వారికి తగిన స్థానం లభించడం లేదు. భూమి హక్కులు, ఉపాధి, విద్య, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవితం కోసం ఆదివాసీ మహిళల భాగస్వామ్యంతో బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. బిర్సా ముండా ఉద్యమం మనకు నేర్పిన మరో ముఖ్యమైన పాఠం ఐక్యత. ఆదివాసీ తెగల మధ్య ఉన్న భాషా, సాంస్కృతిక వైవిధ్యాలను గౌరవిస్తూనే ఉమ్మడి సమస్యలపై ఐక్యంగా పోరాడాలి. ఆదివాసీ సమాజంలోని అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. యువతకు విద్యతోపాటు తమ చరిత్ర, సంస్కృతి, హక్కులపై అవగాహన కల్పించాలి. ఆదివాసీ భాషలు, జానపద కళలు, పాటలు, కథలు, సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని కాపాడుకోవాలి. ఆదివాసీ అస్తిత్వాన్ని కేవలం ఉత్సవాల్లో ప్రదర్శించే సాంస్కృతిక అంశంగా కాకుండా, జీవన హక్కుగా గుర్తించాలి.

బిర్సా ముండా వారసత్వం మరో విషయాన్ని కూడా గుర్తు చేస్తుంది. ఆదివాసీల సమస్యలు కేవలం గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించినవి కావు. అవి భూమి సంబంధాలు, వనరుల పంపిణీ, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కులు, పాలనా వ్యవస్థకు సంబంధించిన రాజకీయ సమస్యలు. అందువల్ల ఆదివాసీల పోరాటాలను కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, మహిళలు, ఇతర అణగారిన వర్గాల ప్రజాస్వామిక పోరాటాలతో అనుసంధానం చేయాలి. కార్పొరేట్ దోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా విస్తృత ఐక్యత నిర్మించాలి. బిర్సా ముండా కలలుగన్న 'అబువా రాజ్' అంటే కేవలం ఒక ప్రాంతంపై రాజకీయ అధికారం సాధించడం కాదు. తమ భూమిపై తమకు హక్కు ఉండాలి. తమ అడవిని తామే సంరక్షించుకోవాలి. తమ వనరులపై తమకే నిర్ణయాధికారం ఉండాలి. తమ సంస్కృతిని తామే కాపాడుకోవాలి. తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలి. అదే నిజమైన ఆదివాసీ స్వయంపాలన.

బిర్సా ముండా పోరాటాన్ని గౌరవించడం అంటే ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు. ఆయన ఆశయాల సాధన కోసం నిలబడటం. ఆదివాసీల భూములను కాపాడటం. అటవీ హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేయడం. గ్రామసభల అధికారాలను గౌరవించడం. నిర్వాసితులకు న్యాయం చేయడం. విద్య, వైద్యం, ఉపాధి, గౌరవప్రదమైన జీవితం అందించడం. బిర్సా ముండా పాతికేళ్ల వయసులోనే ప్రాణాలు కోల్పోయాడు. కానీ ఆయన రగిలించిన పోరాట జ్వాల ఆరిపోలేదు. ఆ జ్వాల నేటికీ అడవుల్లో, కొండల్లో, గిరిజన గూడాల్లో, భూమి హక్కుల కోసం పోరాడుతున్న ప్రజల గొంతుల్లో వినిపిస్తోంది. ఆయన కలలుగన్న స్వరాజ్యం ఇంకా పూర్తిగా సాకారం కాలేదు. ఆ స్వప్నాన్ని నిజం చేయాల్సిన బాధ్యత నేటి ప్రజాస్వామిక సమాజంపై ఉంది. బిర్సా ముండా చరిత్రను స్మరించుకుందాం.. ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకువెళ్దాం.



- మామిండ్ల రమేష్ రాజా
రచయిత, తెలంగాణ కార్యదర్శి
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

కమ్యూనిస్టుల పునరేకీకరణే శ్రామికవర్గ ఐక్యతకు బాట



పుట్టుక ఆధారంగా ఉన్నత, నీచ భావాలను సృష్టించింది. శ్రమను కూడా కులాల వారీగా విభజించింది. కొన్ని కులాలకు ఆధిపత్యం, మరికొన్ని కులాలకు అణచివేత, అంటరానితనం, సామాజిక బహిష్కరణను రుద్దింది. ఒకే పరిశ్రమలో పనిచేసే కార్మికులు కులాల ఆధారంగా విడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకే వర్గానికి చెందిన శ్రామికులు కూడా కుల వివక్ష కారణంగా ఐక్యం కాలేకపోతున్నారు. కులం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు. అది శ్రమ విభజనతో, ఆస్తి సంబంధాలతో, అధికార పంపిణీతో, విద్యా అవకాశాలతో, ఉపాధితో ముడిపడి ఉన్న చారిత్రక వ్యవస్థ. కుల అణచివేతను ఎదుర్కోకుండా భారతదేశంలో నిజమైన కార్మికవర్గ ఐక్యత సాధించడం సాధ్యం కాదు. అందుకే కుల నిర్మూలన పోరాటాన్ని వర్గపోరాటానికి విరుద్ధంగా చూడకూడదు. కుల ఆధిపత్యాన్ని ఎదిరించడం కూడా దోపిడీ వ్యతిరేక పోరాటంలో అంతర్భాగం కావాలి. ఈ విషయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని కూడా కమ్యూనిస్టు ఉద్యమం లోతుగా అధ్యయనం చేయాలి. కుల నిర్మూలన, సామాజిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఆర్థిక న్యాయం వంటి అంశాలను శ్రామికవర్గ ఉద్యమంలో భాగం చేయాలి. దురదృష్టవశాత్తు భారతదేశంలో కులవ్యవస్థ కార్మికవర్గాన్ని చీల్చుతుంటే, దానికి ప్రత్యామ్నాయంగా ఐక్యతను నిర్మించాల్సిన కమ్యూనిస్టు పార్టీలు కూడా అనేక గ్రూపులుగా విడిపోయి పనిచేస్తున్నాయి. సమాజాన్ని కులాల వారీగా చీల్చే శక్తులను ఎదుర్కోవాల్సిన కమ్యూనిస్టులు, తమలో తాము రాజకీయంగా చీలిపోవడం వల్ల శ్రామికవర్గ ఐక్యత బలహీనపడుతోంది. ఇది అంతిమంగా దోపిడీ వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రమాదం ఉంది.

7. సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులు కమ్యూనిస్టులకు సహజ మిత్రులు

ఏ ఆధిపత్యాన్నైనా ఎదిరించడం అభ్యుదయ రాజకీయాల లక్షణం. అది కుల ఆధిపత్యమైనా, మత ఆధిపత్యమైనా, లింగ ఆధిపత్యమైనా, ప్రాంతీయ ఆధిపత్యమైనా, ఆర్థిక ఆధిపత్యమైనా దానిని వ్యతిరేకించాలి. సామాజిక న్యాయం అంటే కేవలం ఆర్థిక సమానత్వం మాత్రమే కాదు. సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాలకు గౌరవం, హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కూడా. బహుజనులు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకోవాలి. సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రజాస్వామిక శక్తులను కమ్యూనిస్టులు తమ సహజ మిత్రులుగా గుర్తించాలి. వారిని కలుపుకుపోయే విశాలమైన ప్రజాస్వామ్య సంఘటన నిర్మించాలి.

కేవలం మార్క్సిస్టు పార్టీ పేరుతోనే అన్ని ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదు. ప్రజల వాస్తవ సమస్యలపై పోరాడే విస్తృత ఐక్యవేదికలు, ప్రజాస్వామ్య సంఘటనలు అవసరం. ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఐక్యతతో పాటు, కమ్యూనిస్టేతర అభ్యుదయ, ప్రజాస్వామిక, సామాజిక న్యాయ శక్తులతో ఐక్య కార్యాచరణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

8. కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ఎందుకు తక్షణ అవసరం?

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలు, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, కార్పొరేట్ ఆధిపత్యం, సామ్రాజ్యవాద జోక్యం, యుద్ధాలు కొనసాగుతున్నాయి. భారతదేశంలో కూడా కార్మిక చట్టాలు, రైతాంగ సమస్యలు, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యా-వైద్య రంగాల వ్యాపారీకరణ, కుల వివక్ష, మత విద్వేషాలు వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శ్రామిక వర్గానికి బలమైన రాజకీయ నాయకత్వం అవసరం. కానీ కమ్యూనిస్టు పార్టీలు అనేక గ్రూపులుగా విడిపోయి పనిచేస్తే ప్రజల్లో విశ్వసనీయత, పోరాట సామర్థ్యం, రాజకీయ ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది. ప్రజలు అడిగే ప్రశ్నకు కమ్యూనిస్టులు సమాధానం చెప్పాలి.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే వారే ఒకరితో ఒకరు ఎందుకు కలవలేకపోతున్నారు?

మార్క్సిజాన్ని నమ్మేవారే ఒకే వేదికపై ఎందుకు పనిచేయలేక పోతున్నారు? కార్మికవర్గ ఐక్యత గురించి చెప్పే పార్టీలు తమ ఐక్యతను ఎందుకు సాధించలేకపోతున్నాయి? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకోవాలి. ఇప్పటికే ఉన్న కమ్యూనిస్టు పార్టీలతోనే సోషలిజం నిర్మాణం సాధ్యమని అనుకోవడం సరిపోదు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించుకోవాలి. విస్తృతమైన ప్రజాస్వామ్య సంఘటనను ఏర్పాటు చేసుకోవాలి. సిద్ధాంతపరమైన చర్చలు జరిపి, ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని రూపొందించాలి. ముందుగా భావ సారూప్యత కలిగిన పార్టీలు ఈ ప్రక్రియను ప్రారంభించారు అన్ని కమ్యూనిస్టు పార్టీల మధ్య పునరేకీకరణ సాధించడానికి కింది అంశాలపై చర్చ ప్రారంభించాలి:

- మార్క్సిజం-లెనినిజం ప్రాథమిక సైద్ధాంతిక పునాదులపై ఉమ్మడి అవగాహన.
- కార్మికవర్గ, రైతాంగ, వ్యవసాయ కూలీల సమస్యలపై ఉమ్మడి పోరాటం.
- కుల నిర్మూలన, సామాజిక న్యాయం, లింగ సమానత్వంపై స్పష్టమైన విధానం.
- ప్రజాస్వామ్య హక్కులు, లౌకికవాదం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ.
- అంతర్గత ప్రజాస్వామ్యం, కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రాలపై చర్చ.
- నాయకత్వం, సంస్థాగత నిర్మాణం, ఆర్థిక పారదర్శకతపై ఉమ్మడి విధివిధానాలు.
- ప్రజా ఉద్యమాల్లో విడివిడిగా కాకుండా సమిష్టిగా పనిచేయడం.
- దీర్ఘకాలిక లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణకు కార్యాచరణ రూపొందించడం.

ఇది ఒక్కరోజులో జరిగే పని కాదు. కానీ ప్రారంభించకుండా లక్ష్యం సాధించలేం.

ఐక్యతకు అడ్డంకి వ్యక్తిగత అహంభావమా? సైద్ధాంతిక విభేదాలా?

కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్న విభేదాలను నిజాయితీగా విశ్లేషించాలి. ప్రతి విభేదాన్ని వ్యక్తిగత అహంభావానికి ఆపాదించడం కూడా సరైంది కాదు. కొన్ని విభేదాలు చారిత్రక, సైద్ధాంతిక, రాజకీయ, వ్యూహాత్మక కారణాల వల్ల ఏర్పడ్డాయి. అయితే వాటిని శాశ్వత విభజనలకు కారణాలుగా కొనసాగించాలా? లేక ప్రజాస్వామ్య చర్చ ద్వారా పరిష్కరించుకోవాలా? ఒకే సిద్ధాంతాన్ని విశ్వసించే శక్తులు పరస్పరం చర్చించుకోలేకపోతే, ప్రజలను ఎలా ఐక్యం చేస్తాయి?

కమ్యూనిస్టు పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. నాయకత్వ స్థానాలు, వ్యక్తిగత ప్రతిష్ఠ, గత విభేదాలు, పరస్పర అపనమ్మకాలు ఐక్యతకు అడ్డంకులుగా మారకూడదు. ఐక్యత అంటే విమర్శలను వదిలేయడం కాదు. భిన్నాభిప్రా యాలను దాచిపెట్టడం కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలో వాటిని పరిష్కరించుకుంటూ ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయడం.

10. కమ్యూనిస్టులారా! పునరేకీకరణ కోసం ముందుకు రండి

మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో ప్రతిపాదించిన సమస మాజ లక్ష్యం ఒక్క దేశానికి మాత్రమే పరిమితం కాదు. అది ప్రపంచ శ్రామిక జనుల విముక్తికి సంబంధించిన విశాల మైన లక్ష్యం. లెనిన్ ప్రతిపాదించిన కేంద్రీకృత ప్రజాస్వా మ్యం పార్టీని ఐక్యంగా, క్రమశిక్షణతో నడిపించడానికి ఒక ముఖ్యమైన నిర్మాణ సూత్రం. ఈ సిద్ధాంతాలను విశ్వసించే కమ్యూనిస్టులు వాటిని తమ సంస్థాగత ఆచరణలో కూడా ప్రతిబింబింపజేయాలి. కార్మికవర్గ ఐక్యత కోసం ఏర్పడిన కమ్యూని స్టు పార్టీలు కార్మికవర్గాన్ని చీల్చే సంస్థలుగా మారకూడదు. ఐక్యతను బలహీనపరిచే రాజకీయాలకు దూరంగా ఉండాలి.

భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ తమ చారిత్రక అనుభవాలను, విజయాలను, వైఫల్యాలను సమీక్షించుకోవాలి. గత విభేదాలను అధిగమించే దిశగా అడుగులు వేయాలి. మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదికన ఉమ్మడి రాజకీయ వేదికను నిర్మించాలి. సాధ్యమైనంత త్వరగా పునరేకీకరణ ప్రక్రియను ప్రారంభించాలి.

ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన ప్రశ్న కాదు. ఏ ఒక్క నాయకుడి వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన అంశం కాదు. ఇది భారతదేశ శ్రామికవర్గ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న.

- మార్క్సిజాన్ని నమ్మేవారంతా ఐక్యం కావాలి.
- కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలి.
- కుల, మత, ప్రాంత, లింగ ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడాలి.
- సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులను కలుపుకుపోవాలి.
- కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణకు తక్షణమే చర్చలు ప్రారంభించాలి.

మన ముందున్న లక్ష్యం చిన్నది కాదు. దోపిడీ లేని సమాజం, సమానత్వం, సామాజిక న్యాయం, శ్రామికవర్గ విముక్తి సాధించడమే మన లక్ష్యం. అంతటి గొప్ప లక్ష్యాన్ని సాధించడానికి వ్యక్తిగత అహం భావాలను, గ్రూపు తత్వాలను, అనవసరమైన విభజనలను అధిగమించాలి. కమ్యూనిస్టులారా! మార్క్సిజాన్ని విశ్వసించండి. లెనినిజాన్ని ఆచరించండి. శ్రామిక జనాన్ని ఐక్యపరచండి. కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించండి. మనసుంటే మార్గం ఉంటుంది. ఐక్యత ఉంటే శక్తి ఉంటుంది. సంఘటిత పోరాటం ఉంటే సమసమాజ నిర్మాణానికి బాట ఉంటుంది!

మార్క్సిస్టులందరూ ఒకే లక్ష్యం కోసం - ఐక్యమైన శ్రామికవర్గ రాజకీయ శక్తి నిర్మాణం కోసం ముందుకు రావాలి!



వ్యాస రచన
మాలోతు సాగర్
సెల్ నెంబర్ 7013805411




సిద్ధాంతం ప్రజల జీవితాలను తాకాలి

కులం, వర్గం, శ్రమ, వ్యవసాయం, ఆదివాసీ హక్కులు, పర్యావరణం, ప్రజాస్వామిక హక్కులు ఇవన్నీ ఒకే నినాదంతో పరిష్కరించబడవు. ప్రతి సమస్యకు దాని స్వభావం, ప్రభావిత ప్రజలు, స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న రాజకీయ అవకాశాలను బట్టి కార్యాచరణ అవసరం. ఇక్కడ చెప్పలనుకునే అంశం ఏంటంటే సిద్ధాంతం ప్రజలకు అర్థమయ్యే భాషలోకి రావాలనేది. ప్రజల సమస్యలను వారి అనుభవాల నుంచే వినాలి. ఉద్యమాలు ప్రజల తరఫున మాట్లాడడమే కాకుండా, ప్రజలు స్వయంగా మాట్లాడే వేదికలను నిర్మించాలి. నాయకత్వం ప్రజల నుంచి నేర్చుకోవాలి. ప్రజల విమర్శను కూడా స్వీకరించాలి. ఒక సమస్యపై తీసుకున్న నిర్ణయం ఫలితాలను ఇవ్వకపోతే దానిని సమీక్షించాలి. ఒక రాజకీయ సంస్థకు మంచి సిద్ధాంతం ఉందని చెప్పుకోవడం మాత్రమే సరిపోదు. దాని సభ్యుల ప్రవర్తన, నిర్ణయాలు తీసుకునే విధానం, మహిళలు, అణగారిన వర్గాల పట్ల ఆచరణ, ప్రజలతో సంబంధం, ఆర్థిక పారదర్శకత, విమర్శను స్వీకరించే సంస్కృతి ఇవన్నీ దాని రాజకీయ విశ్వసనీయతను నిర్ణయిస్తాయి. ప్రజల జీవితాలను మార్చాలనే లక్ష్యం ఉన్న ఉద్యమం, తనలోని అధికార సంబంధాలను కూడా పరిశీలించాలి. బయట సమానత్వాన్ని కోరుతూ లోపల అసమానతను కొనసాగిస్తే, సిద్ధాంతం - ఆచరణ మధ్య అంతరం పెరుగుతుంది. ఆ అంతరాన్ని గుర్తించి తగ్గించడం రాజకీయ పునర్నిర్మాణంలో భాగం. ఇదే సమయంలో భారత సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కులం, వర్గం రెండింటినీ అధ్యయనం చేయాలి. అధ్యయనం చేస్తున్నామని, అందుక నుగుణంగా ముందుకు సాగుతున్నామని మాటల్లో చెప్పటమే కాకుండా ఆచరణాత్మకంగా ఉండాలి. కులాన్ని, వర్గాన్ని ఒకదానిలో మరొకటి కలిపేయకుండా, వాటి పరస్పర సంబంధాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో గుర్తించాలి. మారుతున్న కార్మిక ప్రపంచం, వ్యవసాయ సంక్షోభం, ఆదివాసీ హక్కులు, సామాజిక గౌరవం, పర్యావరణం వంటి అంశాలను వామపక్ష రాజకీయాల పరిధిలోకి తీసుకురావాలి.

ఒకే వర్గానికి చెందిన ఇద్దరు కార్మికుల ఆర్థిక స్థితి దగ్గరగా ఉండవచ్చు. అయినప్పటికీ కులం కారణంగా వారి సామాజిక అనుభవాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. పని ప్రదేశంలో ఇద్దరూ ఒకే వేతనం పొందినా, నివాసం, వివాహం, సామాజిక సంబంధాలు, గౌరవం లేదా వివక్ష విషయంలో పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చు.

అదే విధంగా ఒకే కులానికి చెందిన వారందరూ ఒకే వర్గానికి చెందినవారు కారు. ఒక కులంలో భూమిలేని కూలీలు, చిన్న రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, పెద్ద ఆస్తులు కలిగినవారు ఉండవచ్చు. వారి ఆర్థిక ప్రయోజనాలు ఒకేలా ఉండవు. అందువల్ల కులం ఆధారంగా మాత్రమే వర్గ ప్రయోజనాలను నిర్ణయించడం కూడా సరైన పద్ధతిగా ఉండదు. కులం, వర్గం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవాలంటే నిర్దిష్ట ప్రాంతం, వృత్తి, భూమి యాజమాన్యం, వేతనాలు, విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక వివక్ష వంటి అంశాలను కలిపి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సిద్ధాంతపరమైన సూత్రం వాస్తవ పరిశీలనకు ప్రత్యామ్నాయం కాదనేది గుర్తించాలి. వామపక్ష రాజకీయాలు ఈ సంబంధాన్ని నిజాయితీగా విశ్లేషించగలిగితే, కార్మిక ఐక్యతను నిర్మించడంలోనూ సామాజిక న్యాయాన్ని సాధించడంలోనూ మెరుగైన పునాది ఏర్పడుతుంది. కుల సమస్యను ప్రస్తావించేవారిని వర్గ ఐక్యతకు వ్యతిరేకులుగా చూడటం, లేదా వర్గ సమస్యను ప్రస్తావించేవారిని కుల సమస్యను నిరాకరించేవారిగా ముందుగానే నిర్ణయించడం చర్చను మూసివేస్తుంది. అవసరమైనది పోటీ కాదు. వాస్తవాల ఆధారంగా పరస్పర విమర్శ, సహకారం. సమాజం మారినప్పుడు రాజకీయ విశ్లేషణ కూడా మారాలి. విశ్లేషణ మారినప్పుడు సంస్థాగత ఆచరణ కూడా మారగలగాలి. అలాంటప్పుడే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు ఎంతోకొంత తలుపులు తెరుచుకునే అవకాశం ఉంటుంది.



దారా
rajenderdamera@gmail.com





క్వారీలపై విజిలెన్స్ కొరడా..

రెండు రోజులుగా రాష్ట్రస్థాయి బృందాల మెరుపు తనిఖీలు

- అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట
- తనిఖీలతో బెంబేలు.. కొన్ని క్వారీలకు తాళాలు
- అక్రమ మైనింగ్‌పై సీఎంవోకు ఫిర్యాదులే కారణమా?

ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి): ఖమ్మం జిల్లాలో కంకర క్వారీల అక్రమాలపై విజిలెన్స్ పంజా విసిరింది. ఇన్నాళ్లూ యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మైనింగ్‌పై రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా రంగంలోకి దిగడంతో క్వారీ యజమానుల్లో గుబులు మొదలైంది. రెండు రోజులుగా జిల్లాలోని పలు క్వారీల్లో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి. అనుమతులు లేకుండానే తవ్వకాలు.. ఒకచోట అనుమతులు తీసుకుని మరోచోట తవ్వకాలు.. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ సాగిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ పరిణామాలతో కొందరు క్వారీ యజమానులు ముందస్తుగానే కార్యకలాపాలు నిలిపివేసి క్వారీలకు తాళాలు వేసినట్లు సమాచారం. మరికొందరు అందుబాటులో లేకుండా పోయినట్లు తెలుస్తోంది.

అక్రమార్కుల్లో గుబులు?

జిల్లాలో కంకర క్వారీల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పలు సందర్భాల్లో దినపత్రికల్లో కథనాలు వెలువడినా సంబంధిత యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోయిందన్న విమర్శలున్నాయి. నిత్యం క్వారీలను తనిఖీ చేసి పర్యవేక్షించాల్సిన అధికారులు అక్రమాలను నిలువరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలూ ఉన్నాయి. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వానికి చేరాల్సిన కోట్లాది రూపాయల రాయల్టీ అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రస్థాయి బృందాల రంగప్రవేశం

సాధారణంగా జిల్లా అధికారుల పర్యవేక్షణలో జరిగే తనిఖీలకు భిన్నంగా ఈసారి రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు నేరుగా రంగంలోకి దిగడం చర్చనీయాంశమైంది. జిల్లా అధికారులకు ముందస్తు సమాచారం లేకుండానే తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతో అక్రమాలను కప్పిపుచ్చుకునే అవకాశం లేకుండా పోయిందన్న ప్రచారం జరుగుతోంది. తనిఖీల విషయం తెలుసుకున్న కొందరు క్వారీ యజమానులు కార్యకలాపాలు నిలిపివేసి, అధికారులకు అందుబాటులో లేకుండా పోయినట్లు సమాచారం. తనిఖీల నుంచి బయటపడేందుకు కొందరు అధికార పార్టీ నేతలను ఆశ్రయించి లాబీయింగ్‌కు దిగినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

సీఎంవోకు ఫిర్యాదులు.. ఆపై తనిఖీలు?

ఖమ్మం జిల్లా పరిధిలోని కొన్ని కంకర క్వారీల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయంటూ సీఎంవోకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్రస్థాయి అధికారులు విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో రంగంలోకి దిగిన బృందాలు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. క్వారీల అనుమతులు, సంబంధిత రికార్డులు, తవ్వకాల తీరును పరిశీలించినట్లు సమాచారం.

వెలుగులోకి విస్తుపోయే అక్రమాలు?

తనిఖీల్లో కొన్ని క్వారీల్లో అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు, అనుమతులు పొందిన ప్రాంతాన్ని దాటి మరోచోట తవ్వకాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా సాగిన తవ్వకాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తనిఖీల్లో గుర్తించిన అక్రమాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

రాయల్టీకి గండి.. లాబీయింగ్‌కు తెర?

అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల రాయల్టీ నష్టం వాటిల్లుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇన్నాళ్లూ స్థానికంగా సాగిన అక్రమాలకు తాజా రాష్ట్రస్థాయి తనిఖీలతో అడ్డుకట్ట పడుతుందా? నిబంధనలు ఉల్లంఘించిన క్వారీలపై చర్యలు తీసుకుంటారా? బాధ్యులైన అధికారుల పాత్రపైనా విచారణ జరుగుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు తనిఖీలతో క్వారీలు మూతపడుతుండగా, చర్యలు తప్పించుకునేందుకు కొందరు యజమానులు లాబీయింగ్‌కు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. విజిలెన్స్ నివేదికలో ఇంకెన్ని అక్రమాలు బయటపడతాయో.. ఎవరిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే.

శ్రామిక వర్గ రాజ్య స్థాపనతోనే..పేదలకు విముక్తి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- ప్రజా సమస్యలపై కలంతో, క్షేత్రంలో పోరాడిన జగన్
- దోపిడీ వర్గాలను గద్దె దించేందుకు సంఘటితం కావాలి
- నోములలో జర్నలిస్టు జగన్ సంతాప సభ



రంగారెడ్డి , నవంబర్ 14 (జనంసాక్షి): ఆర్థిక, కుల అసమానతలను రూపుమాపి, శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం ఉద్యమించినప్పుడే పేదలకు నిజమైన విముక్తి లభిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ అన్నారు. మంచాల మండలంలోని నోముల గ్రామంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు, నవతెలంగాణ విలేకరి పల్లాటి జగన్ సంతాప సభను సీపీఎం నాయకులు ఎర్ర లింగం అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జగన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో లక్షల కోట్ల సంపద కొద్దిమంది బడాబాబుల చేతుల్లోనే పోగై ఉందన్నారు. పేదలకు కనీస వేతనాలు, భూ పంపిణీ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉచిత, సమాన విద్య, వైద్యం అందక సామాన్యులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగం పెరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు ఇళ్లు, ఇంటి స్థలాలు లేవని, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే పోలీసులతో కూల్చివేయిస్తున్నారని మండిపడ్డారు. అణచివేతలను ఎదురించి, హక్కులు సాధించుకోవడానికి ప్రజలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4 వేల మంది ప్రాణత్యాగంతో 10 లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందని గుర్తు చేశారు. అట్టడుగు వర్గం నుండి వచ్చిన పల్లాటి జగన్, పాషా నరహరి ఆశయ స్ఫూర్తితో సమాజ మార్పు కోసం ఎర్రజెండా నీడలో చివరి శ్వాస వరకు పని చేశారని కొనియాడారు. చిన్ననాటి నుంచే విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రజా పోరాటాల్లోకి అడుగుపెట్టిన జగన్, జర్నలిస్టుగా తన కలం ద్వారా రైతులు, గ్రామీణ ప్రజల కష్టాలను వెలుగులోకి తెచ్చారన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా శ్రేయస్సుకే ప్రాధాన్యతనిచ్చిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బోడ సామెల్ మాట్లాడుతూ.. పార్టీకి, ప్రజా ఉద్యమాలకు జగన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యాదయ్య, సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి జగన్, ఏఎంసీ మాజీ వయసు చైర్మన్ దండేటికార్ రవి, టిడిపి భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ చక్రపాణి, మాజీ సర్పంచ్ బాలరాజు, సీపీఎం జిల్లా, మండల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు, జగన్ కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సు-బైక్ ఢీ.. బాలుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు.. పొగ కారణంగానే ప్రమాదమని గ్రామస్థుల అనుమానం



జగిత్యాల జిల్లా క్రైమ్, నవంబర్ 14 (జనంసాక్షి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో హేమంత్ (16) మృతి చెందగా, ప్రసాద్ (18) తీవ్రంగా గాయపడ్డారు. కోరుట్లకు చెందిన ఆర్టీసీ బస్సు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో హేమంత్ తలకు తీవ్ర గాయమై అధిక రక్త స్రావంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పొలాల్లో గడ్డి కాల్చడంతో వెలువడిన దట్టమైన పొగ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనం కనిపించక ప్రమాదం జరిగి ఉంటుందని గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు అనుమానం వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. హేమంత్ మృతితో మాదాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు.

జ్ఞాపకశక్తిలో కరుణ్ గోపకుమార్‌కు మూడు ప్రపంచ రికార్డులు

బాలల దినోత్సవ వేడుకల్లో రికార్డుల ధ్రువీకరణ పత్రాల అందజేత



హైదరాబాద్, నవంబర్ 14 (జనం సాక్షి): జ్ఞాపకశక్తిలో అసాధారణ ప్రతిభ కనబరిచిన కేరళకు చెందిన బాల మేధావి మాస్టర్ కరుణ్ గోపకుమార్ మూడు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నాడు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లను గుర్తించి చెప్పడంలో అద్భుత ప్రతిభ కనబరిచినందుకు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ గ్లోబల్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అతని పేరు నమోదైంది. ఈ మేరకు శనివారం హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం సందర్భంగా గ్లోబల్ ఈవెంట్స్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన బాలోత్సవ్-2026 వేడుకల్లో ఈ రికార్డుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రపంచ రికార్డుల నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి. రమణారావు కరుణ్ గోపకుమార్ ప్రతిభను ధ్రువీకరించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, దైవజ్ఞ శర్మ, సినీనటి రాధిక, విజయ దుర్గా భవాని సమక్షంలో రికార్డుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి గ్లోబల్ ఈవెంట్స్ తరఫున మెమెంటోలు, చిల్డ్రన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాలు, పాల్గొన్న ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రంగనాయకి, వొదిపర్తి రాధిక, రెడ్డి బిల్లకంటి, సంధ్య రాథోడ్, శాలెం రాయ్ తదితర గురువులు తమ శిష్య బృందాలతో ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పసుపు ధర పసిడి బంగారం పైపైకి...

- ఒక్క క్వింటాళ్లుకు రూ.24 నుండి రూ.28 వేలు విక్రయాలు
- గత ఏడాది పండించిన పసుపు పంట





బంట్వారం నవంబర్ 13 జనం సాక్షి : పసిడి బంగారం పసుపు ధర దినదిన పైపైకి పెరుగుతుంది. అక్టోబర్ మాసంలో పసుపు ధర మార్కెట్లో రూ.18 వేల నుండి రూ.20 వేలు ధర పలుకగా, ప్రస్తుతం మార్కెట్లో రూ.24 నుండి రూ.28 లు ధర పలుకుతుంది. దీపావళి పండుగ తరువాత పండుగ సెంటిమెంట్తో వ్యాపారస్థులు పసుపు పంటను కొనుగోలు ప్రారంభం చేశారు. తాండూరులో వ్యాపారస్థులు పండుగ సెంటి మెంట్తో సుమారు రూ.27వేలకు పైగా ఖరీదు చేసినట్లు సమాచారం. నిజామాబాద్ మార్కెట్లో 24.400 నుండి రూ.28 వేల వరకు ధర పలికినట్లు తెలస్తుంది. గత ఏడాది 10 వేల నుండి రూ.12 వేలు ధర పలకడం, ఈ ఏడాది రూ.24 వేలకు పైగా ధర పలుకడంతో పసుపు రైతులు ఆనందంలో ఉన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం కాస్త ధర బాగున్న, పంటకు వైరస్ సోకడం, దిగుబడి తగ్గడంతో పాటు ధర కూడ నామ మాత్రంగా ఉందని బస్వాపూర్ సుల్తాన్పూర్ తోరుమామిడి తో పాటు పలు గ్రామాల రైతులు తెలియచేశారు. ప్రస్తుతం బంట్వారం మండలంలో సుమారు 400 నుండి 500ల ఎకరాల వరకు పసుపు పంట సాగవుతున్నట్లు తెలస్తుంది. గత ఏడాది క్వింటాళ్లుకు రూ.10వేలకు తగ్గకుండా ధర పలుకడంతో ఈ ఏడాది రైతులు పసుపు పంట సాగుపై ఆసక్తి చూపినట్లు తెలస్తుంది. రైతన్నలు ఏడాది పాటు కుటుంబం ఎంతో శ్రమించగా, పంట చేతికి వస్తున్న ధశలో పసుపు పంట రైతుకు కొన్ని సమయాల్లో కష్టాలు చవి చూడక తప్పడం లేదు. కాసుల వర్షం కురుపిస్తుందని నమ్మి పంటలను సాగుచేస్తే అన్న ధాతల అంచనాలకు కొన్ని సమయాల్లో తలకిందలు చేసిన సంఘటనలు ఉన్నాయి.. పండించిన పంటను ఆరు నెలల పాటు నిల్వలు చేసిన గిట్టు బాటు ధరదక్కడం లేదని తోరుమామిడి బస్వాపూర్ సుల్తాన్పూర్ పాటు పలు గ్రామాల పసుపు రైతులు వాపోతున్నారు. గతంలో పసుపు పంటతో అప్పులు తీరుతాయని ఆశ పడగా కొన్ని సమయాల్లో పాతాలానిక తొక్కెస్తుందని రైతులు అంటున్నారు. దిన దిన పెరుగుతున్న ఎరువులు, కూలీల ధరలకు, కనీసం కింటాళ్లుకు రూ.20 వేల నుండి రూ.20వేలు ధర పలికితే చేసిన కష్టంకు కాస్త లాభం ఉండుందని బంట్వారం మండలంలో సుల్తాన్పూర్ తరుమామిడి రొంపల్లి సల్బత్తపూర్ బస్వాపూర్ పాటు పలు గ్రామాల రైతులు అంటున్నారు. 2009-2010లో పసుపు ధర క్వింటాళ్లుకు రూ.17వేలు.

బంట్వారం మండలంలో ప్రస్తుతం సాగవుతున్న పసుపు పంట

పలకింది. 2011 నుండి 2021 వరకు పసుపు ధర కేవలం రూ.5వేల నుండి రూ.7వేలు ధర మించలేదు. 2024- 2025లో రూ.10వేల నుండి రూ.12వేలు పలుకడంతో ఈ ఏడాది రైతులు పసుపు (పసిడి) పంటలను సాగుచేశారు. బంట్వారం తురుమామిడి సుల్తాన్పూర్ మాల సోమవారం బస్వాపూర్ సల్బత్తాపూర్ రాంపల్లి పాటు పలు గ్రామాలల్లో రైతులు పసుపు పంటను ఏటా సాగుచేస్తారు మండలంలోని నాగులపల్లి గ్రామం పసుపు సాగుకు ప్రసిద్ధి.గతంలో పసుపు పంటను మండలంలో సుమారు 350 నుండి 400 ఎకరాల వరకు పంటను సాగుచేసేది. ఈ ఏడాది ధర అనుకూలంగా ఉండటంతో సుమారు 500ల ఎకరాలకు పైగా సాగుచేసినట్లు ఆయా గ్రామాల రైతుల ద్వార తెలస్తుంది. బోరు బావుల వద్ద సాగునీరు అనుకూలం ఉన్న రైతులు సుమారు 20 గుంటల నుండి సుమారు మూడు ఎకరాల వరకు పంటను సాగుచేయిస్తున్నారు. వాన కాలం మొదట్లో పంటను విత్తితే ఫిబ్రవరి, మార్చు నెలల్లో పంటలు చేతికి వస్తుంది. గతంలో తాండూరు నియోజక వర్గంలో మార్కెట్ లేక రైతులు పండించిన పసుపు పంటను వికారాబాద్, సదాశివపేట తో పాటు ఇతర మార్కెట్కు తరలించవలసి వస్తుందని అంటున్నారు. ఈ ప్రాతంలో పసుపు మార్కెట్ను ఏర్పాటు చేయాలని పలు సమయాలల్లో రైతులు పాలకులకు, అధికారులకు విన్నవించిన ఫలితం దక్కలేదని రైతుఅఉ చెబుతున్నారు.

పసుపు సాగుకు పెట్టుబడి అధికం ...

ఎకరా పోలంలో పసుపు పంట సాగుచేయాలన్న సుమారు రూ.60 వేల నుండి రూ.80వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. విత్తనం కొనుగోలు చేయడం కోసం సుమారు రూ.40వేలు, పంట విత్తడం, కలుపు తీయడం, మందులు, ఎరువులు వేయడం కోసం రూ.40వేలు అదనంగా ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఎకరా పోలంలో సుమారు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే లాభం ఉంటుందని అంటున్నారు. అందుకే రైతులు పసుపు పంటను అధికంగా సాగుచేస్తున్నారు.

వ్యాపారస్థులకే లాభం ...

ప్రతి ఏటా పసుపు పంట మార్చి, ఎప్రిల్ నెలల్లో చేతికి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో రూ. 24 వేల నుండి రూ.28వేలు ధర పలికిన పంట చేతికి వచ్చె సమయంలో పంట ధర పూర్తిగ తగ్గిపోతుందని పలు గ్రామాల రైతులు అంటున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ధరను రైతుల పంటలు చేతికి వచ్చె సమయంలో కూడ ఉండేల చుడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

వచ్చే ఎన్నికల్లో బీసీలకు 80 ఎమ్మెల్యే స్థానాలు సాధిస్తాం!

- బీసీల రాజకీయ పాలసీ ప్రకటించాలి
- ఓటు ఆయుధంతో అగ్రకుల అధిపత్యానికి చరమగీతం
- తాండూరులో బీసీ జెండా ఎగరేస్తాం : జాజుల శ్రీనివాస్ గౌడ్

తాండూరు, నవంబర్ 14 (జనంసాక్షి): వచ్చే 2028 ఎన్నికల్లో 80 మంది బీసీ ఎమ్మెల్యేలను గెలిపించుకోవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. తెలంగాణలో బీసీల రాజకీయ శకం ప్రారంభమైందని, రాజకీయ అధికారంలో వాటా సాధించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాండూరుకు చెందిన ఈడిగ శ్రీనివాస్ గౌడ్ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శనివారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విలేమున్ చౌరస్తా నుంచి ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ వరకు సాగిన ర్యాలీలో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బీసీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. జనాభాలో అధికంగా ఉన్న బీసీలు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొరలు, పటేళ్ల ఆధిపత్య రాజకీయాలకు స్వస్తి పలకాలని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకుండా రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అన్ని పార్టీలు తమ బీసీ రాజకీయ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టాలని, ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లే కల్పించడం అన్యాయమన్నారు. 'ఓటు మనదే.. సీటు మనదే' నినాదంతో



బీసీ బిడ్డలను చట్టసభలకు పంపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో సగం అసెంబ్లీ స్థానాలను బీసీలు సాధించేలా రాజకీయ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తాండూరు నియోజకవర్గంలోనూ బీసీ అభ్యర్థిని గెలిపించి బీసీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. సమావేశానికి బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మా, మున్సిపల్ చైర్మన్ పటోళ్ల నీరజ, మాజీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్లు మురళీకృష్ణ, రాజుగౌడ్, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహారాజ్, డాక్టర్ సంపత్ కుమార్, టీజేఎస్ కన్వీనర్ సోమశేఖర్, రిటైర్డ్ అదనపు ఎస్పీ మధుసూదన్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మధులత, పలువురు కౌన్సిలర్లు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

ఫోక్స్ కో న్యాయస్థాన భవనానికి శంకుస్థాపన

- న్యాయవ్యవస్థలు ప్రజలకు చేరువలో ఉండాలి
- బాలలపై జరిగే లైంగిక నేరాలకు కేసులు వేగవంతం చేయాలి
- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 14 (జనం సాక్షి): వికారాబాద్‌లో శనివారం ఫోక్సో, కుటుంబ న్యాయస్థానంతో కూడిన 10+2 కోర్టు భవన సముదాయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వికారాబాద్ జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రేణుక యార , గౌరవ అతిథులు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ లతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభం లతో హైకోర్టు న్యాయమూర్తులకు అట్టహాసంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హై కోర్టు న్యాయమూర్తులు అటవీ వసతి గృహంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా లు హై కోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వల గావించి హై కోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ..జిల్లాలో కోర్టుల ఏర్పాటుతో న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ కోర్టుల ప్రారంభం కీలక ముందడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. కోర్టుల్లో రోజురోజు కు కేసులు పెరుగుతున్నాయాని, కేసుల తగ్గదలకు అందరు కృషి చేయాల్సి అవసరం ఉందని తెలిపారు. కోర్టుల్లో భూ సమస్యలు తగ్గించాలంటే మీడియేషన్ చట్టంపై అవగాహన కల్పించి కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు.



జిల్లాలో ఫోక్సో న్యాయస్థానం ఏర్పాటుతో బాలలపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణ మరింత వేగవంతం కావడం జరుగుతుందని అన్నారు.కుటుంబ న్యాయస్థానం ఏర్పాటు వల్ల కుటుంబ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు మెరుగైన న్యాయ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయమూర్తి, లాలోసింగ్ శ్రీనివాస నాయక్, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు అనంతసేనా రెడ్డి, ఆకుల మహేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు జి.లవ కుమార్, కార్యదర్శి పి.వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మాధవ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ యాదవ రెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, వివిధ కోర్టుల బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 నవంబర్ 2026

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే లక్ష్యం
- కల్వకుర్తిలోనూతన ఆసరాపింఛన్లమంజూరు పత్రాల పంపిణీ
- సీఎంరేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి, నవంబర్ 14 (జనంసాక్షి) : పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తోందని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ ఆకాంక్ష అని వెల్లడించారు.

పేదలకు పింఛన్ ఒక ఆర్థిక భరోసా

వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా గౌరవంగా జీవించేందుకు పింఛన్ ఎంతోఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు.గీత కార్మికులు,దివ్యాంగులు, ఒంటరి మహిళలు,చేనేత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని వివరించారు. పింఛన్ మొత్తం చిన్నదిగా కనిపించినా, ప్రతి నెలా ఆ డబ్బు అందుకోవడం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు

అర్హత ఉన్నవారు ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు పేదల సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలనుమెరుగుపరిచేలా ఉండాలని,చివరి అర్హుడి వరకు ప్రభుత్వ సహాయం చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బాల్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్, వెల్దండ మండల పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, కల్వకుర్తి సింగిల్ విండో చైర్మన్ పురం హరీశ్వర్ రెడ్డి,వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ భూపతిరెడ్డి,ఆత్మ కమిటీ సభ్యుడు సుదర్శన్ రెడ్డి,కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు,మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సింగూర్ జలాలు సంగారెడ్డి జిల్లాకే కేటాయించాలి



సదాశివపేట, నవంబర్ 14 (జనంసాక్షి) : సింగూర్ జలాలను సంగారెడ్డి జిల్లా తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు గ్రామంలో నల్గొండలో జరగనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగూర్ జలాశయంలోని 2 టీఎంసీల నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఏప్రిల్, మే నెలల వరకు జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉంచాలన్నారు. హైదరాబాద్ తాగునీటికి కృష్ణా, గోదావరి జలాలను వినియోగించాలని, కరువుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నవంబర్ 15న నల్గొండలో నిర్వహించే కిసాన్ సభ బహిరంగ సభకు లక్షలాది మంది రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లేష్, మహేష్, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలి



బెజ్జంకి, నవంబర్ 14 (జనం సాక్షి) : మండలంలోని తోటపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సమస్యలు, హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై చర్చించారు. బాలలు తమ సమస్యలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం కల్పించారు.ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సదుపాయాలు అందించడంతో పాటు బాలల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ అశ్విని శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాంపల్లి శంకర్,వార్డు సభ్యులు ఏసుగుల అనిత,బుర్ర మహేందర్,వెన్న వజ్రమ్మ,ఉపాధ్యాయులు షహీన్,లలిత,కిరణ్మయి,అంగన్‌వాడీ టీచర్లు స్వరూప,సుగుణ,మహిళా సంఘం సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కాపాడాలి



గద్వాల, నవంబర్ 13 (జనం సాక్షి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయకూడదని, నిధుల మళ్లింపును తక్షణమే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గద్వాలలోని సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన బోర్డు నిధులను దారి మళ్లించడం సరికాదన్నారు. కార్మికులకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే, సంక్షేమ బోర్డును ‘ఇందిరమ్మ బీమా’ పథకంలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తు..



చిలప్‌చేడ్, నవంబర్ 14 (జనంసాక్షి) : మండల పరిధిలోని సోమక్కపేట గ్రామంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, వారి భవిష్యత్తు అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెస్త దుర్గాచలం మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పిల్లలను విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెస్త దుర్గాచలం, ఉపసర్పంచ్ నరేష్, గ్రామ కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు నవనీత, మాధవి, వీఓ మాధవి, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్థులు సుధాకర్, మల్లేశం, శ్రీశైలం, దుర్గయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వమే నిజమైన సమాజ సేవ

- రాష్ట్ర ఇన్‌చార్జి ఎండీ సాదిక్ అలీ



జడ్చర్ల, నవంబర్ 14 (జనంసాక్షి) : మానవత్వంతో చేసే సేవే నిజమైన సమాజ సేవ అని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి ఎండీ సాదిక్ అలీ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శనివారం జడ్చర్లలోని రూరల్ వెల్ఫేర్ వృద్ధాశ్రమంలో టౌన్ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది వృద్ధులకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయకుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎం. లక్ష్మీకాంత్, మహబూబ్‌నగర్ మండల చైర్మన్ కె. రాఘవేంద్ర, టౌన్ వైస్ చైర్మన్ సాదత్ అలీ, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూర్, నవంబర్ 14 (జనం సాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా.. ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని సాయి తిరుమల ఫంక్షన్ హాల్లో నిర్వహించిన దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేయకుండా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఆత్మకూరు పట్టణం, మండల పరిధిలో ఇప్పటివరకు 650 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులైన పేదలందరికీ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. డయాలసిస్ రోగులకు పెన్షన్లు కూడా అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే జూరాల వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆత్మకూరు నుండి మంత్రాలయం వరకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతతోనే కుటుంబాలు, గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి అన్నారు. ఈ నెల 19వ తేదీన ఇందిరా గాంధీ జన్మదినం సందర్భంగా మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులందరికీ చేయూత పెన్షన్ అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే పెన్షన్లు పొందుతున్న వారికి యథావిధిగా పెన్షన్లు కొనసాగుతాయని, కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు కూడా అదే రోజు నుంచి పెన్షన్ నగదు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ నాగమణి, వైస్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్ రహమతుల్లా, రాష్ట్ర కల్లుగీత డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ డీఆర్డీఓ ఉమాదేవి, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, పిసిసి జిల్లా కార్యదర్శి తులసి యాదవ్, మండల అధ్యక్షులు నాగేష్, టౌన్ అధ్యక్షులు ఇర్లదిన్నె శ్రీనివాసులు,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచే వరకు ఆందోళన ఆగదు



రేవల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000కు పెంచే వరకు ఆందోళన ఆగదని ఆసుపత్రి బ్రాంచ్ ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆశభీ, ఇందిరమ్మ, వెంకటమ్మలు స్పష్టం చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా శనివారం మూడో రోజు రేవల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట కార్మికులు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు చెల్లిస్తున్న అరకొర వేతనాలతో పూట గడవడం కష్టంగా మారిందన్నారు. పెరుగుతున్న ధరలతో ప్రస్తుతం ఇస్తున్న వేతనాలతో బతుకులు దినదినగండంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2012 నుండి పుష్కరకాలంగా కనీస వేతనాల జీవోలు సవరణకు నోచుకోలేదని, తాజాగా ఆరు నెలల క్రితం ప్రభుత్వం కనీస వేతనాల జీవోను సవరిస్తూ మూడు జోన్లుగా, నాలుగు కేటగిరీలుగా విభజించి జీవో 6ను విడుదల చేసిందని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా ఆసుపత్రి కార్మికులు వేతనాల పెంపుకు నోచుకోలేదని, కనీసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెంచిన కనీస వేతనాలనైనా ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.

ప్రేమోన్మాది అనిల్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలి

- దళిత ప్రజా సంఘాల నాయకులు



మక్తల్, నవంబర్ 14 (జనంసాక్షి) : మక్తల్ మండలం జౌలాపురం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని అనిత (దళిత అమ్మాయి) ఆత్మహత్యకు కారణమైన ప్రేమోన్మాది అనిల్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని వివిధ దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఐ.బి.లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మృతురాలు అనిత తండ్రి గత ఏడాది మరణించడంతో, తల్లిని చూసుకుంటూ హైదరాబాద్‌లో ఉద్యోగ శిక్షణ పొందుతోంది. అదే సమయంలో చిన్నచింతకుంట మండలం అమిస్తాపూర్ గ్రామానికి చెందిన అనిల్ అనే బీసీ యువకుడు ప్రేమ పేరుతో ఆమె వెంటపడి వేధించాడు. పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయగా, ఆమె నిరాకరించడంతో ఫోన్ల ద్వారా నిత్యం వేధింపులకు గురిచేశాడు. ఈ వేధింపులు భరించలేక మనస్తాపానికి గురైన అనిత గురువారం పొలంలోని గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనిత తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటివరకు నిందితుడు అనిల్ ను అరెస్టు చేయకపోవడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే అతన్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని కోరారు. నిందితున్ని వెంటనే అరెస్టు చేయనిచో జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో షీ టీమ్‌లు, టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నప్పటికీ ప్రేమోన్మాదుల వేధింపులు ఆగకపోవడం పోలీసు యంత్రాంగం, ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. ఈ ఘటనలతో తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత చదువులకు పంపడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పించి, ఇలాంటి ఆత్మహత్యలను పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జగ్గలి అంజప్ప, డి.ఎస్.పి. ఈశ్వర్ మహారాజ్, దళిత ప్రజాసంఘాల నాయకులు జీర్గల్ నగేష్, మాలల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి చంద్రశేఖర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, నాయకులు సందీప్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి పిల్లల ప్రజావాణి

- మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పిల్లల “ప్రజావాణి”
- బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు
- అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ బ్యూరో, నవంబర్ 14 (జనం సాక్షి) : బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యలు మరియు అభిప్రాయాలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నవంబర్ 16, 2026న సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా నవంబర్ 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా, ముఖ్యంగా నిరుపేద, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు తమ సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులు మరియు అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ జిల్లా ప్రజావాణి నిర్వహించే ప్రదేశంలో ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి డెస్క్ ఏర్పాటు చేసి, పిల్లల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను సావధానంగా విని సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకొనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, కార్మిక శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొని పిల్లలకు సంబంధించిన సమస్యలపై తక్షణ స్పందన తెలియజేయనున్నామన్నారు.బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, అభివృద్ధి, బాలలపై హింస, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టనున్నారు. పిల్లల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, తీసుకున్న చర్యలు, పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఫిర్యాదులు స్వీకరించే సమయంలో పిల్లల గోప్యత, భద్రత మరియు గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పిల్లల గొంతుకను వినడం, వారి హక్కులను గౌరవించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం జిల్లా యంత్రాంగం బాధ్యత.ఈ కార్యక్రమంలో పిల్లలు స్వచ్ఛందంగా పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాలలందరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరియు హక్కులతో కూడిన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు.



శ్రమదానంతో పురాతన బావి శుభ్రం



కమలాపూర్, అక్టోబర్ 14 (జనంసాక్షి) : స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా శనివారం కమలాపూర్ లోని పురాతన రామగుండం భావి శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ సహా వార్డు సభ్యులు ఊరుకోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమం 1వ, 2వ వార్డుల్లో నిర్వహించారు. బావితోపాటు మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనేక కరువు కాటకాలు వచ్చిన సమయంలో గ్రామాన్ని ఇదే బావి ఆదుకుందని అటువంటి బావిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తుల అందరిపై ఉందన్నారు. శుభ్రం చేసిన బావిని పరిశుభ్రంగా పరిరక్షించుకోవాలని గ్రామస్తులను సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాయకులు మార్క అశోక్, అవునూరి తిరుపతి, పిల్లి సతీష్, ఎండపెల్లి మల్లారెడ్డి, మౌటం నాగరాజు, పుల్ల ఐలయ్య, బాలసాని కుమారస్వామి, పచ్చిమట్ల కుమారస్వామి, ప్రగతి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొంతకొండ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బాలలు రోల్ మోడల్‌గా నిలవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- బాలికలతో కలిసి నృత్యం చేసిన కలెక్టర్
- హనుమకొండ అసుంత నిలయంలో ఘనంగా బాలల దినోత్సవం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 14 (జనంసాక్షి) : బాలలు రోల్ మోడల్ గా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని అసుంత నిలయం చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ ప్రాంగణంలో జిల్లా మహిళలు, దివ్యాంగులు వయో వృద్ధుల శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ బాలల దినోత్సవ వేడుకల్లో బాలలకు సంబంధించి సున్నితమైన అంశాలను చక్కటి సందేశం తో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించే విధంగా బాగున్నాయని ప్రశంసించారు. చిన్నారులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత నివ్వాలని పేర్కొన్నారు. చిన్నారులతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ ఫోటో దిగారు. నిలయంలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బాలికలతో కలిసి నృత్యం చేసి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, చైర్పర్సన్ అనిల్ చందర్ రావు, సిడబ్ల్యుసీ మాజీ చైర్పర్సన్లు మండల పరశు రాములు, అనితా రెడ్డి, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్. అవంతి, ఎఫ్ ఎం ఎంఎస్-ఎస్ఎస్ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ఇంచార్జి డిసిపిఓ ఎస్. ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్. భాస్కర్, ఫాదర్ కోషి, ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, కరుణాలయం, డివైన్ మెర్సీ, అసుంత నిలయం బాలలు, తదితరులు పాల్గొన్నారు.

డిశ్చార్జ్‌మెంట్ ఎంబిబిఎస్ విద్యార్థులకు మానవతా దృక్పథంతో మరో అవకాశం కల్పించాలి

- వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు మర్సకట్ల అనిల్ కుమార్



తొర్రూరు , నవంబర్ 14 (జనంసాక్షి): కళాశాల నుండి సర్టిఫికెట్లు తీసుకున్న కారణంగా డిశ్చార్జిమెంటైన 45 మంది ఎంబిబిఎస్ విద్యార్థులకు మానవతా దృక్పథంతో మరో అవకాశం కల్పించాలని వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు మర్సకట్ల అనిల్ కుమార్ కోరారు. నేషనల్ మెడికల్ కమిషన్ 2019-2020 విద్యా సంవత్సరం నుంచి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నాలుగు ప్రయత్నాలు పూర్తయిన వారికి మెర్సీ అవకాశం కల్పించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కళాశాలల నుంచి సర్టిఫికెట్లు తీసుకొని డిశ్చార్జ్ అయిన విద్యార్థులకు ఈ అవకాశం వర్తించదని పేర్కొనడం బాధాకరమన్నారు. సర్టిఫికెట్లు తీసుకోవడానికి విద్యార్థులు వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక పరిస్థితులు, తమ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం, ఈ అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితుల్లో యూనివర్సిటీ నుంచి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెనక్కి తీసుకున్నారని, అంత మాత్రాన వారి వైద్య విద్యను కొనసాగించే అవ కాశాలను పూర్తిగా తొలగిం చడం సమంజసం కాదన్నారు. దీని కారణంగా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వరంగల్ పరిధిలో సుమారు 45 మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను దృష్టిలో ఉంచుకొని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు ఈ అంశంపై ప్రత్యేక చొరవ తీసుకొని నేషనల్ మెడికల్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. డిశ్చార్జ్ అయిన 45 మంది విద్యార్థులకు మెర్సీ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారుల సందడి

- శాంతినికేతన్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



నిర్మల్ బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో శని వారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఫుడ్ ఫెస్టివల్‌తో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలను నిర్వహించారు.

ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. చిన్నారుల సృజనాత్మకత, ఉత్సాహం, ప్రతిభను చూసి అతిథులు అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. క్రీడా పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, విద్యావేత్త వి. సత్యనారాయణ మూర్తి, జి. రమణారెడ్డి హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని సూచించారు. బాల్యంలోనే మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలని పేర్కొన్నారు.. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్, పద్మనాభగౌడ్, ప్రిన్సిపాల్, భగవతి, శ్రీకాంత్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు గుడికుంట చెరువు కబ్జా..!

- ప్రభుత్వం కొన్న భూమికే మళ్లీ పట్టా
- గుడికుంట చెరువు కబ్జా వెనుక పెద్ద కుట్ర
- హైదరాబాద్ వాసికి సహకరించిన అధికారెవరు..?




వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 14 (జనం సాక్షి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామ శివారులో గల గుడికుంట చెరువు శిఖం కబ్జా వ్యవహారాన్ని పైపైన చూస్తే ఇది ఏదో ఒక వ్యక్తి చేసిన సాధారణ ఆక్రమణలా కనిపిస్తుంది. కానీ లోతుగా వెళ్లి చూస్తే ఇది ఆక్రమణ కాదు, చాలా కాలంగా పక్కా పథకం ప్రకారం, దశలవారీగా అమలు చేసిన పెద్ద కుట్రలా కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చాయి, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇది చెరువు భూమేనని తేల్చారు, అక్కడ ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టారు. కబ్జాదారుడు ఏ మాత్రం వెనక్కి తగ్గకపోవడం, పైగా అధికారులపైనే కేసులు పెట్టి బెదిరించడం వెనుక కేవలం ధైర్యం మాత్రమే లేదు, కాగితాల మాయాజాలం, అధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానం ఇప్పుడు గ్రామంలోనే కాదు, చుట్టుపక్కల మండలాల్లో కూడా బలంగా వ్యక్తమవుతోంది. అసలు ఈ కబ్జా ఎలా మొదలైంది, ఎవరి ద్వారా సాగింది, ఎవరి సహకారంతో ఇంత దూరం వచ్చింది అనేది తేలితేనే గుడికుంట చెరువును కాపాడుకోగలమని ఆయకట్టు రైతులు అంటున్నారు.

అమ్మింది ప్రభుత్వ భూమినే..!

అసలు కథ చాలా ఏళ్ల క్రితం మొదలైంది. గుడికుంట చెరువు పక్కన కొంతమంది రైతులకు వ్యవసాయ భూములు ఉండేవి. చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు అందించాలని ప్రభుత్వం భావించి, ఆ రైతుల భూములను నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించి స్వాధీనం చేసుకుంది. ఆ డబ్బులు తీసుకున్న రైతులు కూడా ఆ భూమి ఇక తమది కాదని, అది చెరువులో భాగమైపోయిందని అంగీకరించారు. అప్పటి నుంచి ఆ భూమి మీద వర్షం వస్తే నీళ్లు నిలబడతాయి, చెరువు నిండితే ఆ ప్రాంతం మొత్తం నీటిలో మునిగిపోతుంది. అంటే క్షేత్రస్థాయిలో ఆ భూమి ఎప్పుడో చెరువు అయిపోయింది. కానీ అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే, భూమిని తీసుకున్నాక రెవెన్యూ రికార్డుల్లో ఆ మార్పును సరిగా, పూర్తిగా నమోదు చేయకపోవడం వల్ల. కాగితాల మీద మాత్రం ఆ పాత రైతు పేరు అలానే మిగిలిపోయింది. ఆ ఒక్క చిన్న పొరపాటు, ఆ ఒక్క నిర్లక్ష్యమే ఇప్పుడు ఇంత పెద్ద కబ్జాకు బీజం వేసింది. రికార్డులు సరిచేయకపోవడమే మధ్యవర్తులకు, కబ్జాదారులకు వరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమిని చూడకుండానే కొన్న హైదరాబాద్ వాసి..!



రికార్డుల్లో మిగిలిపోయిన ఆ పాత పత్రాలను అడ్డం పెట్టుకుని ఓ మధ్యవర్తి రంగంలోకి దిగాడని స్థానికులు చెబుతున్నారు. భూమి వ్యవహారాల్లో తిరిగే ఆ వ్యక్తి, ఆ పాత పత్రాలు ఉన్న రైతు దగ్గరికి వెళ్లి, "పేపర్ల మీద భూమి ఇంకా నీ పేరు మీదే ఉంది, దాన్ని అమ్మేస్తే డబ్బులు వస్తాయి" అని నమ్మించి ఒప్పించాడని సమాచారం. ఆ తర్వాత ఆ పేపర్లను చూపించి, ఆ భూమిని హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తికి అమ్మేశాడు. వాస్తవానికి ఆ వ్యక్తికి వెంకటాపూర్ తో గానీ, గుడికుంట చెరువుతో గానీ, ఇక్కడి రైతులతో గానీ ఎలాంటి సంబంధం లేదు, ఇక్కడికి ఎప్పుడూ వచ్చిన దాఖలాలు కూడా లేవని గ్రామస్తులు చెబుతున్నారు. ఆయన ఆ భూమిని కళ్లతో చూడకుండానే, సర్వే నెంబర్ ఎక్కడ ఉందో, అది చెరువు శిఖంలో ఉందో లేదో తెలుసుకోకుండానే, కేవలం పేపర్లు చూసి, మధ్యవర్తి చెప్పిన మాటలు నమ్మి కొనేశాడని తెలుస్తోంది. కాగితం మీద పుట్టిన భూమి, చివరికి క్షేత్రంలో నిజమైన చెరువును మింగేసేందుకు దారి తీసింది. చౌకగా వస్తుందనే ఆశతోనే ఈ కొనుగోలు జరిగిందా, లేక తెలిసే కొన్నారా అనే అనుమానం కూడా ఇప్పుడు రైతుల్లో వ్యక్తమవుతోంది.

కొన్నది కొంత.. మింగింది ఎక్కువ..!

పేపర్ల మీద కొన్న భూమి కొంతే అయినా, క్షేత్రంలో ఆక్రమించింది మాత్రం దానికి ఎన్నో రెట్లు ఎక్కువని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చేతికి పట్టా రాగానే ఆ వ్యక్తి ఇక్కడికి వచ్చి, ముందుగా చెరువు శిఖం చుట్టూ గుర్తులు పెట్టి, ఇది తన భూమి అని చెప్పుకోవడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత రాత్రికి రాత్రే టిప్పర్లతో, ట్రాక్టర్లతో, జేసీబీలతో మట్టి తెచ్చి పోసి, చెరువు శిఖాన్ని చదును చేయడం మొదలుపెట్టాడని రైతులు చెబుతున్నారు. చెరువులోకి నీళ్లు వచ్చే దారిని కూడా మూసేసే విధంగా మట్టి పోయడంతో, భవిష్యత్తులో వర్షాలు పడితే చెరువు ఎలా నిండుతుంది, నిండిన నీళ్లు ఎక్కడ నిలబడతాయి, ఆయకట్టు రైతుల పరిస్థితి ఏంటి అనే భయం అందరిలో మొదలైంది. ప్రభుత్వం ఎప్పుడో కొని చెరువులో కలిపిన భూమినే మళ్లీ అమ్మడం ఒక తప్పైతే, దాని పేరు చెప్పుకుని మరింత చెరువు భూమిని కబ్జా చేయడం మరింత దారుణమని, ఇది కేవలం భూమి కబ్జా కాదు, రైతుల జీవనాధారాన్ని దెబ్బతీసే కుట్ర అని వారు మండిపడుతున్నారు.

పట్టా ఇచ్చింది ఎవరు..?

ఈ మొత్తం కథలో అత్యంత అనుమానాస్పదమైన, అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్న అంశం పట్టా పాస్ బుక్ వ్యవహారం. ప్రభుత్వం ఎప్పుడో డబ్బులు ఇచ్చి తీసుకుని చెరువులో కలిపిన భూమికి మళ్లీ పట్టా పాస్ బుక్ ఎలా వచ్చింది, ఎవరి సంతకంతో వచ్చింది, రికార్డులు ఎవరు, ఎలా మార్చారు అనే ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానం లేదు. అప్పట్లో ఓ డిప్యూటీ తహసీల్దార్ సహకరించి, ఆ వ్యక్తికి పట్టా ఇప్పించినట్లు సమాచారం అందుతోందని స్థానికులు చెబుతున్నారు.

తేలాల్సింది ఎంతో ఉంది..!

ఇప్పటివరకు జరిగినదంతా చూస్తే, కేవలం బోర్డు పెట్టడంతో, సర్వే చేసి చెరువు భూమి అని తేల్చడంతో ఈ సమస్య పరిష్కారం కాదని రైతులు స్పష్టంగా చెబుతున్నారు. అసలు మధ్యవర్తి ఎవరు, ఆయనకు ఎవరి అండ ఉంది, పట్టా ఎలా వచ్చింది, రికార్డులు ఎలా మారాయి, కొన్న వ్యక్తికి ఈ భూమి చెరువు భూమి అని తెలిసినా కొన్నారా, లేక మోసపోయారా అనే అంశాలన్నింటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చెరువు శిఖం భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుని, చుట్టూ ఫెన్సింగ్ వేసి, శాశ్వతంగా చెరువును కాపాడే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుడికుంట చెరువును కాపాడుకోవాలంటే ఇప్పుడు కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకోవాలని, పట్టా జారీ వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, కబ్జా చేసిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని, చెరువును యథాతథంగా పునరుద్ధరించాలని ఆయకట్టు రైతులు, మండల ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

వినికిడి లోపం ఉన్నవారికి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలి

- కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సను మరింత ఖర్చు తగ్గించి పేదలకు చేరువ చేయాలి
- వైద్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- లక్షణాల ఆధారిత చికిత్సకు మించి వ్యాధి మూలకారణాలపై దృష్టి సారించాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (జనంసాక్షి) : వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి అత్యాధునిక వైద్య సాంకేతికతతో మెరుగైన చికిత్స అందుబాటులోకి రావాలని, ముఖ్యంగా కాక్లియర్ ఇంప్లాంట్ వంటి ఖరీదైన చికిత్సలను మరింత ఖర్చు తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు చేరువ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య రంగంలో నిరంతర పరిశోధనలు, వ్యాధుల మూలకారణాల గుర్తింపు, ముందస్తు వ్యాధి నిర్ధారణకు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యులకు పిలుపునిచ్చారు. హనుమకొండ బాల సముద్రంలోని సేవకా రీజెన్సీ, రాయల్ డెక్కన్ హోటల్స్‌లో అపర్ణ ఈఎన్‌టీ హాస్పిటల్, అపర్ణ రాయ్ ఈఎన్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఏఓఐ తెలంగాణ సహకారంతో నిర్వహించిన ' సీఐ ఫ్రంటియర్స్--2026' సదస్సుకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ వైద్య రంగానికి విశేష సేవలందించిన సీనియర్ వైద్యులు, నిపుణులు ఇక్కడ ఉండటం గర్వకారణమన్నారు. సీనియర్ వైద్యుల అనుభవం, మార్గదర్శకత్వం యువ వైద్యులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రస్తుతం అనేక వ్యాధులకు లక్షణాల ఆధారంగా చికిత్స అందిస్తున్నప్పటికీ, వ్యాధి అసలు కారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపే దిశగా వైద్య పరిశోధనలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పేషెంట్‌కు తాత్కాలిక ఉపశమనం కల్పించడమే కాకుండా, పూర్తి ఆరోగ్యాన్ని అందించే చికిత్సా విధానాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పర్యావరణ కాలుష్యం, ఆహార కల్తీ, ప్లాస్టిక్ వినియోగం, మైక్రోప్లాస్టిక్స్ వంటి అంశాలు ప్రజారోగ్యంపై చూపుతున్న ప్రభావాలపై కూడా వైద్యులు పరిశోధనలు చేయాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత కీలకమని, ఇందుకోసం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలని ఎంపీ స్పష్టం చేశారు.

శిలాఫలకాలు కాదు.. అభివృద్ధి పనులు కావాలి!

- హామీలు కాదు.. ఆచరణలో అభివృద్ధి చూపాలి!



కాళేశ్వరం, నవంబర్ 14 (జనంసాక్షి) : అభివృద్ధి పనుల పేరుతో హడావుడిగా శిలాఫలకాలు వేయడం, శంకుస్థాపనలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శించాయి. మంథని నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని, శిలాఫలకాలకే అభివృద్ధి పరిమితమవుతోందని బి ఆర్ ఎస్ పార్టీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం మద్దులపల్లి ఎక్స్‌రోడ్ నుంచి పలుగుల గ్రామం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించాయి. రహదారి నిర్మాణం చేపట్టడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. గత మార్చి నెలలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ రహదారి నిర్మాణానికి శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకం వేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శంకుస్థాపన సమయంలో ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న నాయకులు, ఇప్పుడు పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేస్తే సరిపోదని, ఆ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని స్పష్టం చేశారు. మద్దులపల్లి ఎక్స్‌రోడ్ నుంచి పలుగుల వరకు రహదారి సరిగ్గా లేకపోవడంతో గ్రామ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా, నిత్యం ప్రయాణించే ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రహదారి నిర్మాణాన్ని కూడా పట్టించుకో కపోవడం దురదృష్టక రమన్నారు. మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రకటనలు, శంకుస్థాపనలు చేయడం కాకుండా ఇచ్చిన హామీలను ఆచరణలో చూపించాలని డిమాండ్ చేశారు. శిలాఫలకాలు ప్రజల కష్టాలను తీర్చవని, రహదారులు నిర్మించినప్పుడే ప్రజలకు నిజమైన ప్రయోజనం కలుగుతుందని అన్నారు.ఎనిమిది నెలలుగా పనులు ప్రారంభించకుండా కాలయాపన చేయడానికి కారణం ఏమిటి? రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయా? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? పలుగుల గ్రామ ప్రజల రహదారి కలను ఎప్పుడు నెరవేరుస్తారు? అనే ప్రశ్నలకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి.ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి మద్దులపల్లి ఎక్స్‌రోడ్ నుంచి పలుగుల వరకు రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



చీఫ్ కమిషనర్‌ను కలిసిన కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (జనం సాక్షి) : సీనియర్ సిటిజన్ కమిషన్ చీఫ్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమల దేవి శనివారం హనుమకొండ కు సమీక్ష సమావేశం నిమిత్తం రాగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో వారిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

రైతుల సమస్య పై తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ పోచంపల్లి...

- పాపయ్యపేట వాగు వద్ద మోరీల పనులు ప్రారంభం



చెన్నారావుపేట, నవంబర్ 14 (జనంసాక్షి): మండలంలోని పాపయ్యపేట గ్రామ శివారులోని వాగులో నుండి రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రెండు రోజుల క్రితం నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి స్థానిక సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ తీసుకెళ్లారు. వాగు వద్ద మోరీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న ఆధ్వర్యంలో వాగుపై మోరీల నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో రైతులకు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఎదురవుతున్న రాకపోకల ఇబ్బందులు తొలగనున్నాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి చూపిన ప్రజాసేవ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ ప్రజలు తమ సమస్యను గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, మండల కోశాధికారి గుర్రం రవి, గ్రామ అధ్యక్షులు మొర్రి కట్టయ్య, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, బండి రమేష్, సుధాకర్, బర్ల యాకయ్య, ఏజిపి కొమురయ్య, మొర్రి కుమార స్వామి, శ్రీను, మారపల వీరస్వామి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 నవంబర్ 2026

దేశానికి జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివి

● డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



మహబూబ్ నగర్ అర్బన్, నవంబర్ 14 (జనం సాక్షి) : మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జవహర్ లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షులు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించారని, అనంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దూరదృష్టితో ఎన్నో సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, జాతీయ సమైక్యత వంటి విలువలకు నెహ్రూ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆశయ ఆశయాలు నేటికి దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో ముందుండాలని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా మాజీ ఎంపీ విఠల్ రావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, సాయిబాబా, ఎంఏ. కలీం, నాయకులు అజ్మత్అలీ, అవేజ్, ఫక్రు, గులాం జహీర్, తాహేర్, నర్సింహారెడ్డి, అక్బర్, గంగిరెడ్డి, అబ్రార్ హుస్సేన్, చందు యాదవ్, తిరుపతినాయక్, రాంచంద్రయ్య, అలీం, హకీమ్, మజర్ ఖాన్, నసీరుద్దీన్, నర్సింహ, జగదీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా...

● మౌలిక సదుపాయాల కల్పనకు హామీ..హైమాస్ట్ లైట్లు ప్రారంభం

● కమ్యూనిటీ హాల్..త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 14 (జనం సాక్షి) : జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని 6వ డివిజన్ ఏనుగొండ దేవునిగుట్ట జర్నలిస్టు కాలనీలో శనివారం సాయంత్రం జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం (రిజి.నం.469) నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.అనంతరం ఉత్తరాది మఠంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంబశివాలయం ఆవరణలో కాలనీవాసులు, మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.కాలనీవాసుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని,త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఆతరువాత బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, కాలనీ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు, స్థానిక కార్పొరేటర్ రామస్వామి, నాయకులు సిరాజ్ ఖాద్రి, గుమ్మడాల గోవర్ధన్‌గౌడ్, గుండా మనోహర్, మైత్రి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు గిరిజన విద్యార్థి ఎంపిక

● సబ్‌జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు రమావత్ గణేష్ అర్హత..

● అభినందించిన విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు



పి.ఏ.పల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి రమావత్ గణేష్ జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికై ప్రతిభ చాటాడు.వికారాబాద్ జిల్లాలో నవంబర్ 12 నుంచి 14 వరకు 33 జిల్లాల క్రీడాకారుల మధ్య నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో గణేష్ అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు,మండలానికి గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి దన్నె రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి,జీవన్ కుమార్,జింకల శ్రీను, గ్రామస్తులు,పాఠశాల విద్యార్థులు రమావత్ గణేష్‌ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

గోల్డెన్ అవర్‌లో సత్వర చికిత్స

● యువతి మెదడును కాపాడిన ప్రభుత్వ వైద్యులు



భద్రాచలం, నవంబరు 14 (జనంసాక్షి) : అత్యవసర వైద్య పరిస్థితుల్లో సకాలంలో స్పందిస్తే ప్రాణాలతో పాటు అవయవాల పనితీరును కూడా కాపాడవచ్చని మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల వైద్య బృందాలు నిరూపించాయి. పక్షవాతానికి గురైన మణుగూరుకు చెందిన 29 ఏళ్ల రజనికి గోల్డెన్ అవర్‌లో అత్యాధునిక వైద్యం అందించి, ఆమె కుడిచేయి, కాలి కదలికలను గణనీయంగా మెరుగుపరిచారు. రజనికి ఉదయం 10.30 గంటల సమయంలో మాట తడబడటం, కుడిచేయి, కాలు పనిచేయకపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే మణుగూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సాయికుమార్ ప్రాథమికంగా పరిశీలించి, సీటీ స్కాన్, ఐసీయూ సదుపాయాలు అందుబాటులో ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ క్రమంలో మణుగూరు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రామకృష్ణ, భద్రాచలం వైద్యురాలు డాక్టర్ తేజస్వితో ముందుగానే సంప్రదించి రోగి పరిస్థితిని వివరించారు. దీంతో భద్రాచలం వైద్య బృందం అప్రమత్తమై అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం సీటీ స్కాన్ నిర్వహించగా మెదడులో రక్తస్రావం లేదని నిర్ధారణ అయింది. వైద్యపరమైన అర్హతలను పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు రక్తపు గడ్డను కరిగించే అత్యాధునిక టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్ అందించారు. చికిత్సకు రజని శరీరం సానుకూలంగా స్పందించడంతో కుడిచేయి, కాలి కదలికలు గణనీయంగా మెరుగుపడ్డాయి. గతంలో కండరాల శక్తి 0/5 స్థాయిలో ఉండగా, చికిత్స అనంతరం 4+/5 స్థాయికి చేరింది. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతుంది. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.45 వేల విలువ చేసే ఈ ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించడం విశేషం. ఖరీదైన ఆధునిక వైద్య సేవలను సైతం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ జి. రవిబాబు రెండు ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. వైద్య బృందాల మధ్య సమన్వయం, సకాలంలో తీసుకున్న నిర్ణయాలు, సిబ్బంది అంకితభావం వల్లే మెరుగైన వైద్య ఫలితం సాధ్యమైందని పేర్కొన్నారు.

బైకును ఢీ కొట్టిన లారీ

● రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



టేకులపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : ఇల్లందు, కొత్తగూడెం జాతీయ ప్రధాన రహదారిలో బైక్ పై ప్రయాణిస్తున్న దంపతులను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో భర్త మృతి చెందగా, భార్య విషమంగా ఉన్న సంఘటన టేకులపల్లి మండలం ఆరో మైలు వద్ద రోడ్డు ప్రమాదం శనివారం జరిగింది. టేకులపల్లి ఎస్ ఐ.కె. తిరుపతి కథనం ప్రకారం లక్ష్మీదేవిపల్లి మండలం పునుగుడుచిలక గ్రామం నుండి పడగ జగన్ (45), భార్య లలిత (38) దంపతులు ఇరువురు బైక్‌పై బయ్యారం మండలం లోని నర్సాపురం గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఇల్లందువైపు నుండి వస్తున్న లారీ ఆరో మైలు తండ సమీపాన ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. జగన్ తీవ్రంగా గాయపడి మృతి చెందగా, ఆయన భార్య లలిత తీవ్ర గాయాలపాలైంది.ప్రమాద సమాచారం అందుకున్న టేకులపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సునీతాదేవి (ఈఎంటీ), పైలట్ కె. వెంకటరామారావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని ఇల్లందు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. జగన్ కుడివైపు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు.లలిత తలకు బలమైన గాయం కావడం తో అధిక రక్తస్రావమైంది. అంతే కాకుండా ఎడమ తొడ ఎముక విరిగింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.భర్త మృతిచెందడం, భార్య ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో ఈ ఘటన స్థానికులను కలచివేసింది.ప్రమాద స్థలంలో లభించిన మొబైల్ ఫోన్, పర్సును 108 సిబ్బంది టేకులపల్లి ఎస్ఐ. కె. తిరుపతికి అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహన క్యాబిన్‌లో రూ.7 వేలు నగదు బ్యాగు చోరీ

● సాంకేతిక పరిజ్ఞానంతో కేసును చేదించిన పోలీసులు



హుజూర్‌నగర్, నవంబర్ 14 (జనంసాక్షి) : నేరేడుచర్ల పట్టణంలోని గాంధీ చికెన్ సెంటర్‌కు చెందిన బొలెరో వాహనంలో ఉంచిన నగదు బ్యాగును చోరీ చేసిన ఘటనలో నిందితుడిని నేరేడుచర్ల పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13వ తేదీ సుమారు ఉదయం 6 గంటల సమయంలో నేరేడుచర్ల పట్టణానికి చెందిన ధరావత్ సైదా జాన్ పహాడ్ రోడ్డులోని గాంధీ చికెన్ సెంటర్ ఎదురుగా తనకు సంబంధించిన బొలెరో వాహనంలో రూ.7 వేల నగదు గల బ్యాగును ఉంచాడు. డ్రైవర్,సిబ్బంది కోళ్లను దించుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వాహనం క్యాబిన్‌లో ఉన్న నగదు గల బ్యాగును అపహరించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న నేరేడుచర్ల ఎస్ఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన చింతలచెరువు తిరుపతయ్య (46) ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. శనివారం ఉదయం అతని గ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన నగదులో రూ.5 వేలు రికవరీ చేశారు.అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు హుజూర్‌నగర్ సిఐ గజ్జె. చరమంద రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, కానిస్టేబుళ్లు శంభయ్య , నాగరాజు లు ఉన్నారు.

విద్య ద్వారానే నిజమైన వ్యక్తి నిర్మాణం

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, నవంబర్ 14 (జనంసాక్షి) : విద్య ద్వారానే నిజమైన వ్యక్తి నిర్మాణం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్య ద్వారానే మనిషిలో జ్ఞానం పెరుగుతుందని, ఆలోచనలు వస్తాయని, వ్యక్తి నిర్మాణం జరుగుతుందని అన్నారు.గ్రంథాలయాలలో పుస్తకాలు చదవడం ద్వారా ప్రపంచం గురించి తెలుస్తుందని పేర్కొన్నారు. విద్య ద్వారానే నూతన ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. చదువుకున్న వారికి సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని చెప్పారు.సూర్యాపేట జిల్లాలో గ్రంథాలయాలకు నూతన భవనాల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ హరిసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కార్యదర్శి రాంచందర్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు

● ప్రారంభించిన సీనియర్ సివిల్ జడ్జి కే.అనిత



దేవరకొండ, నవంబర్ 14 (జనం సాక్షి) : దేవరకొండ మండలం గిరిజానగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి గురుకులాల క్రీడా పోటీలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి కే. అనిత ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని, చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గురుకుల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఉమామహేశ్వర్, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్,ఎస్ఐ సాలకమ్మ, పి ఈ టీ రమేష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ హాస్టల్ నుంచి పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

● విద్యార్థుల భద్రతపై సిబ్బంది నిర్లక్ష్యం

● ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం



సిర్గాపూర్, నవంబర్ 14 (జనం సాక్షి) : సిర్గాపూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కనిపించకపోవడం కలకలం రేపింది. విద్యార్థిని అదృశ్యమైన ఘటనతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థుల భద్రతను పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది ఏం చేస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గేటు వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడం, రాత్రి వేళల్లో విద్యార్థుల కదలికలను పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని ఆచూకీ కనుగొనేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

జయంత్ అండ్ ది జింగో పెన్ చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ

● పిల్లల మనస్తత్వం తల్లిదండ్రుల బాధ్యతను చాటే చిత్రం



సూర్యాపేట, నవంబర్ 14 (జనంసాక్షి) : పిల్లల మనస్తత్వం, చదువుల ఒత్తిడి,తల్లిదండ్రులు ఉపాధ్యాయుల బాధ్యతలను ప్రతిబింబిస్తూ రూపొందిన తెలుగు చిత్రం జయంత్ అండ్ ది జింగో పెన్ బాలల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.ఈ సందర్భంగా సూర్యాపేటలో ప్రదర్శించబడిన చిత్రాన్ని చూసి ప్రేక్షకులు, జయంత్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ చదువులో భాగంగా గణితం హోంవర్క్ చేయడం, కఠినంగా వ్యవహరించే ఉపాధ్యాయుడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించే జయంత్ అనే అల్లరి బాలుడి చుట్టూ కథ సాగుతుందన్నారు.ఈ క్రమంలో అతని తాత పరిచయం చేసిన పురాతనమైన మాయా పెన్ జింగో పెన్ కథలో ఆసక్తికరమైన మలుపులకు కారణమవుతుందన్నారు. నవ్వులు, భావోద్వేగాలు, అద్భుతమైన అనుభవాల మధ్య పిల్లల ఆలోచనలు, వారి ప్రతిభను గుర్తించే ప్రయాణంగా ఈ చిత్రం తెరకెక్కిందని తెలిపారు.ప్రస్తుత విద్యావ్యవస్థలో మార్కులు, ర్యాంకుల కోసం పిల్లలపై పెరుగుతున్న ఒత్తిడిని ఈ సినిమా ప్రధానంగా చర్చిస్తుందని పేర్కొన్నారు.పిల్లలు సాధించే మార్కుల కంటే వారి మనసులను అర్థం చేసుకోవడం ముఖ్యమనే సందేశాన్ని అందిస్తుందన్నారు. ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని చాటిచెప్పే ప్రయత్నం చేశారని తెలిపారు. నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మించిన ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన దర్శకత్వం వహించారు.మాస్టర్ జయంత్ బొలిశెట్టి ప్రధాన పాత్రలో నటించగా, ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు మారం లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పులుసు వెంకటేశ్వర్లు, పగడాల ఉపేందర్ రెడ్డి, కొండ సంతోష్, ఖమ్మంపాటి భిక్షపతి, పట్టణ పెరిక సంఘం అధ్యక్షులు పత్తిపాక వేణుధర్, సీనియర్ నాయకులు బొలిశెట్టి మధు, బాల్తు శ్రీనివాస్, దొంగరి నాగేశ్వరరావు, పోతురాజు నర్సయ్య, సంద్యాల వినోద్, బందు వీరయ్య, సోమిశెట్టి లింగయ్య, బెక్కం వెంకటేశ్వర్లు, పత్తిపాక వెంకటేశ్వర్లు, పత్తిపాక రాధాకృష్ణ, బుస్సా వీరయ్య, నెమ్మని నాగేశ్వరావు, బాసాని వెంకన్న, నెమ్మని వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి ఉసేందర్, నట్టె కిరణ్, దేవరగట్ల సతీష్, నట్టె కోటేశ్వరరావు, మార్త వెంకటేశ్వర్లు, పత్తిపాక వీరమ్మ, బందు మమత, సౌమ్య, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ అబ్యూజ్ వీడియోలు చూస్తే కఠిన చర్యలు

● సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కేసులు నమోదు

● చిన్నారుల భద్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

● నవాబ్ పేట్ ఎస్సై గిరి



నవాబుపేట్, నవంబర్ 14 (జనం సాక్షి) : చైల్డ్ అబ్యూస్ వీడియోలు చూసినా,సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని నవాబ్ పేట్ ఎస్సై గిరి హెచ్చరించారు.చిన్నారుల భద్రత, గౌరవానికి భంగం కలిగించే వీడియోలను ఎవరూ సృష్టించవద్దని, వీక్షించవద్దని, ఇతరులకు పంపవద్దని సూచించారు.ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఆకర్షణీయమైన లింకులు, వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి వీడియోలను ఫార్వర్డ్ చేయడం కూడా చట్టపరమైన చిక్కులకు దారితీస్తుందని హెచ్చరించారు.చిన్నారులకు సంబంధించిన అసభ్యకర దృశ్యాలు ఎక్కడైనా కనిపిస్తే వాటిని డౌన్‌లోడ్ చేయకుండా, ఇతరులకు పంపకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గిరి హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15.11.2026



భార్య చనిపోయిందని చెప్పి
ఆస్తి కాజేసిన భర్త

- రూ.15 లక్షలకు 267 గజాల స్థలం విక్రయం
- నిందితుడు రవిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఆర్మూర్,నవంబర్ 14 (జనంసాక్షి):భార్య బతికుండగానే చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి,ఆమె పేరు మీద ఉన్న 267 గజాల స్థలాన్ని అక్రమంగా బదిలీ చేసిన ఘటన ఆర్మూర్‌లో వెలుగుచూసింది.ఆర్మూర్ పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.వారు తెలిపిన వివరాల ప్రకారం..పెర్కిట్‌కు చెందిన దేశాయిపేట రవికి 2017లో గీతాంజలితో వివాహం కాగా, వీరికి మోక్షిత్ అనే కుమారుడు ఉన్నాడు.కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య వేరుగా ఉంటుండగా, కోటర్మూర్‌లోని సర్వే నంబర్లు 212/అ,212/ఆలో ఉన్న ప్లాట్ నంబర్ 4ను భార్య మరణించినట్లు నకిలీ పత్రాలు సృష్టించి,తన తల్లి లక్ష్మీబాయి పేరు మీద 2025లో గిఫ్ట్ డీడ్ చేయించాడు.అనంతరం ఆ స్థలాన్ని మరో వ్యక్తికి రూ.15 లక్షలకు విక్రయించాడు.అంతేకాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ పొందేందుకు కూడా నకిలీ పత్రాలు సిద్ధం చేశాడు.ఈ వ్యవహారంలో నిందితుడు రవిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

పట్టా భూమిలో రోడ్డు నిర్మాణానికి యత్నం

బాధితుల ఆవేదన



ఆర్మూర్,నవంబర్ 14(జనంసాక్షి):
ఆర్మూర్ డివిజన్ పరిధిలోని మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో తమ పట్టా భూమిలో నుంచి రోడ్డు వేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని సోమ గంగవ్వసోమ అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం ఆర్మూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 140/2/ఏలో తమకు 10 గుంటల భూమి ఉందని, గ్రామపంచాయతీ కూడా తమకు అనుకూలంగా తీర్మానం చేసిందని తెలిపారు.తమ స్థలం నుంచి రోడ్డు కావాలని కేతడి చిన్న రాజన్న, కేతడి పెద్ద రాజన్న, పడిగల సాయరెడ్డి, లింగారెడ్డిలు అనేక నెలల నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.అతి చొరవతో ఎంపీడీవో లక్ష్మణ్,ఎంపీఓ భరత్ చంద్ర,తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జేసీబీతో భూమిలోని రాళ్లను తొలగించారని ఆరోపించారు.సుమారు రూ.15 లక్షల విలువైన 150 గజాల భూమి రోడ్డు నిర్మాణంలో పోతుందని ఆవేదన చెందారు.అధికారులు ఏకపక్షంగా వ్యవహరించకుండా జిల్లా కలెక్టర్,డీపీఓ జోక్యం చేసుకుని విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సోమ పెద్ద శ్రీనివాస్,సోమ రాజన్న,సోమ నడిపి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రాహుల్ గాంధీ కించపరుస్తున్నారు : ఈటల రాజేందర్



హైదరాబాద్: ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు వ్యవస్థల్ని అపహాస్యం చేసేలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. భారతదేశం అతిగొప్ప ప్రజాస్వామిక దేశమని నెహ్రూ నుంచి నేటి వరకు చెబుతున్నారని, కానీ, రాహుల్ మాత్రం ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ.. నియంతృత్వ దేశమని ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదే ఈసీ వ్యవస్థ, ఇదే సుప్రీం కోర్టు ఆనాటి నుంచి ఉందని గుర్తించాలన్నారు. చివరికి సైనికులను కూడా రాహుల్ కించపరుస్తున్నారని అన్నారు. ఎక్కడా స్కామ్‌లు, అవినీతి లేకుండా దేశం గర్వించేలా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు.

వివాదాస్పద భూమిలో పంచాయతీ అనుమతుల మర్మమేమిటి?

- వివాదాస్పద భూమిలో పంచాయతీ అనుమతుల మర్మమేమిటి?
- మన్సాన్‌పల్లి 189 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాల కలకలం
- రెండు రోజుల్లోనే అనుమతుల మంజూరు
- ఎంపీఓ హెచ్చరికలు బేఖాతర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మనసాన్‌పల్లి 189 సర్వే నెంబర్ లోని వివాదాస్పద భూమిలో పంచాయతీ అనుమతుల అనుమతుల మర్మమేమిటనీ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల హెచ్చరికలు బేఖాతర్.. నిబంధనలు గాలికి.. అన్నట్లుగా మన్సాన్‌పల్లి గ్రామంలో నిర్మాణాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలోని 189 సర్వే నంబర్‌లో నిర్మాణాలకు సంబంధించి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ యాదగిరి హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలు చేసిన రెండు రోజుల వ్యవధిలోనే పంచాయతీ అనుమతులు జారీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది.వివాదాస్పద భూమిలో నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరయ్యాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. 189 సర్వే నంబర్ భూమికి సంబంధించి 22-ఏ జాబితా, ప్రభుత్వ భూమి, నిషేధిత భూముల జాబితా, న్యాయస్థానాల్లో ఉన్న కేసుల అంశాలు పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ అనుమతుల కోసం సమర్పించిన దరఖాస్తులు, భూమి హక్కులకు సంబంధించిన పత్రాలు, రెవెన్యూ రికార్డులు, ఇతర శాఖల అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించారా? లేదా అన్నది తేలాల్సి ఉంది.

హెచ్చరికలిచ్చిన అధికారులకే తెలియదా?

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎంపీఓ.. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ఏమంటారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవలం రెండు రోజుల్లోనే అనుమతుల ప్రక్రియ పూర్తయిందా? పంచాయతీ కార్యదర్శి ఏయే పత్రాలను ప్రాతిపదికగా తీసుకొని అనుమతులు మంజూరు చేశారు? భూమి వివాదాస్పదమనే అంశాన్ని పరిశీలించారా? అన్న విషయాలపై అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లా స్థాయి విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై జిల్లా పంచాయతీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతుల మంజూరు వెనుక ఉన్న పత్రాలు, రెవెన్యూ రికార్డులు, న్యాయపరమైన అంశాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. హెచ్చరికలు ఒకవైపు.. అనుమతులు మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం

రైస్ మిల్ యజమాని అరెస్ట్



వీణవంక, నవంబర్ 14 (జనంసాక్షి):
పేదలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న రైస్ మిల్ యజమానిని వీణవంక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని కోర్కల్ గ్రామంలో ఈ నెల 5న వాసవి ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఈటీఎఫ్ హైదరాబాద్ అధికారులు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ-09-టీఏ-9411 నంబరు గల అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 23.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.విచారణలో వాహన డ్రైవర్ కుర్ర తిరుపతి (ఏ-1) వివిధ గ్రామాల నుంచి కిలో రూ.20 చొప్పున పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కోర్కల్ గ్రామానికి చెందిన వాసవి రైస్ మిల్ యజమాని నార్ల వెంకటేశ్వర్లు (ఏ-2)కు కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. వెంకటేశ్వర్లు ఆ బియ్యాన్ని కోళ్ల ఫారాలకు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో నిందితుడైన నార్ల వెంకటేశ్వర్లును ఈ నెల 13న వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, గతంలోనూ ప్రభుత్వానికి చెందిన 12,914.83 క్వింటాళ్ల ధాన్యం దుర్వినియోగం, మోసం, నిత్యావసర వస్తువుల చట్ట ఉల్లంఘనకు సంబంధించి రూ.4,16,83,097 విలువైన కేసులో వెంకటేశ్వర్లు నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వరుసగా ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రస్తుత కేసులో అతడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరించారు.

మానవత్వం చాటిన రెంజల్ సర్పంచుల ఫోరం

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి సర్పంచ్‌కు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 14 (జనంసాక్షి) :హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న తమ తోటి సర్పంచ్, కిసాన్ తండా గ్రామ సర్పంచ్ విజయ్ ని రెంజల్ మండల సర్పంచుల ఫోరం సభ్యులు పరామర్శించారు.వైద్య ఖర్చులు అధికంగా అవుతున్న నేపథ్యంలో రెంజల్ మండల సర్పంచుల ఫోరం తరపున విజయ్ కుటుంబానికి రూ.1,50,000 ఆర్థిక సహాయంగా అందజే యడం జరిగింది. వారి కుటుంబానికి భవిష్యత్తులో కూడా ఎలాంటి సహాయం అవసరమైనా తమ వంతు సహకారం అందిస్తామని సర్పంచులు హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా సర్పంచుల ఫోరం సభ్యుల తో రేపు మాట్లాడి, వారి తరపున కూడా మరింత ఆర్థిక సహా యం అందించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా విజయ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరో గ్యంతో తిరిగి రావాలని అందరం కలిసి భగవంతుడిని ప్రార్థించారు. కష్టకాలంలో తోటి సర్పంచ్ కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.



పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

- నూతన పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ
- 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- నిరుపేదలకు అండగా రేవంత్ సర్కార్



పెద్దపల్లి,నవంబర్ 14(జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 768 మందితో పాటు మండలానికి చెందిన 1114 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి 5,124 నూతన పింఛన్లు మంజూరు కాగా 19న ఇందిరా గాంధీ జయంతిన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతాయని పేర్కొన్నారు. పెద్దపల్లి మున్సిపల్ కి చెందిన 768 నూతన పెన్షన్ లబ్ధిదారులకు,పెద్దపల్లి మండలానికి చెందిన 1114 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు,మహిళలు, చేనేత,గీత తదితర వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 11 వేల పైచిలుకు పింఛన్లు రాగా, అందులో 48 శాతం 5,124 ఒక్క పెద్దపల్లి నియోజకవర్గానికే దక్కడం విశేష మన్నారు.అర్హత ఉండి కేవలం 2 నుండి 3 శాతం మందికి చిన్న చిన్న సాంకేతిక కారణాలతో పింఛన్లు రాకుండా పోయాయని, అటువంటి వారు ఆందోళన చెందవద్దని కోరారు. లోపాలను సరిదిద్ది భవిష్యత్తులో పింఛన్ ఇప్పిస్తానన్నారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు ఏప్రిల్ నుంచి కొత్త ప్రక్రియ ప్రారంభించి, 34 నెలల వ్యవధిలో అర్హులకు పింఛన్లు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి మొదటి విడతలో మంజూరైన 3500 ఇందిరమ్మ ఇండ్లలో దాదాపు 2700 మంది పేద ప్రజలు ఇప్పటికే ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారని, ఇచ్చిన మాట ప్రకారం పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, కుమార స్వామి,తహసీల్దార్, రాజయ్య,మున్సిపల్ చైర్మన్,నూగిళ్ల మల్లయ్య వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,మార్కెట్ చైర్మన్ ముత్యాల నరేష్,మున్సిపల్ కమిషనర్, ఆకుల వెంకటేష్,సింగిల్ విండో చైర్మన్లు,డైరెక్టర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు,ఉపసర్పంచ్లు మరియు ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,యూత్ నాయకులు ,కార్యకర్తలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కార్యక్రమాలు

పెద్దపల్లి,నవంబర్ 14(జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ ఎస్ ఇ టి ఐ), పెద్దపల్లి ఆధ్వర్యంలో రాబోయే మూడు నెలల్లో ఐదు రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు,మహిళలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చని డైరెక్టర్ తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు యూనియన్ పెద్దపల్లి కార్యాలయాన్ని సంప్రదించి శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు దరఖాస్తు విధానం తెలుసుకోవాలని సూచించారు.అభ్యర్థుల వయస్సు 18 నుండి 49 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

అల్లం బుచ్చమ్మ కుటుంబానికి సాహితీవేత్తల పరామర్శ

మంథని (జనంసాక్షి):
ఇటీవల మృతి చెందిన అల్లం బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు శనివారం మంథని మండలం గాజులపల్లిలో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుచ్చమ్మ కుమారులు అల్లం రాజయ్య, అల్లం వీరయ్యతో పాటు ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణను. కూతురు కుదిరే లక్ష్మి లను కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం అల్లం బుచ్చమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు ఏలేశ్వరం వెంకటేశం, పుట్ట రాజన్న, మందల రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





నిరుద్యోగ మహిళలకు భరోసా

- ఈ నెల 22న పెద్దపల్లిలో 'మెగా జాబ్ మేళా'మహిళలు
- ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష

పెద్దపల్లి,నవంబర్ 14(జనంసాక్షి) : నిరుద్యోగ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి,వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 22న పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ సిందూర ఐటీఐ కాలేజీ క్యాంపస్‌లో భారీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష వెల్లడించారు.సురక్ష మ్యాన్‌పవర్ సర్వీసెస్,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్ మేళాకు తాను ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ హైదరాబాద్ కొంగరకలాన్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలలో వేలాది ఉద్యోగ అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.18 నుండి 45 సంవత్సరాల వయసు కలిగి ఎస్ఎస్సీ,ఇంటర్మీడియట్, ఐటీఐ,డిప్లొమా, డిగ్రీ,బీటెక్ పూర్తి చేసిన తెలంగాణ ఆడబిడ్డలందరూ ఈ జాబ్ మేళాకు అర్హులని వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.21,851 గ్రాస్ జీతం ఈఎస్ఐ, పీఎఫ్ మినహాయింపుల తర్వాత చేతికి వచ్చే నికర వేతనం రూ.17,650 చెల్లించడంతో పాటు హైదరాబాద్‌లో ఎక్కడి నుండైనా ఉచిత ఏసీ బస్సు సౌకర్యం,పూర్తి భద్రత, మధ్యాహ్నం మరియు రాత్రి రెండు పూటలా ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలు బృందాలుగా తరలివచ్చి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దాసరి ఉష పిలుపునిచ్చారు.ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య 9240954734 నంబర్‌కు ఫోన్ చేసి లేదా పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

లారీ ఢీ కొని యువకుడి మృతి



పెద్దపల్లి,నవంబర్ 14(జనంసాక్షి) :
పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో లారీని వెనకకు తీసే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిద్ద అనిల్(26) యువకుడిని లారీ ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తల్లి గట్టమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ రాజశేఖర్ తెలిపారు.మృతుడు లారీ డ్రైవర్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.

స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన గడ్డం లక్ష్మణ్

కరీంనగర్ లీగల్(జనంసాక్షి):



స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఎన్నికల్లో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ నుంచి ఈ ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి పదవికి తొలిసారిగా ఎన్నిక కావడం విశేషం.ఈ ఎన్నికల్లో ఫెడరేషన్ అధ్యక్షులుగా విప్లవ్ రెడ్డి ఎన్నిక కాగా, జాయింట్ సెక్రటరీలుగా కరీంనగర్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ మదన్ బాబు, వైస్ ప్రెసిడెంట్ బొడ్ల గీతా రాణి, జాయింట్ సెక్రటరీ సుంకె దేవకిషన్, సీనియర్ న్యాయ వాదులు పూరెల్లి రాములు, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, గౌరు రాజిరెడ్డి, కనుకల సం జీవరెడ్డి, టి. వేణుగోపాల్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ఫెడరేషన్‌లో కరీంనగర్ బార్ అసోసియేషన్‌కు కీలక ప్రాతినిధ్యం లభించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సంక్షేమం, వారి వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

న్యాయవాద పరిషత్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పెద్దపల్లి,నవంబర్ 14(జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా న్యాయవాద పరిషత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోదావరిఖనిలోని వి.హెచ్.పి. భవన్‌లో నిర్వహించిన సమావేశాల్లో జిల్లాలోని ఆరు బార్ అసోసియేషన్లకు చెందిన వంద మందికిపైగా న్యాయవాదులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి సంసాని సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా, రాష్ట్ర కార్యదర్శులు కొత్తకాపు సుధాకర్‌రెడ్డి, రాగిణి బతుల పాల్గొన్నారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆరె మధు (గోదావరిఖని), ప్రధాన కార్యదర్శిగా రాచూరి శ్రీకాంత్ (పెద్దపల్లి),కోశాధికారిగా గుడ్ల వెంకటేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.శిరీష (పెద్దపల్లి), కుడిది వెంకటేష్, రాగం శ్రీధర్, జి.భూమయ్య (గోదావరిఖని), కార్యదర్శులుగా ఎస్.అశోక్,పి.రాము, రాజు కార్తీక్, పులిపాక ప్రవీణ్, రామ్ టెంకి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఆఫీస్ కార్యదర్శిగా గడ్డి సాధన (పెద్దపల్లి), స్టడీ సర్కిల్ కార్యదర్శిగా ఎస్.లావణ్య (గోదావరిఖని), కార్యవర్గ సభ్యుడిగా బర్ల రమేష్ ఎన్నికయ్యారు.న్యాయవాదుల ఐక్యతను పెంపొందించడం,పరిషత్ కార్యక్రమాలను విస్తృతం చేయడం,పేదలకు ఉచిత న్యాయసాయం అందించడం తమ లక్ష్యమని నూతన కమిటీ బాధ్యులు తెలిపారు.ఎన్నికైన వారికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.





రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్ల ఎంపిక

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి:
71వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలుర, బాలికల పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్ల ఎంపికలు శనివారం జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రావణ్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వవైభవం తీసుకురావడానికి జిల్లా సంఘం కృషి చేస్తోందని, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు హనుమకొండ జిల్లా కమలాపూర్ హైస్కూల్‌లో నిర్వహించనున్న 71వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలుర, బాలికల పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సంఘం కార్యవర్గ సభ్యులు భాగ్యశ్రీ, షామేందర్, కార్తీక్, వ్యాయామ ఉపాధ్యాయులు నవీన, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు.. రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు!

- సుల్తానాబాద్ మండలంలో 755 కొత్త పింఛన్లు మంజూరు
- మున్సిపాలిటీలో 286 మందికి లబ్ధి
- మార్చి నాటికి వృద్ధాప్య పింఛన్లు
- ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం: ప్రభుత్వ విప్ విజయ రమణారావు



సుల్తానాబాద్, నవంబర్ 14 (జనంసాక్షి): పెద్దపల్లి నియోజకవర్గం లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు. పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చే మార్చి నాటికి వృద్ధాప్య పింఛన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. శనివారం సుల్తానాబాద్‌లోని ఎస్‌వీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుల్తానాబాద్ మండల పరిధిలో 755, మున్సిపాలిటీ పరిధిలో 286 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. సాంకేతిక కారణాలతో పింఛన్లు మంజూరు కానివారు సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను సరిచేసుకోవాలని సూచించారు. పింఛన్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని విమర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇప్పటికే మండలవ్యాప్తంగా 950 ఇళ్లు మంజూరు చేశామని, మరో రెండు విడతల్లో అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వాట్సాప్‌లో ఇందిరమ్మ ఇళ్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. మిగిలిన హామీలను మరో రెండేళ్లలో నెరవేరుస్తామని ప్రకటించారు. తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదలకు ప్రయోజనం కల్పిస్తున్నామని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చూస్తున్నామని తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నెహ్రూ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి విజయ రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీ యమ ని, ఆయన హయాంలోనే భారీ ప్రాజెక్టులు, ఆధునిక వైద్య సంస్థల నిర్మాణానికి పునాదులు పడ్డాయని పేర్కొన్నారు.

ఆయన ఆశయా లకు అనుగుణంగా దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, డీఆర్‌డీఓ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాట్నపల్లి సర్పంచ్ ఓగుల పూజా రాజేందర్, నీరుకుళ్ల సర్పంచ్ కాంపల్లి సతీష్‌కుమార్ కూడా విప్‌తో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు పంపిణీ చేశారు. నెహ్రూ జయంతి కార్యక్రమంలో మున్సిపల్, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత ఏదీ?

- అర్హులకు అన్యాయం జరిగిందంటూ గ్రామసభలో నిలదీత
- తెల్ల కాగితాలపై కమిటీ సభ్యుల సంతకాలు తీసుకున్నారా?
- వీడియో ఆధారాలతో ప్రజావాణిలో ఫిర్యాదుకు గ్రామస్తుల నిర్ణయం

సదాశివనగర్, నవంబర్ 14 (జనంసాక్షి): సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించిందని, అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామసభలో సర్పంచ్, పాలకవర్గం, కమిటీ సభ్యులను నిలదీసి ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత అక్టోబర్ 2న జరిగిన గ్రామసభలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 16న ఎంపీడీవో కార్యాలయంలో, అక్టోబర్ 30న జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయి విచారణ జరగలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరి పేర్లు ఎంపిక చేశారనే ప్రచారంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల అర్హతలను పరిశీలించారా? కమిటీ ఆమోదానికి ప్రాతిపదిక ఏమిటి? సభ్యుల సంతకాల కోసం తెల్ల కాగితాలు పంపించారా? అంటూ ప్రశ్నించారు. గ్రామ కార్యదర్శి ఎంపిక ప్రక్రియకు సంబంధించి వెల్లడించిన వివరాలను వీడియోలో రికార్డు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కమిటీ సభ్యుల సంతకాల వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరారు.

హయత్‌నగర్ ఓల్డ్ గ్రామంలో రూ.కోటితో
సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



హయత్‌నగర్, (జనంసాక్షి) : హయత్‌నగర్ ఓల్డ్ గ్రామ ప్రజల చిరకాల సమస్య పరిష్కార దిశగా ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని బొడ్రాయి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) వరకు సుమారు రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ హయత్‌నగర్ ఓల్డ్ గ్రామంలో రహదారి సమస్యను పరిష్కరించేందుకు రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో హయత్‌నగర్ డివిజన్‌తో పాటు హైకోర్టు కాలనీ, లెక్చరర్స్ కాలనీ తదితర పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్య లు, అభివృద్ధి పనులకు సంబంధించిన అవసరాలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ హయత్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ గజ్జి భాస్కర్‌యాదవ్ పేర్కొన్నారు.

సిఎంసి పరిధిలో రెండో రోజు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం
76 వార్డుల్లో విస్తృతంగా పారిశుధ్య పనులు



శేరిలింగంపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం(శానిటేషన్ స్పెషల్ డ్రైవ్)లో భాగంగా రెండో రోజు శనివారం పారిశుధ్య సేవలు సరిగ్గా అందరి పలు ప్రాంతాలలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ను ప్రత్యేకంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా జోన్ల పరిధిలో మొత్తం 76 వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 179 చెత్త పేరుకుపోయే ప్రాంతాలు(గార్బేజ్ వల్లరబుల్ పాయింట్స్) ను ఏకధాటిగా కొనసాగించి పూర్తిగా శుభ్రం చేశారు. ఈ క్రమంలో 147.5 చదరపు కిలోమీటర్ల రోడ్డు మార్గాలు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహించినట్లు సిఎంసి అధికారులు తెలియజేశారు. 64 ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించి శుభ్రపరిచే పనులు నిర్వహించారు. ఈ పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 161 వాహన ట్రిప్పుల ద్వారా సుమారు 197.88 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించారు. అక్కడక్కడ రోడ్లపై మరియు నిర్లక్ష్యంగా నిలిపించిన అదనపు వాహనాలను, నిరుపయోగంగా వదిలివేయబడిన వాహనాలకు సంబంధించి సంబంధిత అధికారులు 64 నోటీసులను జారీ చేయడం జరిగిందని ఆయా సర్కిల్ అధికారులు సిఎంసి కార్యాలయానికి నివేదించారు. ప్రధానంగా రెగ్యులర్ సర్వీసులు అందని ప్రాంతాలుగా గుర్తించిన మురికివాడలు, ఇతర ప్రాంతాలలో పారిశుధ్య సేవలు సక్రమంగా అందని, పరిమితంగా అందుతున్న మరియు నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలతో పాటు కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీలు, విస్తరించిన లేఅవుట్లపై ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వాటిపై ప్రత్యేక దృష్టిని సారించారు.

ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య లోపాలను గుర్తించి పరిష్కరించడం తో పాటు, నిరంతర పారిశుధ్య సేవలు అందించడానికి తగిన చర్యలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. సైబరాబాద్ పరిధిలోని అన్ని వార్డుల్లో సమగ్ర పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తిగా నిర్మూలించడం, ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో కూడిన కృషి మరియు స్థానిక ప్రజల భాగస్వామ్యంతో సైబరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సిఎంసి నిరంతరం ముందుకు సాగుతుందని సిఎంసి ఉన్నతాధికారులు మీడియాకు వివరించారు.

మోమిన్ పేట ఎస్ఐ భరత్ భూషణ్‌పై కేసు

- ఒక మహిళ వ్యాపారి వ్యక్తిగత సమాచారాన్ని గ్యాంగ్ స్టర్లకు అందించారనే ఫిర్యాదు పై కేసు
- ఎస్ఐతో పాటు మరో ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు
- ఎస్ఐ పనితీరుపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్న సిసిఎస్ పోలీసులు



వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 14 (జనం సాక్షి): క్రమశిక్షణ కలిగిన శాఖ లో ఉద్యోగం చేస్తూ నిందితులకు సహకరించాడు. ఒక్కరి వ్యక్తిగత సమాచారాన్ని నిందితులకు చేరవేసి సొమ్ము చేసుకున్నాడు. మహిళా వ్యాపారవేత ప్రాణాలకు ముప్పు పొంచే విధంగా సాంకేతిక సమాచారాన్ని నిందితుల చేతిలో పెట్టాడు. ప్రజలకు విశ్వాసం కలిగించే పోలీస్ శాఖకు మాయని మచ్చగా తయారయ్యాడు. వైట్ కలర్ నాయకులకే కాకుండా పోలీస్ అధికారులు కొందరు కరడుగట్టిన నేరస్తులకు ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని ఈ సంఘటనతో రుసువైంది. ఇంకేముంది సిసిఎస్ పోలీసులు అయ్యగారి అవినీతి గుట్టు రట్టు చేశారు. నేర తీవ్రతను బట్టి ఎస్ఐ తోపాటు మరో ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా మోమిన్ పేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ భరత్ భూషణ్ బంజారాహిల్స్‌కు చెందిన ఒక మహిళ వ్యాపారవేత వ్యక్తిగత సమాచారం ఆమె కదలికలు ఆమె ఫోన్ టాపింగ్ చేసి నిందితులకు చేరవేశారనే ఫిర్యాదు పై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు ఎస్సై పై కేసు నమోదు చేశారు. ఎస్సై తోపాటు మరో ఐదుగురు నిందితులు బండి రాఘవేంద్ర బంగ్లా రామానుజ పోశాల శోభన్ హరి ప్రసాద్ అర్జున్ లపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంజారాహిల్స్‌కు చెందిన మహిళ వ్యాపారవేతనం ఈ నిందితుల ముఠా డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడ్డారు. ఆమె వీరి బెదిరింపులను బేకాతర్ చేయడంతో నిందితులు మోమిన్ పేట ఎస్సై భరత్ భూషణ్‌తో మిలాఖత్ అయ్యారు. మహిళ వ్యాపారవేత వ్యక్తిగత సమాచారాన్ని కదలికను తమకు అందించాలని ఇరువురి మధ్య అంగీకారం కుదిరింది. ఎస్సై భరత్ భూషణ్ నిందితులనుంచి భారీగా ముడుపులు తీసుకొని నిబంధనలు అతిక్రమించి మహిళ వ్యాపారవేత కదలికలు సమాచారం లొకేషన్ నిందితులకు అందజేశారు. దీంతో నిందితులు మరింత రెచ్చిపోయి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై మహిళ వ్యాపారవేత సిసిఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక సమాచారాన్ని సేకరించిన సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై పనితీరుపై మరింత లోతుగా దర్యాప్తు జరుగుతుంది. ఎస్సై పనితీరు పట్ల ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. దర్యాప్తు పూర్తి అనంతరం ఎస్సై భరత్ భూషణ్ పై వేటు పడే అవకాశం ఉందని చర్చ జరుగుతుంది. క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిందితులకు సమాచారం ఇస్తూ వారికి పూర్తిగా సహకరించిన ఎస్సైగా వెలుగులోకి రావడంతో ఈ విషయం సంచలనంగా మారింది. ఇక పోలీస్ శాఖ బాధ్యుడైన ఎస్సై పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

ఆటోలో వ్యక్తి మృతదేహం.. ఎస్ఆర్ నగర్‌లో కలకలం
ఐపీఎస్ క్వార్టర్స్ లైన్‌లో ఘటన.. ఓటర్ ఐడీతో మృతుడి గుర్తింపు

అమీర్‌పేట, నవంబర్ 14 (జనం సాక్షి): ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో వెనుక సీటులో ఓ వ్యక్తి మృతదేహం లభించడం కలకలం రేపింది. ఉమేష్ చంద్ర స్టాచ్ సమీపంలోని ఐపీఎస్ క్వార్టర్స్ లైన్‌లో ు+ 05 ు 8037 నంబరు గల ఆటోలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శనివారం 100కు సమాచారం అందింది. దీంతో ఎస్ఆర్ నగర్ డీఐ, ఎస్ఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆటో వెనుక సీటులో ఉన్న మృతదేహంపై ఎలాంటి గాయాలు కనిపించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఓటర్ ఐడీ ఆధారంగా ఉడుత శంకర్‌గౌడ్ (35), తండ్రి జంగయ్యగా గుర్తించారు. ఆయన రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందినవాడని, ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా!

- నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
- 18-59 ఏళ్ల మధ్య వయసున్న కుటుంబ సంపాదనపరుడికి అవకాశం
- నేటి నుంచి 18 వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం
- జగిత్యాల జిల్లాలో 2.83 లక్షల కుటుంబాలకు ప్రయోజనం



జగిత్యాల బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి): కుటుంబ పెద్దను కోల్పోయిన పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ప్రవేశపెడుతోంది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబంలోని ఒక సంపాదనపరుడికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

కుటుంబ పోషణకు ఆధారమైన వ్యక్తి అనుకోని ప్రమాదం లేదా ఇతర కారణాలతో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా బీమా మొత్తం ఉపయోగపడనుంది. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన కుటుంబాలకు ఈ అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కుటుంబంలో ఉపాధి పొందుతున్న 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారిలో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకోవచ్చు. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని వయసు నిర్ధారణకు ప్రామాణికంగా తీసుకుంటారు. బీమా పొందే వ్యక్తిని, నామినీలను కుటుంబ సభ్యులే ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. రూ.5 లక్షల మొత్తాన్ని ఒకరికి లేదా పలువురు నామినీలకు ఏ నిష్పత్తిలో అందించాలనేది కూడా నిర్ణయించుకోవచ్చు. నామినీల పేర్లు, సంబంధాలు, ఆధార్ వివరాలు, వాటాల సమాచారాన్ని నమోదు చేయనున్నారు. డిజిటల్ విధానంలో వివరాలను నమోదు చేసి, కుటుంబ సభ్యులకు మరోసారి చదివి వినిపించి వారి అంగీకారంతో ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 14 నుంచి 18 వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డప్పు చాటింపు, దండోరా ద్వారా వివరాలను తెలియజేస్తారు. నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి అర్హుల వివరాలు సేకరిస్తారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 2,83,458 కుటుంబాలకు పథకం వివరాలు చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 20 మండలాల పరిధిలోని 385 గ్రామ పంచాయతీల్లో 2,01,038 కుటుంబాలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 136 వార్డుల్లో 82,420 కుటుంబాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పర్యవేక్షణలో ప్రచారం, అర్హుల గుర్తింపు, నమోదు ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి అర్హ కుటుంబానికి సమాచారం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో పిల్లల చదువులు, కుటుంబ పోషణ, అత్యవసర అవసరాలకు ఈ బీమా మొత్తం ఆర్థికంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నమోదు సమయంలో ఆధార్ వివరాలు, బీమా కోసం ఎంపిక చేసిన వ్యక్తి, నామినీల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారం అందించాలని కోరుతున్నారు.

హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం
నేటి బాలలే రేపటి పౌరులు: కొండా విజయ్‌కుమార్

శేరిలింగంపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి): జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ సర్కిల్ చందానగర్ ప్రభుత్వ పాఠశాలలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని నమ్మిన నెహ్రూ పిల్లల సంక్షేమం, ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. చిన్నారులపై ఆయనకున్న ప్రేమాభిమానాలకు గుర్తుగా నవంబర్ 14ను జాతీయ బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లల్లో చిన్ననాటి నుంచే సమాజం, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం, సత్ప్రవర్తన పెంపొందించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల స్థితిగతులను గుర్తించి క్రమశిక్షణతో చదువుకోవాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠాలతోపాటు జీవిత పాఠాలను కూడా శ్రద్ధగా నేర్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఉపాధ్యాయులు భీమమ్మ, విజయలక్ష్మి, ప్రీతి, కవిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు
- మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కంచర్ల రవి గౌడ్ విమర్శలు
- విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్



సిరిసిల్ల టౌన్, నవంబర్ 14 (జనంసాక్షి): ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని మరింత ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఆందోళనకు దిగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు హాస్టల్ వసతి ఎంతో అవసరమని, వాటిని మూసివేస్తే వారి చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. యూనివర్సిటీలోని ఈ-1, ఈ-2, డీ-బ్లాక్ హాస్టళ్లలో విద్యుత్, తాగునీరు వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హాస్టళ్లను యథావిధిగా కొనసాగించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థుల హక్కులు, భవిష్యత్తు కోసం బీఆర్ఎస్, టీఆర్ఎస్వీ అండగా ఉంటాయని తెలిపారు. సమావేశంలో నాయకులు ఎస్కే అప్రోచ్, ఆరెల్లి వినయ్, సదుల శేఖర్, కల్యాడపు వినయ్, వాల్సా అక్షయ్, కంభోజి హర్షిత్, అన్నడి మింటు, సందవేని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

- జాతీయ బాలల దినోత్సవ సంబరాలు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.వి .నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 14 జనం సాక్షి) : నెహ్రూ భారతదేశానికి అనేక సేవలను అందించారని, దేశ మొదటి ప్రధాన మంత్రిగా అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టారని, వారి అంకితభావం నేటికీ ఎంతో మందికి ఆదర్శమని, దేశ తొలి ప్రధానమంత్రిగా అనేక సేవలందించారని, వారి జయంతిని పురస్కరించుకొని స్థానిక కరీంనగర్లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ నెక్స్ (హై స్కూల్), అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ (ప్రైమరీ క్యాంపస్ - ఎస్ 6 క్యాంపస్), అల్ఫోర్స్ టైనీ టాట్స్ పాఠశాల, అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో, కిసాన్ నగర్‌లోని అల్ఫోర్స్ విద్యాభారతి హై స్కూల్లో, భగత్నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలల, విద్యారణ్యపురిలో గల అల్ఫోర్స్ కిడ్స్ జి పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలను చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల కేరింతల మధ్య వేడుకగా ప్రారంభించి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వాతంత్రం అనంతరం దేశంలో విజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికలకు వారు బలమైన పునాదులు వేశారని కొనియాడారు. నేటి బాలలే రేపటి పౌరులని బలంగా విశ్వసించిన వారికి పిల్లలంటే ఎంతో ప్రేమ ఉండేదని అందుకే పిల్లలంతా ఆయనను ప్రేమగా చాచా నెహ్రూ అని పిలుచుకునే వారని గుర్తు చేశారు. ఆయన జయంతిని జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భయం లేని బాల్యం అందించినప్పుడే వారి ఆశయాలకు నిజమైన నివాళి అని చెప్పారు. దేశంలో సాంకేతిక, వైద్య నిర్వహణ విద్యను బలోపేతం చేయడానికి ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్ వంటి ఉన్నత విద్యా సంస్థలను వారు స్థాపించి భారతదేశానికి ఎనలేని కీర్తిని తెచ్చారని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతంతో దేశంలోని అన్ని మతాలు కులాలకు సమాన హక్కులు ఉండేలా లౌకిక విధానాలను బలోపేతం చేశారని చెప్పారు. కొందరు చిన్నారులు నెహ్రూ వేషధారణలతో విచ్చేసి వేడుకలకు వన్నె తెచ్చారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సంస్కృతిక కార్యక్రమాలు చాలా అలరింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భారత్ సమ్మిట్'కు వ్యతిరేకంగా బీజేపీ నిరసన

- తెలంగాణ చౌక్‌లో నల్లజెండాలతో ఆందోళన
- రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- పోలీసులతో కార్యకర్తల తోపులాట.. 50 మంది అరెస్టు
- 'దేశవ్యతిరేక సమ్మిట్' అంటూ సాయిని మల్లేశం విమర్శలు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి): హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'ను వ్యతిరేకిస్తూ కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులు శనివారం నిరసన చేపట్టాయి. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం నేతృత్వంలో తెలంగాణ చౌక్‌లో నల్లజెండాలు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవడాన్ని నిరసిస్తూ ఆయనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

దిష్టిబొమ్మల దహనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. సుమారు గంటపాటు సాగిన ఆందోళనతో తెలంగాణ చౌక్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశంతో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నది 'భారత్ సమ్మిట్' కాదని, 'దేశవ్యతిరేక సమ్మిట్' అని విమర్శించారు. దేశ ప్రధాని, అభివృద్ధిని అడ్డుకునే శక్తులకు, రాజ్యాంగబద్ధ సంస్థలను అగౌరవపరిచే వ్యక్తులకు హైదరాబాద్‌ను వేదికగా మార్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి సదస్సులు నిర్వహిస్తోందని విమర్శించారు. నిరసనలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై.సునీల్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట్‌రెడ్డి, గుజ్జ శ్రీనివాస్‌రావు, కనమల్ల గణపతి, పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతన్నను నిలువునా ముంచుతున్న మొక్కజొన్న సీడ్ కంపెనీ ఏజెంట్లు

- గతేడాది పంట డబ్బులే దిక్కులేవు..
- మళ్లీ కొత్త విత్తనాల వ్యాపారానికి తెరలేపారు
- బాండ్లు లేవు.. ఒప్పందాలు లేవు.. చెల్లింపులకు గ్యారంటీ లేదు
- ఏజెంట్ల మాయమాటలకు రైతులు బలి..
- కంపెనీలకు అధికారుల అండ ఉందా?
- రైతు కష్టాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్నారా? గత బకాయిలు తేల్చకుండా కొత్త పంపిణీకి అనుమతి ఎలా?



ఏన్కూర్, నవంబర్ 14 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలంలో సీడ్ మొక్కజొన్న విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. గ్రామాల వెంట తిరుగుతున్న కంపెనీల ఏజెంట్లు రైతులకు రకరకాల ఆశలు చూపిస్తూ విత్తనాలు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక దిగుబడులు వస్తాయని, పంట కొనుగోలుకు ఇబ్బందులు ఉండవని, మంచి ఆదాయం పొందవచ్చని నమ్మబలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కానీ గత ఏడాది ఇదే తరహాలో సాగు చేసిన రైతులకు సంబంధించిన పంట డబ్బులు ఇంకా పూర్తిస్థాయిలో అందలేదనే ఆరోపణలు ఉండటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది రైతులకు ఇచ్చిన హామీలే నెరవేర్చని కంపెనీలు మళ్లీ ఏ ముఖంతో విత్తనాల పంపిణీ చేపడుతున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

విత్తనాలు ఇచ్చేటప్పుడు హామీలు.. పంట చేతికొస్తే ముఖం చాటేస్తారా?

సీడ్ మొక్కజొన్న సాగు విషయంలో కంపెనీల ఏజెంట్లు రైతులకు మౌఖిక హామీలు ఇస్తున్నారే తప్ప, పంట కొనుగోలు ధర, దిగుబడి ప్రమాణాలు, చెల్లింపుల గడువు, నష్టపరిహారం వంటి అంశాలపై స్పష్టమైన రాతపూర్వక ఒప్పందాలు ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా రైతులకు ఎలాంటి బాండ్లు ఇవ్వకుండా కేవలం ఏజెంట్ల మాటలపైనే సాగు చేయాలని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. విత్తనాలు అమ్ముకునే సమయంలో రైతుల చుట్టూ తిరిగే ఏజెంట్లు, పంట చేతికొచ్చి డబ్బులు చెల్లించే సమయానికి అందుబాటులో ఉంటారా? ఒకవేళ కంపెనీ కొనుగోలుకు నిరాకరిస్తే రైతు పరిస్థితి ఏమిటి? నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారు?

పాత బకాయిలు చెల్లించకుండా కొత్త వ్యాపారమా..?

గత ఏడాది సీడ్ మొక్కజొన్న సాగు చేసిన రైతులకు చెల్లించాల్సిన డబ్బులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ బకాయిలపై స్పష్టత ఇవ్వకుండా, రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ కొత్త సీజన్‌కు విత్తనాల పంపిణీ చేపట్టడం వెనుక కంపెనీల ఉద్దేశం ఏమిటి? గత ఏడాది పంటకు సంబంధించిన లెక్కలు తేల్చకుండా ఈ ఏడాది మళ్లీ రైతులను సాగులోకి దించడం ఎంతవరకు సమంజసం? రైతు పెట్టుబడి పెట్టాలి.. భూమి ఇవ్వాలి.. పగలు రాత్రి కష్టపడాలి.. చివరకు పంట డబ్బుల కోసం కంపెనీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఎందుకు? రైతుల శ్రమకు విలువ లేదా?

అధికారులకు తెలియకుండానే సాగుతున్న పంపిణీనా..?

మండలవ్యాప్తంగా విత్తనాల పంపిణీ జరుగుతున్నా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏయే కంపెనీలు విత్తనాలు పంపిణీ చేస్తున్నాయి? వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఏజెంట్లకు అధికారిక గుర్తింపు ఉందా? రైతులతో ఎలాంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు? గత ఏడాది రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై విచారణ జరిగిందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఇంత పెద్ద ఎత్తున విత్తనాల పంపిణీ జరుగుతోందా? లేక అన్నీ తెలిసి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలకు ఇప్పటివరకు నిర్ధారిత ఆధారాలు లేవు.వ్యవసాయాన్ని నమ్ముకుని అప్పులు చేసి సాగు చేసే రైతన్నకు కంపెనీల మౌఖిక హామీలు రక్షణ కల్పించలేవు. విత్తనాలు పంపిణీ చేసే ముందు కంపెనీల నుంచి రాతపూర్వక ఒప్పందాలు తీసుకోవాలి. గత ఏడాది పెండింగ్‌లో ఉన్న చెల్లింపులపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి. కంపెనీలు, ఏజెంట్ల వివరాలను సేకరించి వారి బాధ్యతలను నిర్ధారించాలి. రైతులకు నష్టం జరిగితే బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.ఒకవైపు రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే.. మరోవైపు కంపెనీల హామీల వ్యాపారం కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తనాలు అమ్మే ముందు కంపెనీలకు రైతులు గుర్తొస్తారు.. పంట చేతికొచ్చాక అదే రైతులు ఎందుకు గుర్తుకురావడం లేదు? గతేడాది బకాయిలు తేల్చకుండా ఈ ఏడాది మళ్లీ విత్తనాల పంపిణీకి తెరలేపిన కంపెనీలపై వ్యవసాయ శాఖ విచారణ చేపడుతుందా? లేక రైతన్న మరోసారి ఏజెంట్ల హామీలకు బలవుతాడా? ఏన్కూరు మండల రైతులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత కంపెనీలు, వ్యవసాయ శాఖ అధికారులపై ఉంది.

చేవెళ్లలో 22 కిలోల గంజాయి పట్టివేత

- విజయవాడ నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా ఇద్దరు నిందితులు అరెస్ట్



చేవెళ్ల, నవంబర్ 14 (జనంసాక్షి) : చేవెళ్లలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా 22 కిలోల గంజాయి పట్టుబడింది. కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శనివారం చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల పట్టణంలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా (ఏపీ 39 డబ్ల్యూడబ్ల్యూ 6222) నంబరు గల కారును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 22 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన నక్క నారాయణ (30), రాణిమేకల నాగరాజు (29)గా నిందితులను గుర్తించారు. వీరిద్దరూ విజయవాడ నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. చేవెళ్లలో పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ప్రధాన నిందితుడైన నక్క నారాయణపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఉన్న డొంకరాయి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు గుర్తించారు. గంజాయి ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? అక్రమ రవాణా వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ వెల్లడించారు.

ఆధ్యాత్మిక చైతన్యంతోనే ధర్మ పరిరక్షణ



అల్వాల్, నవంబర్ 14 (జనంసాక్షి) : ఆధ్యాత్మిక చైతన్యంతోనే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమని, ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒక్కసారైనా ఆలయాలను దర్శించాలని భోగ విష్ణుమూర్తి పిలుపునిచ్చారు. శనివారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ హిల్స్ వేంకటేశ్వర ఆలయం, సిటిజన్ కాలనీ, పాత అల్వాల్, మచ్చబొల్లారంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో 'జాగో హిందూ జాగో' నినాదంతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు పవిత్ర గ్రంథాలను పఠిస్తూ వాటిలోని ధర్మాన్ని ఆచరించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, ఇతర పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమంలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 14 (జనం సాక్షి) : పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.
ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు రానున్నారు. వెలుగుమట్ల మోడల్ కాలనీ, మున్నేరు కేబుల్ బ్రిడ్జి, మిర్చి మార్కెట్‌లను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోంది.

సాగునీరు, తాగునీటి సమస్యలపై ప్రభుత్వం అప్రమత్తం

ఎల్‌నినో ప్రభావంతో నాగార్జునసాగర్ నుంచి ఆశించిన స్థాయిలో నీరు అందలేదని మంత్రి తెలిపారు. అయినప్పటికీ ఖమ్మం జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందన్నారు.సాగర్ ఆయకట్టు పరిధిలోని సుమారు లక్షన్నర ఎకరాల పంటలను గోదావరి జలాలను మళ్లించడం ద్వారా కాపాడుకోగలిగామని వివరించారు.
మురసు తుఫాన్ కారణంగా రైతులు చేతికందిన పంటలను కోల్పోవడం బాధాకరమని, ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖమ్మం నగర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఖమ్మం నగరంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సూచించారు. పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఫుట్‌పాత్‌లను



అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల ఆశీస్సులు, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

కుల దూషణ ఆరోపణలపై ఎన్‌సీఎస్‌సీ నోటీసు

- కలెక్టర్, ఎస్పీలకు 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

మాడుగులపల్లి, నవంబర్ 14 (జనం సాక్షి) : మాడుగులపల్లి మండలం ఇస్కాబావిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ నోటీసు జారీ చేసింది. ఫిర్యాదుదారుడి ఆరోపణ ప్రకారం, తనపై కుల దూషణ, దాడి జరిగిందని పేర్కొన్నట్లు నోటీసులో ఉంది. ఈ ఫిర్యాదుపై కమిషన్ విచారణకు నిర్ణయించినట్లు తెలిపింది ఈ మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు కమిషన్ డైరెక్టర్ డా. జి. సునీల్ కుమార్ బాబు తేదీ: 12/11/2026 న నోటీసు జారీ చేశారు. ఫైల్ నంబర్: ఏపీసీర్ /ఐపీ /టీజీ /2026/349360 నోటీసు అందిన 15 రోజుల లోపు తీసుకున్న చర్యలపై నివేదికను కమిషన్ కు పంపాలని అందులో కోరినట్లు తెలుస్తోంది నివేదికలో ఫ్ ర్ ఐ వివరాలు, తీసుకున్న చర్యలు, నిబంధనల ప్రకారం బాధితుడికి అందించే పరిహారం వివరాలు పేర్కొనాలని సూచించినట్లు సమాచారం నిర్ణీత గడువులోగా సమాధానం రాకపోతే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం కమిషన్ కు ఉన్న అధికారాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నోటీసు కాపీని ఫిర్యాదుదారుడికి కూడా పంపినట్లు సమాచారం.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశం లో పలువురు దళిత, గిరిజన సంఘాల నాయకులు..



ముషీరాబాద్, నవంబర్ 14 (జనం సాక్షి) : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం, ఇల్లు లేని వారికి ఇళ్ల నిర్మాణం, నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని, ఎస్సీ, ఎస్టీల హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సమావేశానికి దళిత, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు రాగాల నాగేశ్వరరావు, సుదర్శన్ బాబు, స్కైలాబ్ బాబు, మేడి పాపయ్య, కలానిధి మాస్టర్, జి ఏకు తిరుపతి, చింతా సాంబమూర్తి, రుద్రారం శంకర్, గణేష్, భూపాలరావు, కొమురయ్య, వినోద్ కుమార్, ఎర్రోళ్ల శివయ్య, గుంటి విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

సీ స్క్వేర్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



అల్వాల్, నవంబరు 14 (జనంసాక్షి) : అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డి కాలనీలో ఉన్న సీ స్క్వేర్ ప్రాంగణంలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ సోదాలు నిర్వహించారు. సీఐ ప్రశాంత్ నేతృత్వంలో ఎస్సై గీత, సిబ్బంది పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సీఐ ప్రజలకు సూచించారు.

అంతరిక్షమే భవిష్యత్తు యుద్ధరంగం

- స్వదేశీ రక్షణ సాంకేతికత అభివృద్ధికి సమన్వయం అవసరం



అల్వాల్, నవంబర్ 14 (జనంసాక్షి) : భవిష్యత్తు యుద్ధాల్లో అంతరిక్షం కీలక రణక్షేత్రంగా మారనుందని, జాతీయ భద్రత దృష్ట్యా స్వదేశీ సైనిక అంతరిక్ష సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సైనిక నిపుణులు అభిప్రాయపడ్డారు. తిరుమలగిరి లోని సైనిక ఎలక్ట్రానిక్స్, యాంత్రిక ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం 'సైనిక రంగంగా అంతరిక్షం' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. త్రివిధ దళాల అధికారులు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ ఐ.ఎస్. రాథోర్ మాట్లాడుతూ.. సాయుధ దళాలు, పరిశోధన సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తేనే రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధ్యమన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్యాల సాధనలో స్వదేశీ అంతరిక్ష ఆవిష్కరణలు కీలకమని పేర్కొన్నారు. సదస్సులో అంతరిక్ష ఆధారిత యుద్ధ వ్యూహాలు, అంతర్జాతీయ భద్రతా సవాళ్లు, నిఘా వ్యవస్థలు, స్వదేశీ ఉపగ్రహాల సైనిక వినియోగంపై చర్చించారు. అంతరిక్ష సమాచార భద్రతకు సూక్ష్మాణు సాంకేతికత వినియోగం, రక్షణ రంగంలో అంకుర సంస్థల భాగస్వామ్యంపైనా నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కళాశాల ఉప కమాండెంట్ మేజర్ జనరల్ ప్రదీప్ గోదారా పాల్గొన్న ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలి

సూర్యాపేట, నవంబర్ 14 (జనంసాక్షి) : ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఎన్.కవిత డిమాండ్ చేశారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయుసీ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఆశా వర్కర్స్ కు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు.ప్రతి ఆదివారం సెలవుతో పాటు పండుగ సెలవులు, క్యాజువల్ లీవ్స్ వేతనంతో కూడిన సెలవులను 60 రోజులు ఇవ్వాలని అన్నారు.రిటైర్మెంట్ రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రెండో పీఆర్సీలో ఆశాలకు 30వేల రూపాయలు వేతనం నిర్ణయించాలని పేర్కొన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ ఇవ్వాలని, ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు.ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ నాయకురాలు పి.అరుణకుమారి, రాధ, విజయ,భాగ్యలక్ష్మి, ఉమా, సరస్వతీ,సుజాత, అనిత, సబిత,కళమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయుల హక్కుల సాధనే లక్ష్యం

- పాత్రికేయుల సంక్షేమానికి ఎప్పుడు అండగా ఉంటా
- ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ రెడ్డి

దోమ, నవంబర్ 14 (జనం సాక్షి) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టి యు డబ్ల్యూ జే ఐ జే యు) వికారాబాద్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన అధ్యక్షుడిగా పవన్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన రాష్ట్రస్థాయి పత్రికేయ నాయకులకు జిల్లాలోని పాత్రికేయ మిత్రులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పత్రికయ్య మిత్రులందరికీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని స్పష్టం చేశారు. మీ అందరి విశ్వాసం ఆశీర్వాదమే నా బలం ముందు ముందు కూడా ఎల్లప్పుడూ మీతోనే ఉంటాను



అని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాసమస్యలు నిరంతనం వెలుగులోకి తెస్తూ శ్రమిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు సంక్షేమం కోసం తాను ముందుండి పనిచేస్తానని పేర్కొన్నారు. పాత్రికేయులకు ఎలాంటి ఆపద వచ్చిన వృత్తిపరమైన ఇబ్బందులు ఎదురైన దక్షిణమే స్పందించి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. జిల్లాలోని పత్రికేయులందరినీ ఏకతాటి తీసుకొచ్చి సంఘం బలోపేతానికి విభేదం లేకుండా కృషి చేస్తానని పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. పత్రికేయుల హక్కుల సాధన కోసం వారి కుటుంబాల భద్రత కోసం ప్రభుత్వానికి అధికారులకు వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హులైన పత్రికేయులు అందరికీ ఇళ్లస్థలాలు ఆరోగ్య కార్డులు గుర్తింపు కార్డుల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలియజేశారు. సమాజ హితం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల పక్షాన నిలబడటం తన బాధ్యతగా భావిస్తున్నానని ఏ సమయంలోనైనా మిత్రులు తనను సంప్రదించవచ్చునని సూచించారు. తన ఎన్నికకు సహకరించిన సీనియర్ పత్రికలకు సంఘం బద్ధులకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. పవన్ కుమార్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక పట్ల జిల్లాలోని పలువురు పత్రికలు ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
15 నవంబర్ 2026

పద్మశ్రీ డిమ్రీకి 'ఉత్తరాఖండ్ గౌరవ సన్మాన్-2026'

విజ్ఞాన శాస్త్ర రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపు..

- యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా పురస్కారం ప్రదానం



ఉప్పల్ / హబ్సిగూడ, నవంబర్ 14 (జనం సాక్షి): ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త, సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ మాజీ సంచాలకులు పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ ప్రసాద్ డిమ్రీకి ప్రతిష్ఠాత్మకమైన 'ఉత్తరాఖండ్ గౌరవ సన్మాన్-2026' పురస్కారం లభించింది. విజ్ఞాన శాస్త్రం, సమాజానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నవంబర్ 11న లక్నోలో నిర్వహించిన ఉత్తరాఖండ్ మహోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా డిమ్రీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలోనూ డిమ్రీ పరిశోధనలకు గుర్తింపు లభించింది. అన్వేషణ భూభౌతిక శాస్త్రంలో గురుత్వాకర్షణ, అయస్కాంత క్షేత్రాల అధ్యయనాలకు ఫ్రాక్టల్ జ్యామితి, స్కేలింగ్ విధానాలను అన్వయించడంలో చేసిన విశేష కృషికి యూరోపియన్ జియోసైన్సెస్ యూనియన్ ఆయనకు 'క్రిస్టియాన్ హ్యూయ్జెన్స్ మెడల్-2026'ను ప్రకటించింది.

1970లో సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐలో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డిమ్రీ, ఐదు దశాబ్దాలకు పైగా సంస్థకు సేవలందించారు. 2001 అక్టోబర్ నుంచి 2010 ఫిబ్రవరి వరకు సంస్థ సంచాలకులుగా బాధ్యతలు నిర్వహించారు. ఫ్రాక్టల్ మోడలింగ్, ఇన్వర్స్ థియరీ, సిగ్నల్ ప్రాసెసింగ్, గురుత్వాకర్షణ, అయస్కాంత క్షేత్రాల విశ్లేషణ వంటి రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. ఖనిజాలు, హైడ్రోకార్బన్ల అన్వేషణ, భూగర్భజలాల అధ్యయనాలు, కార్బన్ డై ఆక్సైడ్ భూగర్భ నిల్వ వంటి కీలక రంగాల్లో ఆయన పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి. ఫ్రాక్టల్ జ్యామితి, హోరోనోయ్ టెస్సలేషన్ పద్ధతులను సమన్వయం చేస్తూ చేసిన వినూత్న పరిశోధనలకు 2007లో అమెరికా పేటెంట్ కూడా లభించింది. 150కి పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించిన డిమ్రీ, పలు పరిశోధనా గ్రంథాలను రచించారు. 2010లో పద్మశ్రీ, 2007లో అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ లోరెంజ్ అవార్డు లెక్చర్, 2010లో ఆసియా ఓషియానియా జియోసైన్సెస్ సొసైటీ ఆక్స్‌ఫర్డ్ లెక్చర్, ఫ్యాప్సి అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ అవార్డు, 2013లో జాతీయ భూవిజ్ఞాన పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయనను వరించాయి. తమ మాజీ సంచాలకులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించడం పట్ల సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ హర్షం వ్యక్తం చేసింది. ఆయన పరిశోధనలు భూవిజ్ఞాన రంగానికి విశేష దోహదం చేయడంతో పాటు యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని సంస్థ పేర్కొంది.

టైప్-1 మధుమేహ చిన్నారులకు అండగా ప్రభుత్వం

- డాక్టర్ క్రిస్టినా జెడ్.చోంగ్తూ
- నిమ్స్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవం.. చిన్నారుల కోసం ప్రత్యేకం



ఖైరతాబాద్, నవంబర్ 14 (జనం సాక్షి) : టైప్-1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలంగాణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్.చోంగ్తు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఈ వైద్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇన్సులిన్ వంటి ప్రాణరక్షక మందులు అందక ఏ చిన్నారికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిమ్స్ ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉదయం 8 గంటలకు ఎమర్జెన్సీ భవనం వద్దనున్న బుద్ధ విగ్రహం నుంచి పంజాగుట్ట ప్రధాన ద్వారం వరకు మధుమేహంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఎమర్జెన్సీ భవనంలోని ట్రామా ఆడిటోరియంలో టైప్-1 మధుమేహంతో జీవిస్తున్న చిన్నారులు, వారి కుటుంబాల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. చిన్నారులు ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని అభినందించారు. మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో పరీక్షలు నిర్వహించడం ద్వారా సరైన చికిత్స అందించి భవిష్యత్తులో వచ్చే సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. నిమ్స్‌లో అమలు చేస్తున్న ఇన్సులిన్ పంప్ కార్యక్రమం చిన్నారుల చికిత్సలో కీలక మార్పు తీసుకువస్తోందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని ప్రశంసించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ టైప్-1 మధుమేహ చిన్నారులకు సమగ్రంగా, అందుబాటు ధరల్లో ఆధునిక వైద్య సేవలు అందించేందుకు నిమ్స్ కట్టుబడి ఉందన్నారు. అధునాతన మధుమేహ చికిత్సా విధానాలను మరింత మందికి అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కార్యక్రమాలను బలో పేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ బియాట్రిస్ ఆన్ మాట్లాడుతూ ఇన్సులిన్ పంప్ కార్యక్రమంతో పాటు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతర వైద్య అవగాహన, అవసరమైనప్పుడు వైద్య సహాయం అందిస్తున్నామని వివరించారు. టైప్-1 మధుమేహం ఉన్న ప్రతి చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందించి, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడిపేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరమజ్యోతి, వైద్య అధ్యాపకులు ప్రొ.గంగాధర్, ప్రొ.సుబ్బలక్ష్మి, వైద్య నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తేజశ్రీకి మద్దతుగా తరగతి గదుల్లోనే విద్యార్థుల నిరసన

రాజేంద్రనగర్, నవంబర్14 (జనంసాక్షి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళా ప్రొఫెసర్ తేజశ్రీకి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొనకుండా అధికారులు విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆరోపణలు రావడంతో, విద్యార్థులు తరగతి గదుల్లోనే ఆందోళన చేపట్టి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. వైస్ ఛాన్సలర్‌ను విధుల నుంచి తప్పించి నిష్పక్షపాత విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకనుగుణంగా ఓవర్ బర్డెన్‌ను తొలగించాలి

సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి



హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి మొత్తం మీద అత్యధిక బొగ్గును ఉత్పత్తి చేస్తున్న కొత్తగూడెం రీజియన్ (కొత్తగూడెం ఏరియా, సత్తుపల్లి ఏరియా, ఇల్లందు ఏరియా, మణుగూరు ఏరియా) లో లక్ష్యాలకు తగిన విధంగా ఓవర్ బర్డెన్ తొలగించాలని, దీనికి అనుగుణంగా ఏజెన్సీలు తగిన సంఖ్యలో యంత్రాలను, మానవ వనరులను సమకూర్చుకోవాలని సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. శనివారం ఉదయం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన కొత్తగూడెం రీజియన్ లోని పలు ఓపెన్ కాస్ట్ గనుల బొగ్గు ఉత్పత్తి, అందుకు అనుగుణంగా సాగుతున్న ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు రవాణా, తదితర అంశాలపై ఆయా ఏరియాల జీఎంలు, ఓబీ తొలగింపు ఏజెన్సీల ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి సంస్థ ప్రతీ రోజు తెలంగాణ జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 75 వేల టన్నుల బొగ్గును సరఫరా చేయాల్సి ఉంటుందని, అదే సమయంలో సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న విద్యుత్ కేంద్రాల అవసరాలకు బొగ్గును రవాణా చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి సాధించాలంటే ఓవర్ బర్డెన్ తొలగింపు నిర్దేశిత లక్ష్యాల మేర జరగాలని స్పష్టం చేశారు. నిత్యం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓవర్ బర్డెన్ తొలగిస్తేనే దాని కింద ఉన్న బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు కలిపి రోజుకు 14.15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ లక్ష్యాలను సాధించాలని, వీటిలో కొత్తగూడెం రీజియన్‌కు సంబంధించిన నాలుగు ఏరియాలు రోజుకు 5.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను ప్రతీ రోజు తొలగించాల్సి ఉంటుందని సీఎండీ స్పష్టం చేశారు. కొత్తగూడెం రీజియన్ లోని నాలుగు ఏరియాల గనులలో సాగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు రవాణా, తదితర అంశాల పైన అధికారులు వివరించగా ప్రతీ అంశాన్ని ఛైర్మన్ కూలంకషంగా చర్చించి ఆదేశాలు జారీ చేశారు. కొత్తగూడెం ఏరియా నుంచి రోజుకు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 0.55 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు జరగాలని, సత్తుపల్లి ఏరియాలో రోజుకు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఇందుకోసం రోజుకు 2.4 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలన్నారు. మణుగూరు ఏరియాలో రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని, ఈ లక్ష్యాల సాధన కోసం రోజుకు 2.25 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇల్లందు ఏరియాలో రోజుకు 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, 10 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని స్పష్టం చేశారు. వచ్చే కొద్ది నెలల్లో కాంట్రాక్టు కాలపరిమితి ముగియనున్న గనులకు సంబంధించిన అంశాలపై కూలంకషంగా చర్చించారు.

చేతబడి అనుమానంతో మహిళపై విచక్షణారహిత దాడి

- వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాటం
- హైదరాబాద్‌లో అత్యవసర చికిత్స

భద్రాచలం నవంబర్ 14 (జనంసాక్షి): చేతబడి చేసి తనను, తన కుమారుడిని చంపేందుకు ప్రయత్నించిందనే అనుమానంతో ఓ వ్యక్తి మహిళపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స పొందుతోంది. భద్రాచలం ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కొర్ర విజయలక్ష్మిపై ఆమె అక్క కుమారుడు కరెళ్ల కృష్ణకు మధ్య చేతబడి విషయమై వివాదం చోటుచేసుకుంది. విజయలక్ష్మి తనకు, తన కుమారుడికి చేతబడి చేసిందనే అనుమానంతో కృష్ణ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఆమె ముఖం, నోరు, కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి బంధువు పి. రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మైనర్ డ్రైవర్లతో టిప్పర్ల మితిమీరిన వేగం

ప్రాణభయంతో వణికిపోతున్న గ్రామస్తులు

- రెండో శనివారం అదనుగా రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

మాడుగులపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి): నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం గోపాలపురం పరిధిలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. ప్రభుత్వ శాఖల నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే జేసీబీలతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ, పక్క మండలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానిక గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు రెండో శనివారం సెలవు కావడం, అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉంటుందనే ధీమాతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఇక్కడ తవ్విన మట్టిని సరిహద్దులు దాటించి ఇతర మండలాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

మైనర్ల చేతిలో టిప్పర్ల స్టీరింగ్.. రోడ్డెక్కాలంటేనే భయం!

ఈ అక్రమ రవాణాలో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, కనీస డ్రైవింగ్ అనుభవం లేని మైనర్ల చేతికి భారీ టిప్పర్ల స్టీరింగ్ అప్పగించడం. రహదారి నిబంధనలపై ఏమాత్రం అవగాహన లేని డ్రైవర్లు గ్రామాల గుండా అతివేగంతో టిప్పర్లను నడుపుతుండటంతో, ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

నామమాత్రపు జరిమానాలతోనే సరి..

గతంలో పలుమార్లు అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకుని జరిమానాలు విధించినప్పటికీ, అవి నామమాత్రంగానే ఉండటంతో అక్రమార్కుల్లో భయం లేకుండా పోయిందని గ్రామస్తులు అంటున్నారు జరిమానాలు కట్టి వాహనాలను విడిపించుకోవడం, ఆ తర్వాత రూటు మార్చి మళ్లీ అదే దందాను కొనసాగించడం పరిపాటిగా మారిందని విమర్శిస్తున్నారు ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ మరియు పోలీస్ శాఖల అధికారులు స్పందించి, అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, ముఖ్యంగా మైనర్లతో వాహనాలు నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ ప్రాణాలను కాపాడాలని గోపాలపురం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారుల చిరునవ్వే అభివృద్ధికి కొలమానం: సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : చిన్నారుల ఆనందమే నిజమైన అభివృద్ధికి కొలమానమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యం, మెరుగైన ఆరోగ్యం, పోషకాహారం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శనివారం బాలల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమం, రక్షణకు సంబంధించి నాలుగు కొత్త కార్యక్రమాలను ప్రారంభించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న స్యామ్, మామ్ చిన్నారుల పర్యవేక్షణకు ఏఐ ఆధారిత వ్యవస్థను ప్రారంభించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే ఆరు నూతన ప్రత్యేక దత్తత సంస్థలు, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో నాలుగు కొత్త చైల్డ్‌లైన్ సహాయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పిల్లలపై వేధింపులు, బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు ఆపదలో ఉన్న చిన్నారులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని సీతక్క అన్నారు. దత్తత ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించి, చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

17న టీఎస్ సీపీఎస్ఈయు ఆధ్వర్యంలో ధర్మదీక్ష

సూర్యాపేట(జనంసాక్షి):ఈ నెల 17న సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2023 నవంబర్ 17న కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్మ దీక్ష చేయనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి గుయ్యని ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు ధర్మదీక్షలో పాల్గొని నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.మూడు సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్న సీపీఎస్ రద్దు హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు.

జర్నలిస్టులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి
- టియుడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ ఆలీ



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 14 (జనంసాక్షి) : ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి చేరవేసే పాత్రికేయులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ మంచిర్యాల జిల్లా ఆత్మీయ తృతీయ మహాసభకు డి.సి.పి. ఎ.భాస్కర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, ఐ.జె.యు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, ఎనగందుల రవీందర్, కేశెట్టి వంశీకృష్ణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జర్నలిస్టులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వార్తల ప్రచురణలో నిష్పాక్షికత, నిజానిజాల పరిశీలనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. యూనియన్ ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం ఆ సంఘంలోని సభ్యుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, ఆపద సమయాలలో అండగా నిలవడం, అవసరమైన సందర్భాలలో బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు కల్పించడం ఉంటుందని తెలిపారు. యూనియన్ సభ్యుల సంక్షేమంతో పాటు వృత్తిపరమైన బాధ్యతలు, విలువలను కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో జర్నలిజం రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, గతంలో ఒక జిల్లాలో పరిమిత సంఖ్యలో మాత్రమే జర్నలిస్టులు ఉండేవారని, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ప్రతి పరిణామాన్ని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యతతో జర్నలిస్టుల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. పరిపాలనా వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, న్యాయవ్యవస్థతో పాటు మీడియా కూడా విమర్శలకు అతీతం కాదని, ప్రతి వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని తెలిపారు. వృత్తిపరమైన నైతిక విలువలు, బాధ్యతాయుతమైన వార్తా సేకరణ, నిష్పాక్షికతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జర్నలిజం రంగంపై ప్రజలలో మరింత విశ్వసనీయత పెరుగుతుందని తెలిపారు. జర్నలిస్టులు వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

టియుడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాత్ ఆలీ మాట్లాడుతూ.... మహాసభలు కేవలం ఎన్నికల ప్రక్రియకు మాత్రమే పరిమితం కాకుండా, గత మహాసభ నుంచి ఇప్పటివరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమగ్రంగా చర్చించుకునే వేదికలుగా ఉండాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి 75 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ట్రేడ్ యూనియన్ స్ఫూర్తితో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి నైతిక విలువల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ విలేకరులకు పత్రికా యాజమాన్యాలు ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వకుండా, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయించేవని, కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కూడా నిరాకరించిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. అలాంటి సమయంలో గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు గుర్తింపు, అక్రిడిటేషన్ కార్డులు కల్పించేందుకు సంఘం నిరంతరం పోరాటం చేసిందని తెలిపారు. సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టులకు నిరంతర శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

డిసిపి భాస్కర్ మాట్లాడుతూ... సమాజంపై అవగాహన, సామాజిక స్పృహ, ప్రజలకు మంచి చేయాలనే సంకల్పం ఉన్నవారే పాత్రికేయ వృత్తిని ఎంచుకుంటారని, సమాజంలో చైతన్యం తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పాత్రికేయ వృత్తి పట్ల ప్రత్యేకమైన ఆసక్తి, వార్తా సేకరణతో పాటు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంపై అభిరుచి ఉన్నవారే ఈ రంగంలో కొనసాగగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.యు.డబ్ల్యు.జె. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు, వివిధ మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370